
ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
4 అణాలు
25-6-'52



మహాబలిపురంలో దీప స్తంభం

—ఛాయాచిత్రకారుడు: శ్రీ పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి.

సంవత్సర చందా
రు 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder . K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 42
25-6-52

నందన ఆషాఢ శుద్ధ తదియ బుధవారము

విషయానుక్రమణిక

భారతప్రభుత్వ వైదేశిక విధానం

పార్లమెంటు చర్చలలో యిటీవల భారత ప్రభుత్వ వైదేశిక విధానాన్ని గూర్చిన ప్రశస్తి మాటిమాటికీ విన వస్తున్నది. గతవారంలో భారత ప్రధాని నెహ్రూగారు మన వైదేశిక విధానాన్ని గూర్చి మరొక ప్రకటన చేశారు. ఈసారి యీయన చేసిన ప్రకటనలో ఐక్యరాజ్యసమితి దిగజారిపోతున్నదని చేసిన హెచ్చరిక అతి ప్రధానమైనది. ప్రపంచ దేశాలమధ్య యుద్ధం ప్రజ్వరిల్లకుండా శాంతి [illegible] సదా [illegible] వుండే [illegible] ఐక్యరాజ్యసమితి అనేది. [illegible] వుండగా, యిటీవల యీ సమితిలో పలుకుబడిగల సభ్యదేశాలు కొన్ని ప్రతి[illegible] దేశాలపై యుద్ధప్రకటనకు సమితినే ఒక సాధనంగా వుపయోగించుకొంటున్నాయి.

నెహ్రూ మరొక ముఖ్యమైన ప్రకటన కూడా చేశారు. భారతదేశం పరాయిదేశాల వారు యిచ్చే సహాయాన్ని స్వీకరిస్తుంది కానీ, అలా సహాయం చేయవచ్చిన దేశాలవారు ఎటువంటి షరతులు పెట్టినా దానికి ఏంతమాత్రం ఒప్పుకోబోదని ఖండితంగా చెప్పివేశారు.

భారత ప్రభుత్వం తన వైదేశిక విధానంలో ముఖ్యంగా అనుసరించేది శాంతి పథమేనని విస్పష్టంగా చెప్పారు. ఈ విధానం ఏ ఒక్కవ్యక్తీ నిర్ణయించింది కాదనీ, యిన్ని వేల సంవత్సరాలుగా నడుస్తున్న భారతదేశచరిత్ర, సంస్కృతులే యీ శాంతి పథాన్ని నిర్ణయించినాయనీ యీయన అన్నారు.

మిత్రరాజ్యసమితి సైన్యాలను కొరియాలో 38 వ అక్షాంశరేఖ దాటిపోవద్దని చెప్పినా, యీనాడు సింగమన్‌రీ వేసే కుతంత్రాలను తెగనాడినా, నాడు యిండోనీషియా స్వాతంత్ర్య పోరాటం విషయంలో జోక్యం కల్పించుకొన్నా, నవచైనాను పరిగణించమన్నా, యీ అన్ని చర్యలలోనూ భారత ప్రభుత్వం శాంతిని ఆకాంక్షించి, ధర్మాన్ని ఎంచి చేసిందే కానీ, ఆయా దేశాల ఆర్థిక సహాయాన్ని కానీ, అంగ సహాయాన్ని కానీ అర్థించి కాదు.

నలభైకోట్లకుపైగా జనాభా కలిగి వున్నందువల్ల, [illegible] వ్యవహారాల [illegible] ఆయుధబలం [illegible] జనాభా [illegible] వుండి [illegible] పథాన్ని [illegible] భారత [illegible] తరఫున [illegible] ప్రపంచ [illegible] నైతి[illegible] సాధించుకున్న [illegible] సాధించగల [illegible] భవి[illegible] యీ 12 స[illegible] పోటులో పలి[illegible] నాయకత్వం [illegible] నికి వుండ[illegible] విషయం [illegible] ప్రతిబంధ[illegible] ఖండానికి [illegible] నాయకత్వం [illegible] సంపాదించటం మాత్రమే [illegible] అలాంటి స్థానాన్ని పొందివున్న దేశం కనుకనే, భారతదేశంలోని ఫ్రెంచి పోర్చుగీసు వలస భాగాల విషయంలో కూడా మనమనుసరించే వైఖరి బెదిరింపులతో నిండివుండక, సౌజన్యపూరితంగా వుంటున్నది.

మన పార్లమెంటులో ప్రభుత్వవ్యతిరేక పక్షాలవారు యీ విధాన ప్రాశస్త్యాన్ని అంతగా గుర్తించలేకపోతున్నారు. వారు

ఎంతసేపు వాదించినా భారతదేశం కామన్ వెల్తులో వుండటం కూడదంటారు కామన్ వెల్తుకు కట్టుబడివుండటం మూలంగా భారతదేశం ఆంగ్లో అమెరికన్ దేశాలు పోయిన బాటనే విధిగా పోవలసివస్తున్నదని వీరు ఆరోపించారు చైనా, రష్యాలతో యింకా ఎక్కువ సన్నిహిత సంబంధాలు పెంచుకోవాలని వీరు కోరుతున్నారు. ఈ అన్ని అనుమానాలకు, ఆరోపణలకు సమాధానంగా నెహ్రూ ఒక్క విషయం చెప్పారు ధర్మం ఎక్కడ ఎవరి పక్షాన వుంటే వారికి నైతికసహాయం చేయటానికి భారతదేశం వెనుకాడదు ఏ షరతులూ పెట్టకుండా మాత్రమే ఏ దేశమైనా భారతదేశానికి సహాయం చేయగలదు ఈ రెండుసూత్రాలు గడచిననాలుగేండ్లలోనూ ఎన్నోసార్లు బుజువు అయివున్నాయి అయినాకూడా వ్యతిరేకపక్షాలవారు పాతపాటలే పాడుతూవుండటం హర్షించలేము

కంట్రోళ్లు, రేషనింగ్ రద్దు తదనంతరం:

మనరాష్ట్రంలో రేషనింగ్, కంట్రోళ్లు రద్దుఅయిన వారంరోజుల్లోగా బీహారు రాష్ట్రంలో కూడా రేషనింగ్, కంట్రోళ్లు రద్దు అయినవి మైసూరు, హైదరాబాదు రాష్ట్రాల ప్రభుత్వాలుకూడా వీటిని రద్దుచెయ్యాలని వుబలాటపడుతున్నాయి దేశం మొత్తంమీద కంట్రోలు, రేషనింగ్ తొలగించటం కుదరని విషయమని కేంద్ర ఆహార మంత్రీ, భారత ప్రధాని కూడా ప్రకటించారు దేశంలోకల్లా తరుగురాష్ట్రాలైన మద్రాసు, బీహారు రాష్ట్రాలలోనే ప్రప్రథమంగా వీటి రద్దుకు అవకాశం రావటం మాత్రం విచిత్రం

రేషనింగ్, కంట్రోలు రద్దువలన రాగల అవాంఛనీయ పరిస్థితులను నివారించడానికి మన రాష్ట్రప్రభుత్వం తీసుకొన్న చర్యలు ప్రశంసాపాత్రాలు ధాన్యం నిలువలను చేజిక్కించుకొని అధిక లాభాలు పొందాలని విజయవాడవంటి పట్టణాలలో కొందరు ప్రయత్నాలు చెయ్యకపోలేదు కానీ ప్రభుత్వం వెంటనే తీసుకొన్న చర్యల మూలంగా వారి తంత్రాలు పనిచేయలేదు రాష్ట్రం మొత్తంమీద బియ్యం వెలలు తగ్గిపోయినా, యింకా ఎక్కువ చోట్ల కంట్రోలు వెలలస్థాయికి కుదురుకోలేదు. ఆ స్థితి రావటానికి యింకా కొంతకాలం పట్టవచ్చు ధాన్యం రవాణా విషయంలో ప్రభుత్వం రైల్వే వాగన్లను ముందుగా ప్రైవేటు వ్యాపారుల అవసరాలకే వినియోగించమని చేసిన వుత్తరువువల్ల ధాన్యం రవాణా నిరాటంకముగాజరిగి, రాష్ట్రంలో అన్నిచోట్లా వెలలు యించుమించు ఒక స్థాయికి రాగలవనీ, అలా వచ్చి ఆస్థాయిలోనే నిలబడివుండగలవనీ ఆశించవచ్చు మొత్తంమీద మన రాష్ట్రంలో రేషనింగ్, కంట్రోళ్ళ రద్దువల్ల ఏలాంటి అవాంఛనీయ పరిస్థితీ ఏర్పడలేదు ఇందుకు రాష్ట్రప్రభుత్వాన్ని అభినందించవలసివున్నది

రాయలసీమలో రాజాజీ పర్యటన

ముఖ్యమంత్రి రాజగోపాలాచారి గారు యీ 12 నుంచీ 15 వరకు రాయలసీమజిల్లాలలో పర్యటించి, అక్కడి పరిస్థితులు స్వయంగా తెలుసుకొన్నారు ఆ జిల్లాలలో క్షామపరిస్థితులు భయానకంగా వున్నప్పుడు కేంద్ర ఆహారమంత్రి మున్షీ, మద్రాసు గవర్నరు శ్రీ ప్రకాశ్ గార్లు పర్యటించారు. అప్పటికి యిప్పటికి ఆ జిల్లాలపరిస్థితిలో చాలా మార్పు వచ్చింది ౫ ఏండ్లుగా లేని వానలు కురిశాయి. క్షామ నివారణకు ప్రభుత్వము, సంస్థలు, వ్యక్తులు ఎన్నెన్నోవిధాల పనిచేశారు సైనికులు కూడా ఆ జిల్లాలకు వెళ్ళి, బావుల త్రవ్వకం వంటి పనులు కొనసాగించారు మొత్తం మీద పరిస్థితి అప్పటికంటె యిప్పుడు బాగుపడిందని చెప్పాలి. రాజాజీ అప్పుడే ఆ జిల్లాలలో పర్యటనకు వెళ్ళవుండవలసింది; కానీ, అప్పట్లో తమకు తీరికలేదన్నారు

ఇప్పుడైనా వెళ్ళి, రాజాజీ అక్కడి పరిస్థితులను స్వయంగా చూశారు రాయలసీమను పీడిస్తున్న సమస్య, అప్పుడప్పుడు (తరుచుగానే కావచ్చు) వచ్చే యీ క్షామం కాదనీ, నిత్యదారిద్ర్యమే యీ ప్రాంతానికి పెద్దసమస్య అనీ యీయనకు తోచింది ఈ విషయం ఇంతకుముందు అధికారంలో వున్నవారికి కూడా తోచింది అందుకే రాయలసీమ అభివృద్ధి సంఘం అంటూ ఒకటి పదేళ్ళకు పూర్వమే స్థాపించారు కానీ అందువల్ల ఒనగూడిన ప్రయోజనంమాత్రం అత్యల్పమే

ఇప్పుడు ఎలాగూ తుంగభద్రా ప్రాజెక్టు పూర్తిఅవుతున్నది కనుక, దీనిలో అతి ప్రధానభాగమైన తుంగభద్రా హైలెవల్ ఛానెల్ పంచవర్షప్రణాళికలో చేర్చబడుతుందన్న వార్త వినవచ్చింది కనుక యిక త్వరలో యీ ప్రాంతాలలో పాదుకొని వున్న దారిద్ర్యం తొలగిపోగలదని ఆశించవచ్చు. దానితోపాటుగా ప్రభుత్వం యిక్కడ లభ్యమయ్యే సహజసంపదను వినియోగించే పరిశ్రమలను కూడా స్థాపించి ప్రోత్సహిస్తే యిక్కడ దారిద్ర్యం శాశ్వతంగా నిర్మూలన కావచ్చును

ఇవన్నీ జరిగి, ఫలితాలన్నీ అనుకొన్నట్లుగా ఏర్పడినప్పుడు రాయలసీమవాసులు ప్రత్యేక 'రాయలసీమ రాష్ట్రం' కావాలని ఆందోళన చేయటంలో అర్థం వుంటుంది కానీ, ఆంధ్రరాష్ట్ర స్థాపన విషయమే ఆలోచనల్లోవున్న ప్రస్తుత పరిస్థితులలో యిలాటి ఆందోళనలకు పూనుకొంటే, వాటికి ఏ అర్థమూ వుండకపోగా, సోదర ఆంధ్రులకు తీరని అన్యాయం చేసినవారు అవుతారు ★

మా సచిత్రవారపత్రికలో

"ప్రశ్నలు——సమాధానములు" శీర్షిక ప్రారంభింపదలచాము. సినిమా, సాహిత్యము, ఇతర లలిత కళలు, రాజకీయములు మొదలైన వివిధ విషయాలలో తమ సందేహాలను ఈ శీర్షికద్వారా మాపాఠకులు తీర్చుకోవచ్చును. ఈ శీర్షికను విజయవంతము చేయుటలో మా పాఠకులు తోడ్పడతారని విశ్వసిస్తున్నాము. (ప్రశ్నలు క్లుప్తంగా ఉండాలి. ప్రశ్నలు పంపువారు తమ పూర్తి అడ్రెసు వ్రాయవలెను)

—సంపాదకుడు.

హాస్యహాసాలు

"శేషు"

వాడిన ముఖాలు కొన్ని—వికసించినవి కొన్ని; దిగాలు పడేవి కొన్ని—దివ్యానందాన్ని పొందేవి కొన్ని; సానుభూతి చూపేవి కొన్ని—సానుభూతి పొందేవి కొన్ని. వివిధ మనఃప్రవృత్తుల విద్యార్థిబృందాలు. ఇంత సమూహంలో అతని కృతార్థత వెల్లడి కావడం అతనికెంతో ఘనతగానే తోచింది. అతనిలో గర్వచిహ్నాలు రేగుతున్నాయి. ప్రతివారూ తన్ను శ్లాఘిస్తారు. తను చిరునవ్వు నవ్వుతాడు.

పొగతో "ప్లాటుఫారం" వదలిపోయే రైలు పారేసిన వార్తాపత్రికా వాహినిలో ప్రకటితమైన పరీక్షాఫలితాల ఫలితమే విభిన్న విచిత్ర మనఃప్రవృత్తుల సృష్టి కారణం. విద్యార్థుల గుంపుల్నుంచి తప్పించుకొనిపోయేందుకు ప్రయాణీకుల కొంత కష్టంగానే ఉంది.

అంతటి జనసమ్మర్దం. అతడు ఎంతటిమానసిక సందిగ్ధ పోరాటంతో వచ్చాడో అంతటి మహోన్నతమహనీయానందాన్ని పొందుతున్నాడు. అతని బ్రతుకుబాట పూలబాటైంది అతని స్వప్నాలు మధురస్వప్నాలయ్యాయి అతని సౌధాలు ఆశాసౌధాలయ్యాయి. అతడు మునిగి తేలిన స్రవంతులు మహదానంద స్రవంతు లయ్యాయి. అతడు చిత్రించుకున్న చిత్రాలు స్వర్గమయచిత్రాలయ్యాయి. అతడూగిన మారుతాలు మలయమారుతాలయ్యాయి. అతని ఊహలు సుఖాంతాలయ్యాయి. అతని మనోస్వేచ్ఛలు విశృంఖలవిహారం చేస్తున్నాయి. రకరకాలైన కోరికలు ఒక్కసారి ఉబ్బెత్తుగా లేచిపోతున్నాయి. నిరాశా కిరణాలొక్కసారి అదృశ్యమయ్యాయి. సంశయాస్పద ఆశారేఖలు పరిపూర్ణ భానోదయ సందర్శనభాగ్యాన్ని కల్పించాయి. అభ్యుదయం పురోగమించింది. ఆ అభ్యుదయం ఆటంకరహితం. తన లేమిని కప్పిపుచ్చుకునేందుకు చక్కని ఆశ్రయం ఆస్కారమైంది.

ఈసరికి యింట్లో అందరికీ తెలిసిపోయి ఉంటుంది. నాన్న చాటుచాటుగా నలుగురితో తన గొప్పతనాన్ని చాటుతూ ఉంటాడు. అమ్మ రకరకాలైన పిండివంటలు చేస్తుంది. పరీక్ష పాసయితే అన్న యిస్తానన్న పెన్ను, బావయిస్తానన్న గడియారం కోసం పేచీ తప్పకుండా పెట్టాలని నిశ్చయించుకున్నాడు. కొత్త బట్టలు వేసుకున్నాక వదినె తల దువ్వుతుంటే ఏమిస్తుందో అడగాలి. అమ్మమ్మ కెప్పుడో తెల్సు తనొక్కడే వాళ్ళ వంశాన్నుద్ధరించడానికి—దాని పరువు ప్రతిష్ఠలు ముందుకు తేవడానికి పుట్టాడని.

ముఖ్యంగా సీత తనకిచ్చే స్వాగతం మీదకి సాగింది అతని ఆలోచనా పరంపరంతా. ఇద్దరూ ఒంటిగా మామిడిగున్నల కింద కూర్చున్నప్పుడు తన అందచందాల గురించి చెప్పిన బడాయి కబుర్లు తన చదువు ముందు తెలివిముందు తీసికట్టు అనుకున్నాడు. తను చదివిన చదువుతో పెద్ద ఉద్యోగం సాధించి మేడల్లోను, కార్లలోను, హుందాతో, అధికారంతో తను నౌకర్లతో తులదూగుతుంటే—ఆ రోజుల్లో, తను అవివాహితుడై కాలాన్ని, లోకాన్ని గుప్పెట్లో చిక్కించుకొని ఉంటే, మామయ్య సీతను తన కాళ్ళమీద పడెయ్యాలి. తను తృణీకరించాలి. సీతను చేసుకోక తప్పదని బ్రతిమాలాలి. తను కాదనాలి. వాళ్ళు పట్టుబట్టాలి. తప్పక తప్పనిసరై తాను పెళ్ళికి ఒప్పుకున్నట్టు నటించాలి.

తనుకొన్న వార్తాపత్రిక పదేపదే చూచుకుంటూ తన పేరున్నందుకు మురిసిపోతూ "స్టేషను" వదలి యిల్లు చేరాడు. అనుకున్నట్టుగా ఇల్లంతా మారుమ్రోగిపోతోంది. ఇంటిల్లిపాదీ తన పొగడ్తల్తోనే కాలాన్ని దొర్లిస్తూ తనకోసం ఎదురుచూస్తున్నారు. అన్నయ్యకంటే బావే ముందు ఇంట్లో చాటేశాడు. మంచైనా చెడైనా బావ నోట్లో దాగదు.

అమ్మ వంటఅంతా వదలివచ్చి పలకరించింది. ఏవేవో చేసింది. చేతిలో కర్ర ఊతతో దూరంనుంచే సంతృప్తితో తలూపి వెళ్ళాడు నాన్న. అమ్మమ్మ ఒళ్ళోకి తీసుకుని బుగ్గలు నిమురుతూ "పెద్ద ఉద్యోగం చేస్తుంటే చూచే యోగ్యత లేదేమోరా బాబూ!" అంది. అన్నా, బావా ఎత్తేశారు. హోటలుకు తీసుకుపోయి రకాలు రకాలుగా పెట్టించేశారు. ఇంతకంటె అవకాశం దొరకనట్టు ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకున్నారు.

రాత్రి భోజనా లయ్యాక అత్తయ్యా, మామయ్యా వచ్చారు. అందరూ మండువాలో కూర్చున్నారు. నాన్న మాత్రం మంచంమీద నడుం వాల్చాడు. కాని కబుర్లు నడుచుకుపోతున్నాయి. సంబంధం సంగతి తెస్తారని అత్తయ్యని మామయ్యని చూడగానే అక్కడ అందరికీ ఒకేవిషయం దృక్పథంలోకి చొచ్చుకుపోయింది. అనుకున్నట్టు అదే జరిగింది కూడా. మామయ్య సంభాషణ ఉపక్రమించడం. నాన్న ఇప్పుడేం తొందర" అనడంతో "నాలో కొంత నిస్పృహ లేచింది. "ముందు చదువు

"సంగతి చూడు - సీత సంగతి కొత్తేముంది" అనడం—బదులుగా "ఇంకెంత కాలం ఉపేక్ష చెయ్యను" అని జవాబుతో కొంత ఊరట కలిగింది. మాట్లాడుతూ మాట్లాడుతూ నాన్న నిద్ర పోవడంతో సమావేశం సమాప్తి అయింది.

* * *

సామాన్య సంతోషాల్తో సక్రమంగా రోజులు సాగుకుపోతున్నాయి. అతని భవిష్యత్తు ఇదమిత్థమని నిర్ణయించక పూర్వమే సుడిగాలి చుట్టబెట్టేస్తోంది అతని మనోస్వేచ్ఛన్ని. శరీరంలోని రక్తమంతా ఒక్కసారిగా పొంగి తుపాను చెలరేగే సముద్రమైంది. కళ్లు చీకట్లు కమ్మాయి. ముచ్చెమటలు పోశాయి. గుండె వేగంగా కొట్టుకుపోతోంది. పెదవులు ఒణికి పోతున్నాయి. నాలుక తడి ఆరిపోతోంది. అవయవాలు చేష్టలు తప్పుతున్నాయి. ఎన్నెన్నో మారణమార్గాన్వేషణలు జరుగుతున్నాయి. ఎంత ఆలోచించినా త్వరలో చనిపోయే మార్గాలు ఆ చిన్ని హృదయానికి అందడం లేదు.

ఎంత ఉత్సాహం పొందాడో—అంత నిరుత్సాహం పొందాడు. ఎన్నెన్ని ఊహాసౌధాలు నిర్మించుకున్నాడో అన్ని శిధిలాలయాల సందర్శనం చేశాడు. రకరకాలైన కోరికలు, ఉవ్వెత్తుగా లేచే ఉత్సాహాలు ఒక్కసారి నశించాయి. ఆశించిన యీ ఒక్క ఫలితం పరోక్షమయింది. పలుకరించే ప్రతివారు పరిహసిస్తారు. పాతను వదిలే పాత్రత పోయింది. కొత్త నాశ్రయించే అధికారం లేకపోయింది. లేమి లేకుండా కప్పిపుచ్చుకునే యీ ఫలితం దక్కింది కాదు.

"వాజమ్మ వాడెప్పుడూ అంతే" అంటోంది అమ్మమ్మ. అన్న, అక్క చివాట్లు పెట్టి వదిలినా నాన్న చేత తన్నులు తప్పవు. ఆ చేతులో కఱ్ఱ చూస్తేనే కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరుగుతాయి. ఏమైనా కాస్త ఓదారుస్తే వదినే, అమ్మ యిద్దరే ఆ కొంపలో అతని క్కనుపిస్తుంట. ఆ రోజు ఆతని అదృష్టాన్ని దురదృష్టం కబళించింది.

అన్నిటికంటె అతని ప్రముఖ సమస్య—సీతతో తన స్నేహానికి అంతరాయం కలిగి తీరుతుందనే. ఈ దిగుల్తో మరీ దిగాలు పడిపోయాడు. తనకి తినడానికి తిండి లేకపోయినా తను చదువుకుంటున్నాడనీ ఉద్యోగం చేసి సీతని పోషించగలడనీ నమ్మకంమీదే మామయ్య సీత నివ్వడానికి ఒప్పుకున్నది. పోనీ—యీ పరీక్ష పోయిందేదో పోయింది మళ్ళీ కష్టపడి పూర్తిచేస్తానని చెప్తే ఒప్పుకునే రకం కాదు. "ఇంతవరకూ ఉంచింది కాక యింకెంతకాలం పెళ్లి చెయ్యకుండా ఉంచనూ" అంటూ గుడ్లురిమి చూస్తాడు. ఉన్నవాళ్ళకు లేనివాళ్ళను చూస్తే మరీ లోకువ. ఇంతవరకూ ఉంచేసరికే నానాబాధలూ పడింది అమ్మ. రెండు మూడు సంబంధాలు చూసి దేన్నో స్థిరం చేసుకుంటాడు. సీత తనకి దూరం అయిపోతుంది. తనకు ఏ స్తోమత చూసి ఆడపిల్లను ఇవ్వడానికి ఎవ్వరు ముందుకు వస్తారు. తన కింక పెళ్ళి కాదేమో ననే అనుమానం బలవత్తరమైపోతోంది. ఒక్క మామయ్యకు తప్పదు కనుక వప్పుకున్నాడు. దీనితో అది కూడ అడుగంటింది. తనకి తనే పనికిరానను కునేంత స్థితిలోకి వచ్చేశాడు.

ఎంత ఊరట చెందుదామన్నా శక్తికి మించిన పనైపోతోంది. ఎప్పుడూ పేజీ తిప్పి యెరగని యెదురింటి అబ్బాయి నంబరు వచ్చి తన నెంబరు బడికి రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఎంత మనోనిశ్చయం ఉంటేనేం? ఎంత ఆశ్చర్యం అయితేనేం? అతని నంబరు జాబితాలో లేదు. అంతే. ఎవరు పాసయితేనేం! ఎవరు తప్పితేనేం! అతను తప్పాడు అంతే.

ఏది తప్పినా తిండి తప్పదు గనుక అన్నం ముందు కూర్చున్నాడు. నిశ్శబ్దంగానే గడుస్తున్నాయి గడియలు. పక్కయింట్లోంచి సీత సానుభూతి సంగీతం వినిపిస్తోంది. అతని దిగులు మరింత అధికమైంది. మజ్జిగ అన్నంలో కలసిపోయాయి కళ్ళలోంచి జారిన కన్నీటిచుక్కలు.

అమ్మ ఇది చూసి కళ్ళు తుడుస్తూ "పోనీ నాయనా — నీ లోటేం లేందే నిన్నేమనగలం — మరో సంవత్సరం ప్రయత్నం చెయ్యి" అంటూ ఊరడిస్తోంది. మరో సంవత్సరం సీతకు తను సంబంధం లేని వాడయిపోతాడనే వ్యధ తల్లికి తెలియకుండానే దాచుకున్నాడు. యీ సంగతి తల్లికి గుర్తుకువచ్చినా ఊరుకోవడం కంటే ఏమీ చెయ్యలేకపోయింది. అది ఆమె కడుపులో కదుల్తూనే ఉంది. కావల్సిన సంబంధం యింతటితో తెగిపోతుందే అని ఆమె పడే సంక్షోభం ఎవరికి తెలుసు.

(46-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

17

మొత్తం చెక్కుడురాళ్ళతో నిర్మించిన, రెండు శతాబ్దాలనాటి అతి పురాతనమైన రాతికోట. భవనం యావత్తూ మొత్తంగా పాషాణమయం: రాతి స్తంభాలూ, రాతిదూలాలూ, రాతివరండాలు, రాతి పూలతొట్లు, రాతిపువ్వులు, రాతి మనుషులు, రాతిముఖాలు, రాతిసింహాలు.

జమిందారు రాతి మెట్లమీదినుంచి మేడమీది కెక్కుతున్నాడు. కంచుకాగడా బుచ్చుకుని ఒక నౌకరు ముందు నడుస్తున్నాడు. ఆయన బండిదిగటం, దిపాలూ జట్రా తీసుకుని నౌకరు బెలబెలా కోటలోనుంచి బయటికిరావటం, నౌకర్లూ ఆయనా కలిసి సంరంభంగా మేడమెట్లెక్కుతూ వుండటం, ఈ రభసంతా చెవులబడి కోట బురుజుమీద నిద్రబోతున్న గుడ్లగూబకు నిద్రాభంగమై కోపంగా కేకలు బెట్టేస్తోంది. గుడ్లగూబ అరుపు మినహా అంత పెద్ద భవంతిలోనూ మరో శబ్ద మేమీ వినిపించటంలేదు. కాకపోతే జలయంత్రంలోనుంచి రాతితొట్లోకి పడుతున్న నీళ్ళ చప్పుడుమాత్రం వినిపించుతోంది.

రాతిమెట్లెక్కి మేడమీదికి చేరగానే అక్కడ ముఖద్వారంలో మరో కంచుకాగడా వెలుగుతోంది. జమిందారు మందిరంలోకి ప్రవేశించగానే ముఖద్వారం, మళ్ళా మూసుకుపోయింది.

లోపలికి వెళ్ళగానే, మొట్టమొదటిది పెద్ద హాలు. అదో పెద్ద ఆయుధాగారం. ఈటెలూ, బాకులు, బరిసెలూ, బల్లాలూ, కత్తులూ కటార్లూ కత్తుల బోనులావుంది. మరో ప్రక్కగా పేము బెత్తాలూ, కొరడాలు వ్రేలాడుతున్నయ్. జమిందారుగారికి ఆగ్రహం వచ్చినప్పుడల్లా ఆ కొరడాల చలవవల్ల ఎంతమంది పేద రైతులు మృత్యుదేవత ఒడిలోకిపోయి పడ్డారో అంతులేదు.

చీకటి చిందులాడుతున్న ఆ పెద్ద పెద్ద కత్త్యలూ గవాక్షాలూ గడిచి జమీందారు సరాసరి భవనానికి వెనకభాగంలో వున్న ఒక ఆర్చిలోనుంచి అవతలికి వెళ్లారు. అక్కడ జమిందారుగారు విశ్రాంతి తీసుకునే మూడు గదులున్నయ్. ఆ గదులు మూడూ ఆనాటి జమిందారులు నివసించటానికి తగిన సరంజామాతో అలంకరించివున్నయ్. 14 వ లూయీ చక్రవర్తి నాటి నాగరికతను ప్రతిబింబించుతున్న బల్లలూ, మేజాలూ, ఫ్రాన్సు ప్రాచీన చరిత్రకు సంబంధించిన అనేక చిత్రపటాలూ, గదలు మూడూ, తగిన హుందాలో డాబు సరిగా వున్నయ్.

కట్టకడపట వున్న మూడోగదిలో యిద్దరు మనుషులకు భోజనం యేర్పాటు చేసివుంది. ఆ భోజనపు యేర్పాట్లు చూసి జమిందారు: 'చిన్నదొర రాలేదుగా' అన్నారు.

రాలేదని నౌకర్లు సమాధానం చెప్పారు. జమిందారుతోపాటు కుమార రాజాకూడా వస్తాడని నౌకర్లు అనుకున్నారు.

'ఈరాత్రి యిక ఎలాగూ రాడనుకుంటాను. అయినా ఇంకా కాసేపు ఆ భోజనం అలానే వుంచండి. నేను కొంచెం విశ్రాంతి తీసుకుని ఒక పావుగంటలో భోజనానికి లేస్తాను'—

ఒక పావుగంటకల్లా వచ్చి, ఆయన భోజనంబల్లదగ్గిర కూర్చున్నారు. సమస్తమైన భోజన పదార్థాలతోను బల్ల నిండివుంది ఆయన స్తిమితంగా కూర్చుని తాపీగా భోజనం చేస్తున్నారు.

ఇంతలోనే బయట రవరవాబండి చక్రాలచప్పుడు వినిపించింది. బండి సరాసరి భవనం ముందుకు వచ్చి ఆగినట్టు తోచింది. 'ఆ వచ్చిందెవ్వరో చూడండి'—కుమారరాజా వచ్చారు. పారిస్ నుంచి పెద్దదొర బయలుదేరి వచ్చిన సంగతి తెలిసి ఆయన కూడా వెనువెంటనే బయలుదేరాడు. త్రోవలో పినతండ్రిని కలుసుకోగల్గు ననుకున్నాడు గాని సాధ్యం కాలేదు.

భోజనం సిద్ధంగా వున్నదని చిన్నదొరకు చెప్పమనీ, లోపలికి తీసుకురమ్మని జమిందారుగారు సెలవిచ్చారు. అయిదారు నిమిషాలకు చిన్నదొర లోపలికి వచ్చాడు. చిన్నదొర, ఇంగ్లండులో, చార్లెస్ డార్నే అనే మారుపేరుతో తిరుగుతున్నారు.

పెద్దదొర చిన్నదొరకు జమిందారీ రీవిలోనే ఆహ్వానమిచ్చారుగాని ఆప్యాయంగా స్వజనాన్ని పలకరించినట్టు పలకరించలేదు.

చిన్నదొర భోజనంబల్లదగ్గిర కూర్చోబోతూ: 'మీరు పారిస్ నుంచి నిన్ననే బయలుదేరి నట్టున్నారు' అన్నాడు.

'అవును నిన్ననే బయలుదేరాను—నీవో'

'నేను సరాసరే వచ్చేశాను'

'లండను నుంచేనా ?—'

'అవును'—

'ప్రయాణంచాలా రోజులు పట్టినట్టుంది' అన్నాడు, అదోయాసగా, చిరునవ్వు నవ్వుతూ.

'నిజానికి ప్రయాణం యెన్నో రోజులు పట్టలేదు. ఎక్కడా ఆగకుండా యెకాయెకే వచ్చేశాను'

'ప్రయాణం చాలారోజులు పట్టిందని గాదు నేను అంటున్నది. ప్రయాణ లగ్నం కుదరటానికే చాలారోజులు పట్టిందని అంటున్నాను.'

'కొన్ని అసందర్భాలవల్ల నిలిచిపోవలసి వచ్చింది.'

'అలాటి అసందర్భాలేవో వచ్చివుంటాయనే అనుకున్నాను.'

నౌకరు అక్కడ వున్నంతసేపూ, అంతకుమించి యిద్దరూ

రేమీ మాట్లాడుకోలేదు. కాఫీ అందించి నౌకరు బయటికి వెళ్ళి పో గానే చిన్నదొర పినతండ్రివంక చూసి యిలా ప్రారంభిం చాగ :

'నేను చావుతప్పి యేదో విధంగా మళ్ళా మీదగ్గిరికి తిరిగి రాగలిగాను. ఇంగ్లండులో నేను అనుకోకుండా పెద్ద ప్రమా దంలో చిక్కుకున్నాను. నిజంగా మృత్యు ముఖంనుంచి బయట పడ్డాను'

'మృత్యువుదాకా యెందుకులే—'

'అవును లెండి, నేను మృత్యుముఖంలో చిక్కుకున్నానని తెలిస్తేమాత్రం—మీరు నన్ను యివతల పడెయ్యటానికి ప్రయ త్నించేవారుట గానీ'—

పెద్దదొర చలించలేదు. ఆయన ముక్కు కోళ్లు మాత్రంకోపంగా మెలికలు తిరిగినై. ఒక చిరునవ్వు నవ్వాడు.

'మీరు చిరునవ్వు నవ్వుతున్నారు గాని —నిజంగా అలానే—చేసేవారు. నా చుట్టూ అలుముకున్న అనుమానాలకు, మరి కొన్నిటిని కలిపి మరింత ప్రమాదంలోకి యీడ్చేవారు.'

'ఛా! ఛా! అలా ఎందుకు చేస్తాను' —అన్నాడు పినతండ్రి అదో వెటకా రంగా.

'ఎందుకు చేస్తారేమిటి—తమ వ్యవ హారం నాకు కొత్తాయేమిటి?—అల్లాంటి విషయాల్లో తమరు మానవత్వాల బాదర బందీ పెట్టుకోరని నాకు స్పష్టంగా తెలుసు.

పెద్దదొర ముక్కు కోళ్ళు మెలికలు తిరి గినై: 'ఆసంగతినీకు ఎప్పుడో చెప్పాను— జ్ఞాపకం లేదేమో'

'జ్ఞాపకం లేకపోవటమేమిటి?'—

'మరి యింకేం' అన్నాడు పినతండ్రి, అతి తాపీగా.

'నిజానికి యిక్కడ ఫ్రాన్సులో నేను యే జైల్లోనో మ్రగ్గకుండా బయట తిరుగు తున్నానంటే, అది మీ దురదృష్టమూ, నా అదృష్టమూ కారణంగాని మరొకటి గాదు—'

'నీ అభిప్రాయ మేమిటో నాకు బోధ పడలేదు. కొంచెంవివరంగా వ్యాఖ్యానిం చితే సంతోషించుతాను.'

'ఏమిటంటే— చక్రవర్తి దర్బారులో మీ పలుకుబడి దుమ్మయిపోకుండా మున పటిమాదిరిగానే చెలామణీ అవుతూవున్నట్ల యితే—ఏదో వారంటు పుట్టించి, చావూ బ్రతుకూ తేలకుండా యేకోటలోనో ఖైదు చేయించివుంచేవారు.'

'అవును సంభవమే—వంశ గౌరవాన్ని కాపాడటానికినిన్ను అలాంటి యిబ్బంది పెట్టవలసి వచ్చినా నేను సందేహించే వాణ్ణి కానేమో.'

'నాకు తెలుసు—ఇంతకీ మొన్నటి విందులో, ఆ బడాప్రభువు మీ ముఖమైనా చూడకపోవటం నా అదృష్టం'—

'ఏదో నువ్వు అదృష్ట మనుకుంటున్నావుగాని నాకుమాత్రం నమ్మకంలేదు. ఏకాంతవాసం ఎంతమంచిది—ఎలాంటి సుగుణ సంపద యేర్పడటానికి సావకాశంవుంది?—అయినా యిప్పుడా విషయం ఆలోచించి లాభ మేమిటి?—నీవన్నట్టు, ప్రస్తుతం నేను కొంత అసమర్థస్థితిలోనే వున్నాను. ఈ రోజుల్లో, నీవంటి వాళ్ళను కొత్త మార్గంలో పెట్టటానికి కావలసిన ఇలాంటి చిన్ని చిన్ని అధికారాలూ, వంశగౌరవాలు నిలబెట్టుకోవటానికి అవసరమైన ఇలాంటి చిన్ని చిన్ని సావకాశాలూ, పని గట్టుకుని ప్రాధేయపడుతున్న వాళ్ళకుగాని లభించటంలేదు. ఆ ప్రాధేయపడేవాళ్లు చాలామంది కావటంచేత అస్మదాదుల కందరికీ సులభంగా లభించటం దుర్లభమౌతోంది. పూర్వం అలా వుండేదిగాదు. ఫ్రాన్సు నానాటికీ చాలా దౌర్భాగ్యకరంగా మారిపోతోంది. నిన్న మొన్నటి వరకూ, చుట్టూ వున్న ఈ నాటు ప్రజల మాన ప్రాణాలన్నీ మనవాళ్ళ గుప్పెట్లో వుండేవి. మాట వరసకి ఈ గదిలోనుంచి, అలాంటి కుక్క వెధవల్ని యెంతమందిని ఉరికంబాలకు పంపించ లేమూ! అంతదాకా దేనికి? తనకూతురు విషయంలో యేదో నిక్కబోయి నందుకు, ఆ వెధవను నా పడకగదిలోనే చిత్రవధ చేయించానా లేదా?—ఇలాంటి అధికారాలన్నీ మన చేతుల్లోనుంచి జారిపోయినై ఇప్పుడు ఇదేదో ఒక కొత్త వేదాంతం బయలుదేరుతోంది. నిజంగా మన అధికారాలను మనం నిలుపుకోవాలంటే కొన్ని యిబ్బంది సబ్బందులు పడవలసే వస్తుంది—ఇంతకీ నేనొకటి చెబుతా విను—ఎంతైనా చెడు రోజులు.'

ఈ ఉపన్యాసం దంచి, ఒక చిన్న పొడుంపట్టు ఎక్కించి తల విదిలించాడు. నాశనమైపోయిన అధికారాన్ని పునరుజ్జీవింపజేయుట యెలాగా అని తీవ్రమైన మథనలో పడ్డాడు.

'మన పూర్వులూ మనం, కూడా, అలా అధికారాన్ని యిష్టం వచ్చినట్టు, చెలాయించాం గనుకనే మన పేరంటే, ఫ్రాన్సులో ఇవ్వాళ యింత కంటకంగావుంది.

'గొప్పవాణ్ణి కంటగించుకుంటున్నారంటే—ఆ గొప్పవాడి గొప్పతనాన్ని గుర్తించి జోహారు చేస్తున్నారన్నమాట'

'వట్టిభ్రమ' అన్నాడు చిన్నదొర: 'ఈ మొత్తం దేశంలో, నావంక, ఆప్యాయంగా గాని, గౌరవంతోగాని చూస్తున్న ముఖం ఒక్కటికూడా కనుపించటంలేదు. వాళ్ళల్లో బానిసతత్వం, భయమూ తప్ప నాకు మరొకటేమీ కనుపించటం లేదు—'

'మంచిమాట—అలాగైతే మన వంశగౌరవం ఈ షణ్మాత్రమైనా మొక్కపోలేదన్నమాట—' తాపీగా మరోపొడుం పట్టుబిగించాడు.

చిన్నదొరమాత్రం, బల్లమీద మోచేతులాని ముందుకు వంగాడు. గిజాటుగా అరచేతులతో ముఖం కమ్మేసుకున్నాడు. పెద్దదొర అతని మనస్థితిని జాగ్రత్తగా అవగతం చేసుకోవటానికి ప్రయత్నించుతున్నాడు.

'దమననీతి సనాతనమైన సాంప్రదాయం—ఈ కుక్క వెధవల్లో బానిసతత్వం, భయం నశించిపోకుండా వుంటే మన కొరడాలకు ఎదురుండదు. చచ్చిన కుక్కల్లా పడివుంటారు.' ఈ రాతికోట ఇలా అచలంగా నిలచివున్నంత కాలం, మన అధికారం శాశ్వతంగా నిలిచివుంటుంది. అంత వరదాకా ఈ వంశ గౌరవాన్ని నీవు నిలబెట్టకపోయినా నేను నిలబెట్టి తీరతాను—నువ్వు చాలా అలసిపోయినట్టున్నావ్; ఈ సంభాషణనుయింతతో విరమించితే బాగుంటుంది'—

'మరోక్షణం అవకాశం యిప్పించండి—'

క్షణంగాదు—కావాలంటే గంట మాట్లాడవచ్చును.'

'మనం చాలా అక్రమాలు చేశాం—వాటి ఫలితాలన్నీ అనుభవించబోతున్నామ్ అన్నాడు చిన్నదొర.

ఏమిటీ మనమా? తప్పుజేయడమా?' అంటూ అదో ధీమాగా చిన్నదొర ముఖంలోకి చూచాడు.

'అవును మనం—గౌరవనీయమైన వంశానికి చెందిన మనం. మా నాన్నగారి హయాంలోకూడా అనేక కిరాతాలు చేశాం. మన ఆనందానికి అడ్డుగా తోచిన ప్రతిమానవుణ్ణీ నాశనం చేసి పారేశాం. నాన్నగారి హయామనటమే యెందుకు? ఆయన సోదరులు మీరుమాత్రం చేస్తున్న దేమిటి—ఈ విషయంలో మీ సోదరుల నిద్దర్నీ విడదీసి మాట్లాడవలసిన పనేముంది?—'

'మృత్యువు మమ్మల్నిద్దర్నీ విడదీసింది'—అన్నాడు పెద్దదొర.

'అవును ఆయన్ను యెత్తుకుపోయి, నన్ను ఈ కిరాత వ్యవస్థకు అధికారంలేని వారసుణ్ణిగా చేసి విడిచింది. దీని చెడు ఫలితాల కన్నిటికి బాధ్యుణ్ని చేసింది; నా తల్లి, మరణశయ్యమీద వుండి కన్నీరుకార్చి ఆదేశించింది. ప్రజలపట్ల కనికరం చూపమన్నది. న్యాయం కలుగజేయమన్నది. ఆ తల్లి తుదికోర్క తీర్చటానికి, చేతగాని వాణ్ణయి సహాయంకోసం, అధికారంకోసం అర్థించుతూ నానా మనస్తాపాలూ పడుతూ, దిక్కులేని పక్షినై తిరుగుతున్నాను.'

'అలాంటివి, నావల్ల పొందాలని నీవు అర్థించుతూ వున్నట్టయితే, నీవు జన్మాంతంవరకూ అర్థించినా ప్రయోజనం ఉండదు-తన చూపుడువ్రేలు చిన్నదొర గుండెలమీద బాకులా ఆనించి: 'ఇదిగో! ఒక్క సంగతి చెబుతా ఇలా విను!—ఈ వ్యవస్థలో పుట్టి ఈ వ్యవస్థలో పెరిగాను. దీన్ని రక్షించటానికి నా ప్రాణాలు ఒడ్డి పోరాడతాను.'

మరో చిన్ని పొడుంపట్టులాగి వ్రేళ్లు దులుపుకుంటూ: 'యుక్తాయుక్త పరిజ్ఞానంతో బ్రతకటం యెందుకేనా మంచిది. దైవదత్తంగా నీకు సంప్రాప్తించినదాంతో సుఖపడొచ్చు. అయినా ఇదంతా యిప్పుడు లాభంలేదు. నువ్వు సొంతందారి తప్పావు'—బల్లమీదవున్న చిన్ని గంట మోగించాడు.

'త్రోవ తప్పింది నేను కాదు—ఈ దేశం—ఈ ఫ్రాన్సుతో గాని, యీ ఆస్తితో గాని నాకేమీ పని లేదు—ఈ క్షణంలో విసర్జించుతున్నాను' అన్నాడు, చిన్నదొర చార్లెస్.

'చార్లెస్! అదేమిటి—వెర్రిమాట—అవేవో నీ సొంతసొమ్మయినట్టు విసర్జించానంటున్నావేమిటి?—ఫ్రాన్సు నీదైతే కావచ్చునేమో గాని ఈ ఆస్తి మాత్రం నీది గాదు.'

'నేను కావాలని యేడవటం లేదు—రేపు ఉదయం ఇది మీనుంచి నాకు సంక్రమించినా నేను విసర్జించేదే—'

'బహుశా! అలాంటిది సంభవించదనే నా విశ్వాసం'

'—ఇప్పుడు లేకపోతే మరో యిరవై సంవత్సరాల తరవాతే ననుకోండి—అప్పుడు కూడా నేనీ కిరాతంతో ఎలాంటి సంబంధం పెట్టుకోను—ఇది వట్టి అరణ్యం—మానవ సంక్షోభం—ఈ శిథిలాలవల్ల ప్రయోజనం యేమిటి?'—

'ఆహా! ఏమిటీ—'అంటూ పెద్దదొర సర్వాలంకారశోభితమైవున్న ఆగది నాల్గువంకలా ఒక్కసారి కలియజూచి చిరునవ్వు నవ్వాడు.'

'కంటితో చూడటానికి యిదంతా సొంపుగానే వుండొచ్చు; కాని కొంచెం లోతుకుదిగి దీని స్థితిగతులు అర్థంచేసుకుంటే సర్వం బోధపడుతుంది. దుబారాఖర్చులు, చేతగాని నిర్వహణ,

(47-వ పేజీ చూడండి)

దొంగతాత

సూరన్న తాతకి మల్లేనేవున్నాడా తలగుడ్డ మనిషి. కాని, ఆ తాతయ్యా వూరెందుకు వస్తాడు లెమ్మని తల తిప్పుకున్నాడు రాముడు. వరండాలో "ఆరోగ్య చింతామణి" నాటకం జరుగుతూంది. చివరి రంగంలో అనారోగ్య చక్రవర్తి, ఆరోగ్య చక్రవర్తిచే ఓడింపబడ్డాడు. ప్రజలంతా ఆరోగ్యవంతులుగా కేరింతాలు కొడుతున్నారు. తెరగా కట్టిన శాలువా వాలింది. అందరితో పాటు రాముడూ తప్పట్లు కొడుతున్నాడు. కాని శబ్దం రావడంలేదు. అతని చేతులంత చురుకుగా పనిచెయ్యడంలేదు. ఎదురుగా వాలి వున్న ఎర్రశాలువా మీద అతని కేవో బొమ్మలాడున్నట్లు కనిపిస్తూంది.

హెడ్‌మాస్టర్ గారు ఆ తెరముందు నిలచి ఏదో చెబుతున్నారు. కాని, రాముడదేమీ వినడం లేదు. తెరమీద తన కన్పిస్తున్న బొమ్మల్ని గుర్తుపడుతున్నాడు. అదుగో— ఆ ఎడమవైపు బొమ్మకి పెద్ద తలగుడ్డవుంది. వెనక్కాల మూరెడు చెంగు వేలాడుతూంది కూడాను. అది సూరన్న తాత బొమ్మే. అవును - చేతులోవున్న ఆ పొట్లం ఖర్జూరకాయలే అయివుంటయ్. తనకోసమే తెచ్చి వుంటాడు. కాని, ఆకుడివైపునున్న బొమ్మ వెండి పొన్నుగర్రను అడ్డాంపెట్టిసూరన్న తాతని వెనక్కి తోలుతూంది ఎవరది? ఇంకెవరు— వెంకయ్యతాతే! ఆ పొన్నుగర్రా; ఆ పెద్ద బొజ్జా బుగ్గమీసాలూ; మెరిసే అంచుల కండువా; పచ్చని జంపూ యింకెవరి కుంటాయ్? తన పుట్టినప్పట్నుంచీ తన వెంకయ్యతాత తప్ప మరెవరూ అవన్నీ కలవారు కనిపించలేదు.

అయితే—వెంకయ్యతాత, సూరన్న తాతని వెనక్కి తోలటం ఎందుకు? అరరె...సూరన్న తాత తెరమీదనుంచి వెళ్లిపోయాడే! ఎక్కడికో? కళ్ళు నులుముకుని లేచినుంచుని మరీ చూచాడు తెరని. ఆ తెరమీద యిప్పుడేమీ లేదు— ఎర్రశాలువా రెపరెపలాడుతూంది. హెడ్ మాస్టరు ఏదో చెబుతూనే వున్నాడు. రాముడుమాత్రం అదేమీ వినకుండా చుట్టూ వెదుకుతున్నాడు. ఈ తెరమీద యిలా తాతలబొమ్మలు ఎందుకు కన్పించాయో, రాముడు కర్థంకాలేదు. కాస్సేపు తన తాతలు నిజంగా అక్కడేదన్నా నాటక మాడిపోయారేమోనని అనుమానం కూడా పడ్డాడు. కాని మరుక్షణంలోనే వెంకయ్యతాత వూళ్లో లేడని గుర్తుకొచ్చింది. ఒకవేళ పగటికలలంటే యిలాటివేమో ననుకున్నాడు. ఎందుకనంటే—ఒక్కోసారి ఏదన్నా జరుగుతున్నప్పుడు, తను లోగడయిలా జరిగినట్టే కలలుకన్నానని రాముడుకు గుర్తుకొచ్చేది. ఇప్పుడీ తెరమీది బొమ్మలు కూడా, తను ఎపుడో చూచినట్టే యిపుడూ చేశాయ్. ఎంతకాలంనుంచో తను చూడని సూరన్న తాత యివ్వాళిట్లా ఎందుకు గుర్తుకొచ్చాడా అని రాము డాలోచించాడు. ఒకవేళ తానంతకుముందు అనుమానించినట్లు ఆ పదిమందిలోనూ కూచున్న తలపాగ మనిషి సూరన్న తాతేమోననీ; ఆయన్ని చూసినాకే యీ ఆలోచనలన్నీ వచ్చాయేమోననీ రాముడనుకోలేదు. ఎనిమిదేళ్ళ రాముడికి అంత ఆలోచనెక్కడిదీ?

కాని; అతని అజ్ఞాత మనస్సులో సూరన్న తాత తిరగడం మానలేదు అందుకనేయిందాకటి తలగుడ్డ మనిషిని పరీక్షించి అనుమానం తీర్చుకోవాలని చుట్టూ వెదుకుతున్నాడు. అదుగో – ఆచివరి బెంచీలో అయిదుగురి మధ్యా కూర్చున్న ఆముసలాయన సూరన్న తాతలాగానే వున్నాడు. తనవైపే చూస్తున్నాడే... అ...!

అంతకుముందు హెడ్‌మాస్టరు తనను వేసిన అయిదు కేకలూ వినిపించలేదు రాముడికి. తను తాతను గుర్తు పడుతూండగా హెడ్‌మాస్టరువచ్చి రెక్కపట్టుకుని బరబరా లాక్కుపోయి డ్రాయింగుమాష్టారి గదిలో తోసి "తొందరగా ఏడవ్వోయ్ - నెక్స్టు నువ్వే"నంటూ వెళ్ళిపోయాడు. డ్రాయింగు మాష్టరు మొఖం నిండా పౌడరు వేసి గుడ్డలు విప్పేవరకూ రాముడు అయోమయంగా వున్నాడు. డ్రాయింగు మాష్టరు పట్టు గుడ్డలుకట్టి; పూసలదండలు వేసి; చెక్క కత్తి భుజాన పెట్టి గదిబయటకు నెట్టేసరికి— తను ప్రహ్లాదనాటకంలో సైనికునివేషం వేసి, నటించబోతున్నట్లు గుర్తుకొచ్చింది. చరచరా వెళ్లి తెరవెనుక మందలో కలిశాడు.

*　　*　　*

నాటకంలో తన వేషం ప్రహ్లాదుణ్ణి కొట్టమన్నప్పుడల్లా, కొట్టడం, తొయ్యడం తప్పమరేమీ చెయ్యాదు. "చిత్తం చిత్తం" అనడమే తనవంతుమాటలు. ఎక్కువసేపు నిటారుగా నుంచోవడం తప్ప మరేమీ పని లేనందున రాముడు దృష్టి సూరన్న తాతలా వున్న ముసిలాయన మీదకి పోయింది. రెండో రంగంలోనే ఆయన నిజంగా సూరన్న తాతేనని గుర్తుపట్టాడు. ఆ తాత కూడా గుర్తుపట్టినట్టే తనవేపు చూస్తున్నాడు. అప్పుడే మసకచీకటిపడుతూంది, లైట్లు వెలిగిస్తున్నారు.

నిజంగా సూరన్న తాతే కనిపించేసరికి రాముడికి భలే సంతోషం వచ్చింది. ఆయన్ని లోగడ గల్లంతుచేసిన సందర్భాలన్నీ గుర్తుకొచ్చినయ్. కొయ్యకత్తిని మెడముందు అటుయిటూ తిప్పుతూ "మెడకొయ్ కోత్తా"నని తను తాతననే అలవాటును అభినయించాడు. అది చూచిన తలపాగా తాత నవ్వుతూ "ముక్కుకోత్తా గాడిదే" అన్న తన అలవాటును అభినయించాడు. రాముడికి నవ్వాగలేదు. పసి తనపు పసందులన్నీ గుర్తుకొచ్చి ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు. అతడీ సంబరంలో వుండగా ప్రహ్లాదుడు వచ్చి రాముడిపక్క నుంచున్నాడు. వెనకాల హిరణ్యకశిపుడు "ఈడింభకునికి బుద్ధి వచ్చునట్లు శిక్షించుము సైనికా" అంటున్నాడు/ రాముడి దంతాగమనించకుండా నవ్వుతున్నాడు. "మెడకొయికోత్తా"

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

...ము కుక్క కోత్తా" కాళ్ళు యిరగ్గొ...తా" నటే తాను చెడి...ంచే అభినయం మహాచేస్తున్నాడు. జనం నవ్వుతున్నారు. చివరికి డ్రాయింగ్ మాష్టరొచ్చి బరబరా లాక్కుపోయి "నీబొందలాగుంది.. యాక్షన్ లేకుండా ఏ నవ్వేమిట్రా వుంకా" అని గద్దించాడు.

రాముడు చిక్కు మొఖం వేశాడు. డ్రాయింగుమాష్టరు "నువ్వుపనికిరావురా ...దిధవా" అంటూ ఆ దుస్తులన్నీ తీసి మరో పిల్లాడికి వేసి, రాముణ్ణి "ఫో" మన్నాడు. ఎంతకాలంనుంచో తను వేషం వెయ్యాలని వుబలాటపడి ; నాన్న నడిగి రూపాయి తెచ్చి ఆరోగ్యవారానికి చందాయిచ్చి ; యీవేషం సంపాయించుకుంటే యిట్లా పనికి రాకుండా పోయిందేమా, నలుగుర్లోనూ నవ్వులపాలై పోయానేమా ; ఇది వింటే నాన్న ఎట్లా కొడతాడో అనుకుంటూ భయపడవలసింది రాముడు. కాని వాడికా ఆలోచనలే లేవు. "పాడుసిపాయి వేషం పీడావదిలింది" అనుకున్నట్లుఎంతో ఆనందంతో గంతులేస్తూ సూరన్న తాత కూచ్చున్న దగ్గరకు పరుగెత్తాడు. ఆ బెంచీ మీద కూచ్చున్న వాళ్ళని చూచేసరికి రాముడు దిగాలుపడిపోయాడు. వాళ్ళ మధ్య ఆ తాతలేడు. చుట్టూ చూచాడు. పూల చెట్ల మధ్యగా సూరన్న తాతవెళ్ళి పోతున్నాడు - వంగి వంగి నడుస్తూ.

రాముడు గంతుకుంటూ వెళ్ళాడు. సూరన్న తాతగేటు దాటి డొంక వెంటే నడుస్తున్నాడు. రాముడు ఒక్క పరుగున వెళ్ళి ఆయన గోచిపట్టుకుని "దొరికావులే దొంగా" అన్నాడు. ఆయన వెనక్కి తిరిగి రాముణ్ణి రెండు చేతులా పట్టుకుని మొఖంలో మొఖం పెట్టి "నిజంగా నా బాబూ" అన్నాడు. రాముడేదో సమాధానం యివ్వబోగా, వినకుండానే అతని నోరును ముద్దెట్టుకున్నాడు అక్కడే చదికిలబడి. రాముడు పూసుకున్న రంగు మూతినిండా అంటుకుందని కూడా ఆయన గుర్తించలేదు. రాముడు సూరన్న తాత బుగ్గలకి తన బుగ్గల్ని రాస్తూంటే - వెచ్చని నీళ్ళు తగిలాయ్. అదేమిటా అని రాముడు తాత ముఖంలోకి చూచాడు. తాత కళ్ళవెంట నీళ్ళుజలజలా కారుతున్నాయ్. తన చేత్తో తుడుస్తూ "నాముఖం రంగు నీకంటో పడిందా తాతా ! కడుక్కోటం మర్చిపోయాన్తాతా ! నలకలు పొయ్యేట్లు పూదనా తాతా" అని అడిగాడు.

తాతగొంతు గుడగుడలాడింది. గుటక మింగి "పూత్తావా బాబూ-మా నాన్నే-పూదు" అన్నాడు ఆయన. రాముడు తాత తలని రెండు చేతుల్లో పట్టుకుని అకంట్లోనూ, యీకంట్లోనూ గాలిపూది "పోయిందా తాతా" అన్నాడు. తాత తలగుడ్డ చెంగుతో కళ్లు తుడుకుంటూ "పోయింది బాబూ" అని లేచాడు. ఈ తాత యిదివరకు ఎంతో నవ్వుతూ మాట్లాడేవాడు. ఇప్పుడిలా వణుకుతున్నా డెందుకో అని రాముడాలోచించ బోయాడు. సూరన్న తాత తలగుడ్డవిప్పి ఒక చెంగునవున్న మూట విప్పదీశాడు. ఖర్జూరకాయల పొట్లం తీసి రాముడికిచ్చాడు. రాముడు రెండుకాయలు నోట్లో వేసుకుని "శానారోజు అయింది తాతా ఖర్జూరకాయలుతిని!" .అంటూ నములుతున్నాడు. తాత మళ్లీ తలగుడ్డ చుట్టుకుని నడక సాగించాడు.

రాముడు ఖర్జూరకాయల రుచిలో ఆయన వెంటే నడుస్తున్నాడు. తాత మెల్లగా నడుస్తూనే మనవణ్ణియింతింత



కళ్ళు తేసుకుని చూస్తున్నాడు. వెన్నెల్లో డొంకంతా దూది పరుపులావుంది. రాముడు తాతచేతిని పట్టుకుని కాస్సేపూ; వదిలి అటూ ఇటూ పరుగెత్తుతూ కాస్సేపూ వెంటవెళుతున్నాడు. బారుగా పడుతున్న తాతనీడను పరుగెత్తి తంతూ "నిన్ను తంతున్నా తాతా" అంటూంటే, ఆయన "తన్ను బాబూ-తన్ను" అంటూ చకచకా నడిచి, తన నీడను తప్పిస్తున్నాడు. రాముడు మరీ వుషారుగా ఆనీడను వెంటాడి తంతున్నాడు. తాతనీడనటూ యిటూ తొలగించి కవ్విస్తూ నవ్వుకుంటూ మనవణ్ణి హెచ్చరిస్తున్నాడు. అప్పుడు ఆ యిద్దరిమధ్యా అరవైయేళ్ళ తేడావున్నదని ఎవరూ అనుకోలేరు-ఆ యిద్దరినవ్వుల్లోనూ, ఆట నానందించడంలోనూ ఏమీ తేడా లేదు.

రైలుగేటు దగ్గర కొచ్చేసరికి తాత రాముడిచెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. రాముడు గుంజుకుంటూ "వదుల్తాతా... నిన్ను తన్నాలి...వదలమంటే" అంటున్నాడు. తాత "ఈ గేటుదాటనీ బాబూ-తర్వాత్తందూగాని" అంటూ అటూ యిటూ పారజూచి, ఏ రైలూ కనుచూపుమేరలో లేదని తెలిసింతర్వాత గేటు దాటాడు మనవడితో. తర్వాత తను చెయ్యివదిలినా రాముడు తన చేతిని వదలడంలేదు. అటూ యిటూ వున్న సర్వీచెట్లనీడలు డొంకను కమ్మేశాయ్. రాముడు "ఇదెక్కడికి తాతా?" అని అడిగాడు. తాత "కొర్లరోడ్డుకి బాబూ...పొద్దుపోయిందిగాని — యిక మీయింటికి వెళతావా?" అని అడిగాడు. రాముడు "నువ్వుకూడారా తాతా-నాకుభయం అంటే -" ఎవరితోనన్నా పంపుతాలే-నువ్వెళ్లు బాబూ... నేను కొరెక్కడి వెళ్ళాలి" అన్నాడు తాత. రాముడు తలయెత్తి చూస్తూ—"ఎక్కడికెళ్తావ్ తాతా?" అని అడిగాడు. తాతగొంతు చేత్తో సవరించుకుని "దేవుడు దగ్గరికి నాయనా" అన్నాడు. రాముడు "అమ్మదొంగా...అన్నీ వుట్టిదే...మీ వూరుకో తాతా?" అని నిలవదీసినట్లు అడిగాడు.

తాత "మావూరు యిక వెళ్లన్నాయనా...నీకు తెలవదు...ఇక వెళ్తావా యింటికి" అని అడిగాడు. రాముడు "ఉహు. నే వెళ్లను...నువ్వు కూడా రావాలి అంతే-" అని అలిగినట్లు చిందులు వేశాడు. తాత "మా బాబే...నా మీద నీ కంత ప్రేమా" అంటూ ఎత్తుకుని వళ్లంతా సవరదీస్తూ కంకరరోడ్డెక్కాడు. గానుగచెట్టు కిందకు వెళ్లి "కూచ్చుందాం బాబూ" అన్నాడు.

తాతా మనవడూ రోడ్డుపక్క నే కూచ్చున్నారు. తెల్లనిరాళ్లు ఏరుతున్న తాతని రాముడేగాదిగా చూచాడు. తాత వుషారుగా లేడని దగ్గరకెళ్లి "మా యింటికెళ్దాం తాతా" అని మారాం చేశాడు. తాత అతన్ని వళ్లో కూచోబెట్టుకుని "నే వస్తే మీ వెంకన్న తాతా, మీ నాన్నా వూరుకోరు బాబూ..." తల నిమురుతూ. రాముడు "ఎందుకూరుకోరేం? నే చెబుతారా తాతా" అని చెయి పుచ్చుకున్నాడు. తాత నవ్వేడు. ఎంతో బిగ్గరగా నవ్వేడు. నవ్వు దగ్గుగా మారింది. ఖణేల్ ఖణేల్ మని దగ్గుతూంటే రాముడికి భయంవేసింది. అమ్మ తనకు చేసినట్లుగా తను తాత వీపూ, గొంతూ నిమిరాడు; తల మీద అరిచేత్తో రాశాడు. తాతకు దగ్గు తగ్గుతూంది. తాత తనని మెడమీదకు పడుకోబెట్టుకున్నాడు. తను చేత్తో తాత ముఖం సవరదీశాడు. చేతికి వెచ్చని నీళ్ళు తగిలాయ్. భుజంమీంచి లేచి తన చొక్కా అంచుతో తాతకళ్ళు తుడిచాడు.

తాత రాముణ్ణి సవరదీస్తూ గుటకలు వేశాడు. "మంచినీళ్లెక్కడుంటాయి బాబూ" అని అడిగితే రాముడు "నే తెస్తా తాతా" అని ప్రక్కనున్న అకుమళ్లోకి పరుగెత్తాడు. అక్కడుండే కాపలా గంగణ్ణి అడిగి చెంబుతో నీళ్లుతెచ్చి తాతకు తాగించాడు. తను చెంబిచ్చి తిరిగిరాగానే తాత బొడ్లోని ఒకగుడ్డ సంచిలోంచి ఎన్నో మడతలు పెట్టిన కాయితంతీసి" ఇది మీ అమ్మకియ్యి బాబూ" అంటూ మళ్లా సంచిలో పెట్టి మూతికట్టి తన జేబులో పెట్టాడు.

రాముడు తాతవళ్లో కూచ్చుని "అమ్మనీ, నన్నూ మీ యింటికి తీసుకెళ్ళవా తాతా" అని అడిగాడు. తాత తలగుడ్డ చెంగుతో ముఖం తుడుచుకుంటూ "మీ నాన్న నడుగు...ఎప్పుడు పంపుతాడో...నే మళ్లావచ్చి తీసుకెళతా"నన్నాడు. రాముడికనేమీ అనలేక తాత వేళ్లల్లో తన వేళ్లు దూర్చి ఆడుకుంటున్నాడు.

తాత తన జుట్టును ముద్దెట్టుకుంటూ "మీ అమ్మ బాగుందా బాబూ" అని అడిగితే-రాముడు "ఓ" అన్నాడు.

"మరి...మీ చెల్లెలు నడుస్తూందా?"

"ఆ! బుల్లిబుల్లి మాటలు కూడా చెబుతోంది తాతా...నన్ను అన్న అనదు-అక్క అంటుంది"

"అట్టాగా?...దాని పేరేమిటీ?"

"శాంత...నాన్నమ్మ పేరట తాతా"

"మరి మీ అమ్మేమని పిలుస్తుందీ చెల్లెల్ని"

"అమ్మా అంటుంది. ఒక్కొక్కసారి సుభా అంటుంది."

"మీ అమ్మమ్మ పేరేమిటో నీకు తెలుసా బాబూ?"

"సుబ్బమ్మకా తాతా?-నాకు గుర్తే-చచ్చిపోతేనూ ఏడిచాగా తాతా?"

"అవున్నాయనా...అదుష్టమంతురాలు"

"తాతా!...మరేం...మరేం...అమ్మమ్మ మురుగులు అమ్మేమో పెట్టిలో దాశిందీ...నాన్నేమో అటితో ఏవో చేస్తాను యిమ్మన్నాడూ...అమ్మేమో యివ్వనందీ...నాన్నేమో అమ్మని కొట్టేడూ...తాతోయ్, అమ్మ నన్ను కావిలిచ్చుకుని ఎంతేడిశిం దనుకున్నావ్...మరేం-అమ్మ వీపుమీద వాతలు వాశినియ్ తాతా "అని చెబుతూనే రాముడు ఏడ్చాడు. తాత "మా అమ్మే...సీతామ్మవారిలా ఎన్నికష్టాలే నీకు..."

అంటూ గావురుమన్నాడు. రాముడు కన్నీళ్లు తుడుచుకుని "ఏంటి తాతా ?" అని అడిగితే - "ఏంలేదు బాబూ...మీ నాన్న అమ్మని కొట్టకూడదంటానని నన్ను మీ యింటికి రానివ్వటంలేదు బాబూ" అని చెప్పాడు. రాముడు "మరి... నేను మా నాన్నని ఆపాను తాతా...అమ్మని కొట్టద్దన్నాను...నన్నేమీ అనలేదేం ? బొజ్జ తాతమాత్రం...ఏడిశావులే అన్నాడే నన్నూ" అంటూ చెప్పాడు. తాత - "ఆ బొజ్జవెంకన్నేరా బాబూ - మీ కాపరాన్నిట్లా తగలెట్టింది" అన్నాడేగాని అదేమిటో రాముడు కర్థంకాలేదు. "నువ్వొచ్చి మా బొజ్జతాతని చంపెయ్‌రాదంటే తాతా" అని అడిగాడు. "అడు అమ్మనీ, నన్నూ జడిపిత్తాడే" అని కూడా ఫిర్యాదు చేశాడు. నూరన్న తాత "నే కాదుగాని - నువ్వే పెద్దయ్యాక ఆ బొజ్జ పగలగొట్టు...ఏం ?" అని బోధించాడు. రాముడు "ఓ..నాన్నం తయ్యాక చంపేత్తా" అన్నాడు...

* * *

కారు లటూ యిటూ వెళుతూనే వున్నాయ్. తాతా మనవళ్ళకు వాటిమాటే లేదు. పదిగంట లవుతూంది. ఓ కారాగింది. ఎవరో దిగారు. అందులో ఒకరు రాముణ్ణి గురుపట్టారు. "ఏరా యిక్కడున్నావేం యింతపొద్దోయినా ?" అని అడిగాడు. తాత "నా వెంటవచ్చాడు గానీ...మీరు తీసుకెళ్లండి బాబూ" అని అడిగాడు. ఆ పెద్దమనిషి రాముణ్ణి రమ్మన్నాడు. వాడు" కాశేపుండి ఎల్తాతాతా" అని యింకా డొక్కల్లోకి జరిగాడు.

కాస్సేపటికి రాముడు "ఈపూరెందుకొచ్చావ్ తాతా ?" అని అడిగాడు.

"నిన్ను ఆఖరుసారి చూచి పోదామని బాబూ"

"మరి నాతో మాట్లాడకుండానే వెళ్లిపోతున్నావేం దొంగలాగా తాతా ?"

"నామూలాన నువ్వు నీవేషం సరిగ్గా వెయ్యలేదు. మరి పంతులు కొడతాడేమో ననుకున్నా(నా...ఏమన్నా అన్నాడా పంతులూ ?"

"నే వేషం వెయ్యలేనన్నాడు తాతా...యింకేమీఅనలా...అసలా వేషంపాడు ది తాతా.. కోయ్యలాగా నుంచోవాలీ"

"అవును బాబూ...నువ్వు రాజువేషం వెయ్యాలసలు."

"మరివచ్చే ఏడువేస్తాగాని చూస్తాకి వస్తావా తాతా"

"ఊఁ...ఏమో..."

"ఊఁ...నువ్వు రాపోతే నే వెయ్యనే వెయ్యను"

"ఆ! అట్లాగే వస్తాలే బాబూ"...

రావాలి తాతోయ్... లేపోతే అంతా... అంతే" అన్నాడు రాముడు హుషారుగా.., తాత నవ్వుతున్నాడు.

పొద్దు పోతూంది... కారు లికరావు కూడాను. అయినా తాత ఏ కారునూ ఆప ప్రయత్నించలేదు. "రాముడు" కారాపవేం తాతా" అని అడిగితే... తాత అప్పుడే నిద్రలేచినట్టు గాభరాపడ్డాడు. "నేనా వచ్చేకారెక్కి వెళతాగాని యిక నువ్వు యింటికెళ్ళు బాబూ! అమ్మతో నే వెళ్ళిపోయానని చెప్పు చెల్లెల్ని నాపేరుచెప్పి ముద్దుపెట్టుకో...ఏంరా?" అని రాముణ్ణి అడిగాడు.

రాముడు "సరే తాతా" అన్నాడు. తాత "మరి నేవచ్చాననిగాని, యిట్లామాట్లాడాననిగానీ మీనాన్నకీ, తాతకీ చెప్పకూకు...ఏం" అని బతిమాలాడు. రాముడు దానికీ నవ్వుతున్నాడు. ఒక పాలేరు గడ్డిమోపుతో వూళ్ళోకి వెళుతుంటేవాడికి రాముణ్ణిచ్చి, యింటివద్ద దింపమని చెప్పి మనవణ్ణిపంపేశాడు తాత.

తను తాత నెన్నో ముద్దులు పెట్టుకుని "వెళ్తాను తాతా...మళ్ళీ ఆరోగ్య వారాలప్పుడు రావాలి తాతాయ్...రాజువేషం వేస్తాగా.. రా వా వా లి తా తో య్" అంటూనే రైలుగేటుదాటి యింటికి వెళ్ళిపోయాడు.

* * *

రాముడు చరచరా యింట్లోకి పరుగెత్తాడు. బొజ్జతాతా, నాన్నా అన్నం తింటున్నారు. అమ్మ మజ్జిగ వడ్డిస్తూంది. అమ్మను చూడగానే ఖర్జూరకాయలిచ్చి, తాతసంగతులు చెబుదామనుకున్న రాముడు యీ గది చూడగానే కాపులమధ్యకు వప్పులు తెచ్చుకున్నట్లు ఫీలయ్యాడు. గుమ్మంలోని కాలు వెనక్కు తీసుకుని వెనక్కు వెళ్ళబోయాడు. వెంకన్నతాత గ్రురుగ్రతెప్పి "ఇప్పుడుదాకా ఎక్కడ పెత్తనాలేడిశావ్ రా?" అని కేకేశాడు. రాముడు కేదో గొంతు పట్టినట్లయింది. మాట్లాడలేదు...నాన్న "చెప్పవేంరా?" అన్నాడు కోపంగా. రాముడు కళ్ళలో నీళ్లు తిరిగాయ్.

అమ్మ ఎగాదిగా చూచి "ముఖం రంగన్నా కడుక్కోలేదు...ఆటకాలవీ కొందటండీ ... ఆటలతో అలస్యమయింది కాబోల్నలేండి" అని సర్దిచెప్పింది. "అదే చెప్పరాదట్రా సన్నాసి" అన్నాడు బొజ్జతాత. "ఏం ప్రయి జొచ్చిందిరా" అన్నాడు తండ్రి. రాముడు కా బహుమతుల సంగతే గుర్తులేదు. తనకు కనీసం పెన్సలన్నా వచ్చివుండాలి ... తనేమో చివరికంటూ సభలో లేడయ్యె...ఏం చెప్పాలో తెలిక; యికనాన్న, తాతా కొడతారేమోననే బిగువుతో తెల్లబోయాడు రాముడు.

అమ్మమెల్లగా దగ్గరకొచ్చి జేబు తడిమింది. ఖర్జూరకాయలుతీసి "ఇవిచ్చారా నాయనా" అంది. చేసేదిలేక తలూపాడు రాముడు. జేబులోని సంచీతీసి "ఇదేమిటి బాబూ" అంది అమ్మ...రాముడు ఆ సంచీ లాక్కొని బైటికిపారిపోయాడు–అదితండ్రీ, తాతలుచూస్తే సూరన్న తాత రహస్యం బయటపడుతుందేమోనని భయంతో.

అమ్మ "ఏదో బహుమతి కావాల్నండీ...దాచుకుంటున్నాడూ" అంది. తండ్రీ, తాతా తృప్తిగా పక్కలమీద పడుకున్నాక రాముడు దొడ్డిదోవనే యింట్లోకి వెళ్ళాడు. తల్లి అన్నంతినమంటే "ఆకలిలేదే అమ్మా" అని వెళ్ళి చెల్లెల్ని ముద్దుపెట్టుకుంటూ, దాని చెవిలో సూరన్నతాత ముద్దులు చెల్లీ" అని చెప్పాడు.

అమ్మ అన్నంతిని, వంటిల్లుసర్ది తనకో గ్లాసుడు పాలు తెచ్చి యిచ్చింది. అవి తాగి తను పడుకున్నాడు. సూరన్నతాత యిచ్చిన సంచీ జేబులో పెట్టుకుని దాన్ని చేత్తో అదిమిపట్టుకుని నిద్రోయాడు తెల్లవారుఝామున లేవగానే అమ్మ చలికట్టు కట్టి చదువుకోమని పుస్తకంయిచ్చి మజ్జిగ చేస్తూండగా ఆ సంచీతీసి యిచ్చాడు. సూరన్న తాత సంగతులన్నీ చెప్పాడు. అమ్మ ఆ సంచిలోని కాయితం చదువుకుని, రాముణ్ణి కౌగలించుకుని కన్నీళ్ళపెట్టుకుంటూంటే రాముడూ ఏడ్చాడు గాని ఎందుకో అర్థంకాలేదు.

అప్పుడూ, ఆ తర్వాతా తల్లి ఏడుస్తూనే వుంది. పొద్దుపొడవగానే రాముడుకు చద్దన్నం పెట్టి, ఆ తాత ఎలా వున్నాడనీ, ఏమేమన్నాడనీ మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకుంటూంది. అప్పుడే అనుమళ్ళ కాపలాగంగయ్యవచ్చి, అరుగు మీద కూచ్చున్న బొజ్జతాతతో "మీ వియ్యంకుడుగారు కార్లాగేచెట్టు దగ్గర చచ్చిపడి వున్నారండీ" అని చెప్పాడు. ఆ వెంకన్న తాత "ఆ దొంగ ముండాకొడుకు మాక ప్రదిష్ట తేవడానికొక్కకపోతే—అక్కడే చావాలీ, యింటి కఘోరించకూడదు" అనడం రాముడు వినలేదు. "నాన్నా" అని కేకేసి గోడకు జేరబడిన తల్లినికూడా గమనించలేదు. అన్నం వదిలి ఎంగిలిచేత్తోనే రోడ్డుకు పరుగెత్తాడు. తాత పెదిమలకూ, బుగ్గలకూ అంటుకున్న పొడరు అలానే వుంది. ★

అంత్యక్రియలు

శ్రీ పోతుకూచిసాంబశివరావు

పాత్రలు:

1. రమణమూర్తి } భార్యాభర్తలు.
2. విశాలాక్షి }
3. వెంకటేశ్వర్లు : చనిపోయిన వెంకమ్మకు తమ్ముడి వరస.
4. పాలయ్య : వెంకటేశ్వర్లుకు పొరుగింటి మనిషి.
5. పుల్లప్ప } మూర్తిని పరామర్శ చేయడానికి వచ్చిన బంధువులలో యిద్దరు.
6. సుబ్బమ్మ } 45 ఏండ్ల వితంతువులు.

1 వ రంగం

(వసారా. చనిపోయిన వెంకమ్మకు దహనక్రియలు జరుగుతాయి)

వెంకటేశ్వర్లు : ఏం నాయనా! దహనక్రియలన్నీ పూర్తయ్యాయా ?

రమణమూర్తి : యిప్పుడే అయ్యాయండి.

వెం : అప్పుడే అపరాహ్ణం దాటింది. కాస్త రెండు మెతుకులు కూడా నోట్లో వేసుకోలేకపోయారా పాపం!

ర : అది ˝ డా యిప్పుడే అయిందండి.

వెం : (బెంగసరిగా) అయిందిగదా! సరే!...చూస్తూచూస్తూ యిలా హఠాత్తుగా చనిపోతుందనుకోలేదు నాయనా!

ర : ఎవరికి ఎన్నాళ్లు యీ భూమిమీద ఋణమో, అంతకాలమే బ్రతుకుతారు.

వెం : మీ రంతా యింతకాలం దూరంగా ఉండిపోయారు. ఇక్కడ నేను వంటిగాణ్నైపోయాను. నా శరీరంలో జవసత్వాలు ఉన్నంతవరకు ఆమెకు చాకిరీ చేశాను.

ర : మీకు అప్పగారని ఆ అభిమానం ఉండబట్టి, పండుముసలైనా, నాయనమ్మను కనిపెట్టి చూశారు.

వెం : అయినా నేను చేసింది మాత్రం ఏముందిలే!...చివరివరకు ఎప్పుడూ నీ మాటేరా దాని నోటివెంట! 'మనమడు దూరంగా పోయాడు. చచ్చేటప్పటికైనా వస్తాడో రాడో' అని విలపించేది.

ర : మనుమడనైనందుకు, ఆమాత్రం అభిమానం ఉండదాండి మరి!

వెం : ఏదో యీ పన్నెండు రోజులు దివ్యంగా అంత్యక్రియలు జరిగాయంటే, ఆ ముసలిది స్వర్గంలో సంతోషిస్తుంది. మీ నాన్న పోయినందుకు యీ బాధ్యత కుఱ్ఱాడివైనా నీమీద పడింది పాపం!

ర : యిది పెద్ద బాధ్యత కాదులెండి... ఏ ముహూర్తాన మా నాన్న నాకు ఒడుగు చేశారో, అప్పటినుంచి నా కుటుంబంలో చనిపోయినవాళ్ళ దినవారాలు చాలావరకు నేనే పెట్టవలసి వస్తోంది.

వెం : ఎలాగైనా చిన్నప్పటినుంచి చాలా కష్టాలు పడ్డావునాయనా! బుద్ధిమంతుడవు కాబట్టి ఓపిగ్గా యిందరి తద్దినాలు విడవకుండా పెడుతున్నావు. మరొకడైతేనా...చెప్పేదేముంది ?

ర : మరేలెండి...అయితే నాయనమ్మ చనిపోయేటప్పటికి, ఏమైనా ఆస్తి మిగల్చిందాండి!

వెం : ఆస్తా! రామ! రామ! ఆస్తి ఎక్కడిదోయి. ఉన్న ఆస్తి కాస్త మీ నాన్న పాడుచేశాడుకదూ! యింతకాలం యీ ముసలమ్మను నా ఆదాయంపైనే పోషించాను.

ర : అవిడకు మూడెకరాలు పల్లపు భూమి ఉండాలని జ్ఞాపకం. అసలు ఏమీ లేదాండి!

వెం : భూమి ఎక్కడిదిబాబు! నువ్వు ఉద్యోగాలకు దూరప్రాంతాలకి వెళ్లేటప్పుడు అవిడకు మూడుఎకరాలు ఉండడం నిజమే. కాని అవి కూడా మీ నాన్న అనంతరపు హక్కుకు అమ్మేశాడు కదూ! పైగా ఆ మూడుఎకరాలు ఆ గవరయ్యకు కవులు యిచ్చాడు. 'యీ ఏడు పంట పండ లేదని, పంటలు ముసురులవల్ల పాడైపోయా' యని, ఏదో మిష పెట్టి, ఆ గవరయ్యగాడు ఏ ఏడూ యింత రొఖ్ఖం కూడా యిచ్చిన పాపాన పోలేదు. నేనా ముసలివాణ్ణైపోయాను. కదలలేనివాణ్ణి. అందుచేత, నా కున్నదాంట్లోనే ఆ ముసలిదానికి పెట్టి పోషించాను.

ర : సరేలెండి.

(పుల్లప్ప, విశాలాక్షి ప్రవేశం)

పు : ఏంరా! రమణమూర్తి! మీ నాయనమ్మ యింతలో యిలా చచ్చిపోతుం దనుకోలేదు.

వి : 95 ఏండ్లు నిండేయిగా! యింకా ఎంతకాలం బ్రతుకుతుం దేమిటి?

పు : నీకోసం ఆ ముసలిది ఎంత పలవరించే దనుకున్నావు ? ఒక్కనాడూ వచ్చి చూడకపోయావు.

ర : ఎప్పటికప్పుడే వద్దామనుకుంటూండేవాణ్ణి కాని ఉద్యోగంలో చేరాక తీరుబడి ఎక్కడిదీ ?

పు : మీ నాయనమ్మవంటి మంచి మనిషి, అంత ఆచారవంతురాలు, మళ్ళీ యింక పుట్టదురా!

ర : మరేనండి.

పు : మా కందరికీ ఎంతో సహాయంగా సలహాదారుగా ఉండేది అన్ని విషయాల్లో. (దుఃఖంతో) ఆ పెద్ద దిక్కు పోయినందుకు మా కెంత బాధగా ఉందో!

ర : ఉండదండీ! అందరికీ ఉంటుంది!

పు : వంట్లో సత్తువ ఉన్న రోజుల్లో, మా యింట్లో ఏ కష్టం వచ్చినా ఏ శుభం వచ్చినా ముందుగావచ్చి ఆదుకునేది.

ర : అలాగాండి!

పు : నువ్వంటే ఎంత అభిమాన మనుకున్నావు! కొడుకూ కోడలు చనిపోవడం మూలాన వంశానికి నువ్వొక్కడవే మిగిలావని, నీమీద పంచప్రాణాలు పెట్టుకుని చనిపోయింది.

వి : పాపం!

(పాలయ్య ప్రవేశం)

పా : వచ్చావురా నాయనా! మీ నాయనమ్మ నీ కింత కష్టం కలిగిస్తుం దనుకోలేదు!

ర : ఏం చేస్తాంలెండి!

పా : నే నెప్పుడూ మీ నాయనమ్మ దగ్గరే ఉండేవాణ్ణి! పాపం! మంచి మంచి అరటిపళ్ళన్నీ నాకు పెట్టి, కుళ్ళిపోయిన పళ్ళన్నీ తినేది మీ మామ్మ! నేనంటేను ఎంత అభిమానమనుకున్నావు మీ

నాయనమ్మకు! పైస మిగిలితే జాగ్రత్తగా పత్తిడబ్బాలో దాచి ఎవరికో ఒకరికి యిచ్చేది.

ర: ఆవిడకు అందరూ ఒకటేనండి.

పా: మరే నువ్వంటే కూడా చాలా పలవరించేది...అయినా యింత హాఠాత్తుగా చచ్చిపోతుం దనుకోలేదు. పడుకున్నట్టే పడుకుని యిట్టే ప్రాణం వదిలేసింది. చచ్చే కాలానికి నాకు ఊళ్లో ఉండే యోగమైనా లేకపోయింది.

పు: యింతకీ ఆవిడ చాలా అదృష్టవంతురాలు.

(సుబ్బమ్మ ప్రవేశం)

సు: (ఏడుస్తూ) మీ నాయనమ్మను పంపించేశావురా నాయనా! నీ కింత కష్టం వస్తుందనుకోలేదు.

ర: యిది పెద్ద కష్టమేమిటమ్మా! ఆవిడ చాలా పెద్దదైపోయింది. అందుచేత చనిపోవడం సహజం.

సు: అవునులే! కాని నీకు ఆ పెద్ద దిక్కు కూడా లేకుండా పోయిందని నా విచారం.

ర: ఏంచేస్తాం! ఎవరు ఎన్నాళ్లు జీవించే యోగం ఉంటే అంతే!

సు: అయితే అంత్యక్రియలు 12 రోజులు యిక్కడే చేస్తావా?

వి: యింకా ఏదీ నిశ్చయించలేదు

సు: ఏదో అందరం ఇక్కడే వున్నాం నలుగురు బంధువులు యిక్కడికి రావడానికి వీలవుతుంది. అంత్యక్రియలు యిక్కడే చేస్తే ఆ ముసలమ్మ ప్రసాదం మేమంతా తిన్నవాళ్ళమూతాము.

ర: యీ వేళో రేపో ఏదో నిశ్చయిస్తాగా!

వెం: నే నప్పుడే అందరికీ ఉత్తరాలు రాసేశాను, నువ్వు వచ్చి యిక్కడే 12 రోజులు అంత్యక్రియలు చేస్తావని. యిక్కడ చేస్తేనే మంచిదని నా సలహా!

పు: వెంకటేశ్వర్లు కూడా పెద్దవాడైపోయాడు. వాడి అవ్వ ప్రసాదం వాడికి ముట్టేటట్లు చూడునాయనా! ఎంతో కాలం దాన్ని కనిపెట్టుకు చూశాడు.

పా: మూర్తికి మాత్రం తెలియదూ యీ సంగతి వాడేమైనా కుఱ్ఱవాడు కనుకనా!

ర: అలాగే! ఆలోచించి చెప్తాను.

2 వ రంగం

వెం: ఏమే సుబ్బమ్మా! మనవాడిలో అసలు దుఃఖమే కనిపించటం లేదేం!

సు: ముసలమ్మ చచ్చినందుకు పీడ వదిలిందని సంతోషిస్తున్నాడేమో లోపల.

పా: కంటినుంచి ఒక నీటిచుక్కైనా లేందే! యిదేం చోద్యమో!

పు: ఏమో బాబు! మా కాలంలో ఎవరైనాపోతే నిజంగా ఎంతకాలం ఏడ్చేవాళ్ళం. రెండేళ్ళదాకా పరామర్శ చేయడానికి వచ్చిన వాళ్ల ముందు ఏడుస్తూ ఉండేటప్పటికి కళ్లు కాయలు కాచి కంటిరోగాలుకూడా వచ్చేవి.

వెం: చచ్చిన ముసలమ్మ "పోనీ మంచిది. చనిపోయింది" అనైనా ఒక్క ముక్కకూడా అనలేదు. "ఎవరి కెంత ఋణమో అంతే" అంటాడు. యిదెక్కడి వేదాంతం? యీమాత్రం వేదాంతం మనకు తెలియదటర్రా!

పా: మనకు యీ వేదాంతం తెలియకే యిన్నాళ్లు ఏడ్చేవాళ్ళమా? పరాయివాణ్ణి నాకైనా ఏడుపు వచ్చిందికాని, ఆ మూర్తిగాడు ఒక్క నిట్టూర్పు కూడా విడువలేదు.

సు: యీ కలికాలంలో కనిపించే వింతల్లో యిదొకటి.

పు: వెనక నాకు చిన్నతనంలో 16 వ ఏటే ఆయన చనిపోయాడు. అప్పటికి నేను కాపురానికి వెళ్ళనేలేదు. కాని అప్పుడు నాకు జుట్టుతీయించి, సైనుపంచ ఇచ్చారు. ఆ తర్వాత ఐదేండ్లదాకా వచ్చే వెళ్ళే వాళ్ళ పరామర్శలతో విసిగెత్తిపోయిందనుకో! ఎవరైనా పరామర్శకు వస్తోంటే, మా అమ్మ నన్ను జాగ్రత్తగా కూర్చోపెట్టి ఏడ్వమనేది. చిన్నపిల్లని, నాకు ఎలా ఏడ్పువసుంది! సాధారణంగా వచ్చేది కాదు. ఏడ్వడానికి కొంచెం నా కంట్లో కారం రాసేది మా అమ్మ అప్పుడప్పుడు. లేకపోతే ప్రక్కనుంచి సొంటిపిక్క పెట్టేది. అప్పుడు ఏడ్చేదాన్ని. ఎలాగైనా నల్గురు పరామర్శకు వచ్చినప్పుడు కాస్త ఏడ్వకపోతే ఎలాగ?

సు: కాదుటమ్మా! అందులో యింటికి పెద్దది. అటువంటి నాయనమ్మపోతే ఏడ్వకుండా ఉండడం ఏమంత బాగులేదు. నాకూ ఆ మధ్య వైధవ్యం వచ్చిందా! అప్పుడు నీలాగే నాకూ పరామర్శ చేయడానికి వచ్చేవారు. ఆయన పోయిన 6 ఏండ్ల తర్వాత ఒకరోజు నే భోంచేస్తూంటే మా పినతాతయ్య గబుక్కున పరామర్శకు వచ్చాడు. వచ్చి "ఏమే సుబ్బీ, నీమొగుడు పోయాడటకదూ!" అని అన్నాడు. ఆ మాట వినేటప్పటికి ఉలిక్కిపడ్డాను. అన్నం తింటున్నానేమో, గబుక్కున ఏడ్వబోయే హడావిడిలో, అన్నంముద్ద గొంతుకులోపడి పైకి కిందకు రాక నేను కూడా చచ్చేటంత పనైంది. చివరికి ఏడ్చేననుకో! తీరా ఏడ్వకపోతే లోకం ఏమను

కుంటుంది? చచ్చినవాళ్లమీద అసలు అభిమానమే లేదనుకోదూ లోకం?

వెం : మా నాన్న పోయాక, ఏ ఏండ్ల దాకా నేను యింటి బైటికి వెళ్ళేవాణ్ణే కాదు!

సు : పైగా ఆ విశాలాక్షిని చూడమ్మా! మొగుడు నాయనమ్మ పోయినందుకు 'అయ్యో' అని కూడ అనలేదు.

పు : దాని కొందుకుంటుందే ఆ ముసలి దానిమీద అభిమానం.

వెం : ముసలిది వాళ్ళకేమీ యివ్వలేదని కాబోలు మాతులు ముడుచుకు కూర్చున్నారు.

పు : అయితే వెంకటేశ్వర్లూ! ముసలిది ఏమీ వాళ్ళకివ్వలేదూ! అంత్యక్రియలు చేయాలంటే కొస్తా కూస్తా అవుతుందా? అధమం ఏ వందలైనా కావాలి అగ్నిహోత్రంలాంటి మన కుటుంబ పరపతి నిలవాలంటే!

వెం : రామ! రామ! ఒక్క కానీ యివ్వలేదర్రా! యివ్వడానికి దాని దగ్గర ఏముంది? యిన్నాళ్లు నేనేగా పోషించాను దాన్ని.

పా : అయినా మనుమడాయను! ఒక్కరోజైనా ముసలిదాన్ని చేరదీశాడూ పెళ్లి చేసుకుని పెళ్ళాన్ని తీసుకుని ఉద్యోగానికి పోయాడుగాని. యిన్నాళ్లు ముసలమ్మకు చాకిరీ చేదామని బుద్ధైనా పుట్టలేదుగా!

పు : పో నీ లె ద్దూ! అటువంటివాడికి ముసలిది ఏమన్నా యిచ్చినా తప్పే! ప్రేమతో పెంపుచేసుకుని, తండ్రి కిచ్చిన ఆస్తిఅంతా తండ్రి తగలెట్టాడా! యింక వాడు కుమాత్రం తగలబెట్టడని రూఢి ఏమిటి?

సు : మా బాగా అన్నావు పుల్లప్పా!

వెం : అయితే అంత్యక్రియలు యిక్కడ చేస్తాడా పుల్లప్పా! ఒకసారి నువ్వు కనుక్కుందు!

పు : యింతకీ వాడిదగ్గర డబ్బుందో లేదో యిప్పుడు.

వెం : దొబ్బుడాయి. పట్నంలో వంద రూపాయిలు తెచ్చుకుంటున్నాడు నెలకి. ఆమాత్రం నిలవ ఉండదూ?

సు : ఏది ఏమైనా యిక్కడ 12 రోజులు అంత్యక్రియలు చేస్తే ఆ ముసలమ్మ తరిస్తుంది. పదిమంది తనవాళ్ళ నేవాళ్ళకి భోజనం పెట్టినట్లూ ఉంటుంది. మనం మాత్రం ఊరికే వస్తామా! పరామర్శ చేయటం మన ధర్మం కాబట్టి, యీ పన్నెండు రోజులు ఉండి, పరామర్శ చేసి వాళ్ళ కష్టాలు పంచుకుని, అంత్యక్రియలు చేయించి మరీ వెడతాము.

వెం : సుబ్బమ్మా! కాస్త వాడితో చెబుదు! ఎలాగైనా కొంచెం చనువున్న దానివిగా!

సు : అలాగే ప్రయత్నిస్తాను. రావే పుల్లప్పా! మనవాళ్ళని వల్లురినీ కలుసుకు వద్దాం. (సుబ్బమ్మ, పుల్లప్ప నిష్క్రమణ)

పా : యిదిగో! వెంకటేశ్వర్లు! నా

(19-వ పేజీ చూడండి)

బ్లాంక్ పేపరు

టంగ్, టంగ్, టంగ్, విశ్వం ఖంగారుపడ్డాడు గంటలువిని. ఎదురుగుండా ప్రశ్నపత్రం, తను వ్రాయవలసిన ఆన్సరు పుస్తకము వున్నాయి. "అబ్బా! అప్పుడే రెండు గంటలైందీ!" అనుకున్నాడు. విశ్వం కళ్లు యెర్రగా వున్నాయి. తెల్లవార్లు నిద్రలేకుండా చదివేడు, కాని, యింతవరకు ఒక్క అక్షరమైనా వ్రాయలేదు. ఇచ్చిన ప్రశ్నలకు యిందాకటినుండి సమాధానం ఆలోచిస్తున్నాడు. కాని, తండ్రి సుబ్రహ్మణ్యం మరణశయ్యమీద చినిగిన గుడ్డలూ, పాలిపోయిన ముఖమూ, మాసిన గడ్డమూ కండ్లకు గోచరిస్తున్నాయి.

*   *   *   *

సుబ్రహ్మణ్యం మిడిల్ స్కూలు మేష్టరు. స్కూల్లో ఇంక్రిమెంట్లు సరిగా యివ్వని అధికారి ఒక పుణ్యాజనుడు. పిత్రార్జిత మేమీ లేదు. రెక్కలే ఆధారం. అతనికి ఒక్కగానొక్క కొడుకు విశ్వం. సుబ్రహ్మణ్యం పెద్ద చదువు చదవలేక పోయాడు. అందుచేత తన కొడుకుని ఎం. ఎ. ప్యాసు చేయించాలి ఎంత కష్టపడైనాసరే అనుకున్నాడు. పిల్లవాడికి అయిదోసంవత్సరం రాగానే అక్షరాభ్యాసం చేసి అయిదు క్లాసుల వరకు తనే యింటివద్ద చెప్పి ఆ పైక్లాసులో వేయించాడు స్కూల్లో.

ఇదివరకు సుబ్రహ్మణ్యం జీతంతో అతనూ, భార్య, కొడుకు యెలాగో కాలక్షేపం చేయగలిగేవారు. విశ్వం హైస్కూలు చదువైపోయింది. కాలేజీలో ఇంటర్ మీడియేట్ చదువుతున్నాడు. సొమ్ములేక ఆఖరుటర్ము జీతం కట్టక పోవడంవల్ల పేరుకొట్టి వేసే పర్యంతం అయింది. సుబ్రహ్మణ్యం అడగరాని వాళ్లనడిగి, పట్టరానివాళ్ళ కాళ్ళు పట్టుకుని బదులు తెచ్చి కట్టడం జరిగి నిండా నెలకాలేదు. ఆ బాకీ యింకా తీర్చలేదు. ఇంతలో పులిమీద పుట్రలాగ పరీక్ష దరఖాస్తు ఒకటి వచ్చిపడింది. ఏమీ తోచలేదు. చివరికి తన భార్యమెడలో వున్న ఒక్క పుస్తెల సానూ ఆమెని పసుపుకొమ్ము కట్టుకోమని చెప్పి తాకట్టు పెట్టాడు. ఆ సొమ్ము తెచ్చి దరఖాస్తుకట్టి మిగిలినది అప్పుతీర్చాడు సుబ్రహ్మణ్యం.

విశ్వం ప్యాసయాడు. బి. ఎ. లో ప్రవేశించాడు. ఇదివరకు సుబ్రహ్మణ్యం పుదయం సాయంత్రం పరిశ్రమతో రెండూ, చాటుగా నాలుగూ ప్రైవేట్లు చెప్పుకునేవాడు. తనూ, భార్య ఒక్కపూట తిని కొడుక్కి కడుపునిండా పెట్టి కాలక్షేపం చేస్తున్నాగాని ఆ విధంగా కూడా గడవడం కష్టంగావుంది. ఒక షావుకారుదగ్గిరికి వెళ్ళి రోజూ సాయంత్రం ఆరుగంటలకు షాపులోని యేరోజు పద్దులు ఆరోజు వ్రాసి పెట్టడానికి ఒప్పుకున్నాడు. ఆ పద్దులు వ్రాసి వచ్చేటప్పటికి రోజూ రాత్రి పదిగంటలయేది. ఇదివరకెప్పుడైనా నడవలేకపోతే రిక్షా యెక్కేవాడు. ఇప్పుడెంత బాధగా వున్నా, దూరమైనా నడకే శరణ్యం. పగల్లా పాఠాలు చెప్పి చెప్పి వచ్చిన సుబ్రహ్మణ్యానికి కడుపునిండా తిండిలేదు. కాని, యీ కష్టమేమీ సుబ్రహ్మణ్యానికి కనబడడంలేదు. అతని దృష్టి అంతా విశ్వం చదువుమీద కేంద్రీకరింప బడివుంది. ఒక్క రెండున్నర సంవత్సరాలు కష్టపడితే కొడుకు ఎం. ఎ. ప్యాసైపోతాడు. తన కష్టాలు గట్టెక్కుతాయి. ఇలా అనుకుంటూ తృప్తిపడేవాడు. సుబ్రహ్మణ్యం మనస్సెంతో తేలిక పడ్డట్టనిపించే దలాంటప్పుడు.

తిండి పుష్టిలేక సుబ్రహ్మణ్యం వెనకటి ఆరోగ్యం కోల్పోతున్నాడు. మనిషి నీరసించాడు. గుండె లార్చుకుపోతున్నాయి. కొద్దిగా దగ్గు. దగ్గేకదా అదే పోతుందనుకున్నాడు. ఆ దగ్గు క్రమంగా యెక్కువై జ్వరంకూడా వస్తోంది. విశ్వం "నాన్నగారూ, నేను చదువుమానేసి ఏదైనా వుద్యోగం సంపాదిస్తాను. మీరు కష్టపడలేరింక. మన యిబ్బంది తీరుతుంది. ప్రైవేటుగా ఒకొక్కటే కట్టి పరీక్ష ప్యాసవుతాను" అని అన్నాడు. అనేక విధాల బ్రతిమలాడాడు. ఊహు నసేమిరా ఒప్పుకోలేదు సుబ్రహ్మణ్యం. ఇక కష్టపడినన్నాళ్ళు కష్టపడక్కర్లేదన్నాడు.

బి. ఎ. పరీక్షలు యిక మూడు నెలలున్నాయి. సుబ్రహ్మణ్యానికి దగ్గు, జ్వరం యెక్కువైపోయింది. ఆస్పత్రికి తీసుకువెళ్ళి డాక్టరుకు చూపించాడు తండ్రిని విశ్వం. డాక్టరు పరీక్షచేసి టి. బి. అని తేల్చాడు. వెంటనే క్షయాసుపత్రికి తీసుకువెడితే బ్రతుకుతాడని చెప్పాడు. చేతిలో దమ్మిడీ లేదు. రేపు యెల్లాగడుస్తుందా అనుకొని రోజులేని సంసారపరిస్థితిలో వైద్యం యేం చేయించడము? సుబ్రహ్మణ్యం వైద్యం వద్దన్నాడు. గోరంత ఆయుర్దాయముంటే యేం ఫరవాలేదన్నాడు. భగవంతుడే వున్నాడనుకున్నాడు.

కొద్ది రోజులకే మంచం పట్టాడు సుబ్రహ్మణ్యం. ఆనాటిరాత్రి పరిస్థితి చాలా విషమించింది విశ్వం, తల్లి కొయ్యబొమ్మల్లాగ నిలబడి వున్నారు. "మా నాన్నగారికి ప్రాణభయం లేదుకదా?" అన్నాడు విశ్వం. *About Half An hour More* (ఇక అరగంట) అన్నాడు నిరాశా సూచకంగా పెదవి విరుస్తూ డాక్టరు.

*   *   *   *

"*Half anhour More*" అన్నాడు హాల్ సూపరింటెండెంటు. విశ్వం ఆయన మీద లోపల విసుక్కున్నాడు.

ఇంతవరకు విశ్వం ఒక్క అక్షరమైనా వ్రాయలేదు. ఈ అరగంటలోనైనా వ్రాస్తే కొన్ని మార్కులు పడవచ్చు అనుకుని తన చుట్టుప్రక్కల యిటూ అటూ చూశాడు. ప్రక్క విద్యార్థులు వంచినతల యెత్తకుండా వ్రాస్తూండడం గమనించాడు. తనూ వ్రాద్దామని నిశ్చయానికి వచ్చాడు.

ప్రశ్నపత్రంకేసి తీక్ష్ణంగా చూశాడు ఇటూ అటూ వ్రాస్తున్న విద్యార్థుల్ని చూశాడు. ప్రక్కవాడి పుస్తకంలోకి చూశాడు. "అర్థశాస్త్రానికీ, నైతిక ప్రవర్తనకీ గల సంబంధమును చర్చింపుము" అనే

ప్రశ్నకు "ఆర్థిక సౌష్టవం లేకపోవ డంవల్ల నైతిక ప్రవర్తన కుంటువడుతుంది" అనే వాక్యం జవాబుగా వ్రాస్తున్నాడా విద్యార్థి.

ఆ రెండుముక్కలూ కాపీ చేద్దామను కున్నాడు. కలం ముందుకి రాలేదు.

"ఛీ" అనుకున్నాడు విశ్వం. తనలోని నైతిక ప్రవర్తన యింత తగ్గిపోవడము, తను కాపీ చెయ్యడానికి సిద్ధమవడమూ తనకు ఆర్థిక సౌష్టవం లేకపోవడంవల్లేకదా! అనుకున్నాడు. కాపీ చెయ్యాలన్న నీచమైన వూహ యింతవరకెన్నడు అతడెరుగడు. "నీతి, నియమం, ధర్మం, సత్యం, యివన్నీ వుండాలని చెప్పేవారంతా ఆర్థికంగా గొప్పవారే అయివుండాలి." అనుకున్నాడు విశ్వం.


డాక్టరు చెప్పినట్టే అరగంటకి చనిపోయాడు సుబ్రహ్మణ్యం భార్యనీ, కొడుకునీ దిక్కులేనివారిని చేసి. "మీ అమ్మ నాతోపాటు కష్టపడింది. నీతల్లిని జాగ్రత్తగా చూసుకో. నీచదువు పూర్తవడం చూడలేకపోయాను" అని విశ్వంతో కడసారిగా మాట్లాడాడు. జాలిగా కొడుకును చూస్తూ, రెండేరెండు కన్నీటి చుక్కలు రెండు కళ్ళనుండి చెంపలమీదికి జారాయి సుబ్రహ్మణ్యానికి.

*   *   *   *

విశ్వం కళ్ళనుండి రెండు కన్నీటిచుక్కలు రాలి చాక రకపుసిరాతో తన ఆన్సరు బుక్కు మీద వేసిన రిజిస్టరు నెంబరు చెరిగిపోయింది.

ఆనాటికి తండ్రిపోయి సరిగా నెల అయింది. విశ్వం తల్లిని పోషించాలి. తను బ్రతకాలి. అందుచేత యీ పరీక్షలో నెగ్గి తీరాలి.

తండ్రి తన అభివృద్ధికోసం యెంత కష్టపడ్డాడు. చివరకి ప్రాణంకూడా త్యాగం చేశాడు. తల్లి భర్తలేని దుఃఖంతో కుమిలిపోతోంది యింటిదగ్గర. విశ్వం కడుపులోంచి దుఃఖం ఉప్పెనలాగ పొంగి వస్తోంది. తల వంచుకుని దుఃఖం అణచుకుందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గంట కొట్టారు. విద్యార్థులవద్ద జవాబు పత్రాలు తీసుకుంటూ సూపరింటెండెంటు వచ్చాడు విశ్వం దగ్గరకి. విశ్వం తన బ్లాంక్ పేపరు ఆయనకిచ్చి బైటకు వెళ్ళిపోయాడు కాళ్ళీడ్చుకుంటూ. ★



అల్లరిలో ఆనందం

మా 'రాయమంద్రం' లో మా పాఠశాల వృద్ధ సరస్వతీనిలయాల్లో ఒకటైనప్పటికీ రౌడీస్కూల్ అనే పేరుని చాలఏండ్లుగా మహాభారంగా మోసుకు వస్తున్నది. అదిగాక అసలీ విద్యాసత్రం, ఈ మహానగరం (త్వరలోనే ఒక పుంజాడు సిటీబస్సులు రాబోతున్నవి లెండి!)లోనున్న ఎత్తుబడు లన్నిటిలోకీ సకల సౌకర్యములను అనుభవిస్తున్నది. రాజరాజ నరేంద్రునినాటి పునాదులూ, తెల్లదొరలనాటి దొంగగోడలు, (ఎప్పుడు విరిగి మీదపడతాయో ఎవరికి తెలుసు?) B. C. నాటి బెంచీలు, క్లాసులుగా మార్చబడ్డ గుర్రాల శాలలూ, పవిత్ర గౌతమీ నదీతీరాన (ఈ మధ్యనే అక్కడకు ఇత్తడిచెంబులతో సంధ్యాయాత్రల్ని బహిష్కరించారు. మన ప్రభుత్వంచేసిన మంచి పనులలో ఇది ఒకటని నేను మాక్లాస్ డిబేటులో నొక్కి వక్కాణించాను.) హాయిగా చల్లని పిల్లవాయువులు ఇవన్నీ చూస్తే పూర్వకాలపుగురుకులాలు జ్ఞప్తికివస్తాయి. అసలు రవీంద్రనాధ టాగూరుగారు శాంతినికేతనాన్ని ఇటువంటి అనుకూలక్షేత్రాన్ని విడిచిపెట్టి అక్కడెందుకు పెట్టుకున్నారో నాకర్థం కావటం లేదు. మాస్కూలు విద్యార్థులు ఆ సంస్థనూ (తద్వారా మ్యునిసిపాలిటీని), అన్ని స్కూళ్ళకంటె మిన్నగా *Main gate* వద్దనుండే వేరుశెనగ వగైరాల స్టాకిష్టు వెంకాయమ్మను పుణుకులు వగైరాల ఏజంటు సుబ్బయ్యని యింకా యింకా చాలామందిని అతిదయా ప్రేమ వాత్సల్యాలతో పోషిస్తున్నారు! ఇంతెందుకు మాస్కూలువలన ఒక చిన్న పల్లెటూరు (పల్లెటూరేం ఖర్మం! ఈ మేజరు మునిసిపాలిటీ ఆదాయంలో ఐదో వంతు మాదేగా?) జీవిస్తూంది అంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఈ విధంగానైనా గాంధీగారిని, పెద్ద లనుసరించక పోయినా మావాళ్లు అనుసరించడం (వేరుశెనగపప్పులో మాత్రమే నయినా మానడం లేదు. కాని మా స్కూలువాళ్లు గర్వించదగ్గ విషయం ఏమిటంటే S. S. L.C. *Public* పరీక్షలలో *Town First* ఇంకో స్కూలువాళ్లకి దక్కనియ్యకపోవటం. దీనికి కారణం మేం గాంధీగారి సిద్ధాంతాలలో కొన్నిటినైనా, అందరికంటె మిన్నగా అనుసరించటమేనని చెప్పకొని, గర్వంగా మాకు ఆయన సిద్ధాంతములయందుగల గౌరవాన్ని ప్రకటిస్తుంటాం.

మేమింత నెమ్మదిగా సున్నా మాస్కూలికి 'రౌడీస్కూల్' అనే బిరుదు ఒక అదృష్టపు పుట్టుమచ్చలా వదలటం లేదు. అసలిదెల్లావచ్చిందంటే సుమారొకదశాబ్దం క్రితం ఒకస్కూల్ఫైనల్ విద్యార్థి ఆఖరుసారి నోమునోస్తూ పట్టుబడిపోయి, తెగించి ఆ గురువుని మా మేడమెట్లమీదనుండి దొర్లించేశాడట! ఇది నిజమో అబద్ధమో గాని అప్పటినుండి మాకా పరీక్షకి సెంటర్ ఇవ్వక మొన్నమొన్ననే తిరిగి ధర్మంచేసుకున్నారు. ఆ పేరు మావాళ్లు పోగొట్టుగోడాని కిష్టపడక పోవడంవల్లనేమి, ఎల్లాగైతేనేమి, వంశపారంపర్యా వస్తూనేఉంది. ఇది మాస్కూలు పూర్వకథాసంగ్రహము.

మొన్న మొన్ననే మా ఊళ్లో ఉన్న, తప్పతప్ప మానగరంలో ఉన్న, రెండు, 'ఆడ(స్త్రీ)'ల పాఠశాలల్లోను ఒకదానికి ఏదో 'పండుగ' జరిగింది. అపుడక్కడకు మొదటితరగతే ఎక్కువ హాజరై ఆ సభ దిగ్విజయానికి శాయశక్తులా కృషి చేశారు. అపుడా పుణ్యఫలాన్నంతను మాస్కూలు విద్యార్థులపై వేసి యుద్ధడానికి ప్రయత్నించారు. కాని మా వాళ్లు తెలివిగలవాళ్లవటంచేత ఎలాగో తప్పించుకుని బయటపడ్డారు. నాకు మనస్సు కష్టంవేసింది. అలాగే ఆరాత్రి ఆలోచిస్తూ ఇంటికి తిరిగి వెళుతుండగా మా మునిసిపల్ గుడ్డిదీపాల దేదీప్యమానమైన వెన్నెల వెలుగులో రెండు కళేబరాలు (సన్నగా ఆబోతులవలె ఉన్నాయి) ఏదో తిట్టుకుంటూ ఉమ్ములతో రోడ్డంతా పాడు చేస్తూండటం కనిపించింది. పరీక్షించి చూడగా మా నగరంలోనే ఉన్న మరియొక ఎత్తుబడిలో ఆయనొకటీచరనీన్నీ, ఆయన ప్రక్కనున్న వ్యక్తి (సుమారుగా ఆయనకు డబుల్ ఉంటుంది లెండి!) ఆయన భార్యఅనిన్నీ గుర్తుపట్టగలిగాను. కొంచెం దగ్గరగా వెళ్ళగా వారి చర్చనీయాంశం లేదా విమర్శనీయాంశమేమిటో నాకర్థమయిపోయింది. ఇంకేముంటుంది? నా సహాధ్యాయుల నడతగురించి, మా విద్యానిలయం మేనేజ్మెంటుగురించీ వారు దుమ్మెత్తిపోస్తున్నారు. నాకపుడు కోపం సముద్రపు కెరటాల్లాగా పొంగి వచ్చిందంటే నమ్మండి! కాని సమయానుకూలంగా రేట్లు మార్చబడును కాబట్టి (అసలు నిజమేమిటంటే ఆయన భార్యను చూసేటప్పటికి నాకు కలకత్తా కాళికాలయములోని అంబ జ్ఞాపకం వచ్చింది, సుమండీ!) ఒకటినుండి పదివరకూ అంకెలు లెక్కపెట్టి గబగబా వారిని దాటిపోయాను.

*   *   *   *

ఆవేళ శనివారం. సరిగ్గా ఆవేళ్ళకి పై సంఘటనజరిగి వారమైంది. మా నాటకానికి రిహార్సల్సు పూర్తిచేసుకొని బయటికొచ్చేసరికి మా పేపర్మిల్లు 'సాయంత్రం ఫాలుగైనట్లుగా తెలియునది' అన్నట్టుగా ఒక్కసారి ఘర్జించింది. మేము శీలం, కాలం మొదటే నిర్ణయంచేసుకున్నాం కాబట్టి గబగబ 'టాయిలెట్' అయి ప్రత్యేకంగా ఆవేళ అద్దెకు తీసుకొనవలసొచ్చింది.) టిప్టాప్గా రంగస్థలం చేరుకున్నాం.

(49-పేజీ చూడండి)

శ్రీ వాడ్రేవు పాండురంగారావు

అంత్యక్రియలు

(15-వ పేజీ తరువాయి)

వాటా నాకిస్తావా లేదా? లేకపోతే నీ విషయం బట్టబయలు చెయ్యనా?

వెం: ఉండరాబాబు! యీ పన్నెండు రోజులు జరిగిపోనీ! తర్వాత నీ వాటా నీకిచ్చేస్తాగా!

పా: అలా పనికిరాదు. నాకా సగం లోఖ్ఖం యియ్యదలచుకున్నావా, యిప్పుడే యియ్యి. లేకపోతే...

వెం: అట్టే గొడవ పెట్టకు. యిప్పుడు ఒక వందరూపాయిలు తక్షణం యిస్తాను. తక్కినది యీ పన్నెండు రోజులు అయిపోయాక యిస్తాను.

పా: అప్పుడు యిస్తావని నమ్మకమేమిటి! పైగా అప్పటికి నీపనికూడా తీరిపోతుంది. నేను యీవిషయం అప్పుడు ఎవరితో చెబితే ఏంలాభం?

వెం: నీకు ఆ మిగిలిన 400 రూపాయిలు యిప్పుడు యిచ్చేస్తే యీ విషయం గురించి వాళ్ళకి చెప్పవని నమ్మకమేమిటి? నీ డబ్బు నీకు దక్కిందికదా అని నన్ను బట్టబయలు చేస్తే!

పా: నా మీద నీ కామాత్రం నమ్మకం లేదన్న మాట!

వెం: ఏం! నామీద నీకామాత్రం నమ్మకం లేదూ! యీపన్నెండురోజులు ఆగు! వాళ్ళంతా వెళ్ళిపోయాక నిశ్చింతగా మన వాటాలు మనం పంచుకోవచ్చు.

పా: సరేలే! నిన్ను నమ్మి ఊరుకుంటున్నాను యిప్పటికి.

3 వ రంగం

విశాలాక్షి: రామ! రామ! యిటువంటి దౌర్భాగ్యులనుకోలేదండి మీ బంధువులంతా!

రమణమూర్తి: ఏమయింది?

వి: మీ నాయనమ్మ పోయినందుకు మీరు సరిగ్గా ఏడ్వనైనా లేదుట. మీకు ఆవిడమీద అభిమానమే లేదుట.

ర: ఎవ రంటున్నారు?

వి: యింకెవరు! ఆ వెంకటేశ్వర్లు వాడి పురానీ కలిసి అంటున్నారు.

ర: నీ కెలా తెలిసింది?

వి: ఆ మాత్రం గూఢచర్య చెయ్యలేకపోతే మీకు భార్యనై ఉండడం ఎందుకండి? వాళ్లు మాట్లాడుకుంటూంటే ప్రక్కనుంచి పొంచి విన్నాను.

ర: మంచిపని చేశావులే!

వి: నన్ను దెప్పుతా రెందుకూ? వాళ్లు చేసినపని బాగుం దేమిటి?

ర: నేనుమాత్రం బాగుందన్నానా? ఎవరికి ఎలా ఏడ్వడం యిష్టమైతే అలా ఏడుస్తారు. అయినా నిత్యమూ చావులు చూసే నాలాంటివాడికి యిటువంటి చావు లెక్కలేదు. అందులో ముసలిమనిషి పోతే పెద్ద ఏడ్వవలసిన అవసరం ఏముందీ! 25 ఏండ్లు నిండలేదు, అప్పుడే నల్గురికి దహన క్రియలు చేశాను. నాన్నకి, అమ్మకి, తాతయ్యకు అమ్మమ్మకు ఇది ఐదోది. ఇన్ని కష్టాలు కళ్ళార చూస్తూంటే గుండె రాయిఅయిపోతే, యింక కంట నీళ్లెలా కారుతాయి! పైకి ఎంత గట్టిగా ఏడుస్తే అంత దుఃఖం ఉందనుకుంటుంది లోకం. దుఃఖం లోపలదిగమింగుకునే వాళ్ళసంగతి ఏం తెలుస్తుంది లోకానికి?

వి: ఆ సంగతి నాకు తెలియక అన్నానుటండీ! వాళ్ళు యిలా అంటున్నారని చెప్పాను కాని.

ర: నిన్ను మాత్రం ఏమంటున్నాను. అసలు సంగతి వెళ్ళబోసుకున్నాను.

వి: యీ పన్నెండురోజులు అంత్యక్రియలు జరిగితే పడితింతామని గుంపులు గుంపులుగా వస్తున్నారు మీ బంధువులంతా. మీరు పట్నంలో వందరూపాయిలు సంపాదిస్తున్నారట. ఏదో యింత డబ్బుమూట మీదగ్గర ఉందని వాళ్ల ఊహ.

ర: పల్లెటూరివాళ్లకు పట్నవాసాల సంగతి ఏమి తెలుస్తుంది? పల్లెలలో పది రూపాయిలతో సంసారాలు కాలక్షేపం చేయగలుగుతే, పట్నాల్లో వందరూపాయిలైనా కూటికి గుడ్డకి చాలవు. అయినా వాళ్ల దృష్టిలో యీ 'వంద' అంకె చాలా గొప్ప.

వి: అయితే అంత్యక్రియల సంగతి ఏం చేదాం. మీ నాయనమ్మ అంత్యక్రియలకైనా డబ్బిచ్చి చనిపోతుందనుకున్నామే!

ర: అదే నేనూ ఆలోచిస్తున్నాను.

వి: మీ నాయనమ్మ పీనాసి అని చెబుతారు. చనిపోయేటప్పటికి ఒక 500 రూపాయిలైనా దాచదుటండీ! అసలు ఆ వెంకటేశ్వర్లు ఆ మిగిలిన డబ్బు కాస్త 'గుటకాయ స్వాహా' చేసి ఉంటాడండి!

ర: ఏంచేస్తాం! అంతా మన అదృష్టం.

వి: అలా అనకండి. యిందాక పాలయ్య వెంకటేశ్వర్లు కలిసి ఏవో గుసగుసలాడుకుంటున్నారు. పాలయ్య 'నా సగం వాటా యిస్తావా లేదా' అంటున్నాడు. వెంకటేశ్వర్లు 'యిప్పుడు 100 రుపాయలు తీసుకో. తరువాత 400 రూపాయలు వీళ్ళంతా వెళ్ళేక యిస్తాను' అంటున్నాడు. 'ఇది జాగ్రత్తగా పరిశీలిస్తే ఏదో

వ్యవహారంలో వీళ్ళిద్దరికీ షుమారుగా 500 రూపాయలు వాటా ఉన్నట్లు కనిపిస్తోంది.

ర : వాళ్ళకి ఏం వ్యవహారాలున్నా యో మన కెందుకు ఆ గొడవలు.

వి : అది కాదండి. పైగా వెంకటేశ్వర్లు 'యీ పన్నెండు రోజులు దాటనీ రా' అంటున్నాడు. దీన్నిబట్టి చూస్తే మనకి సంబంధించిన విషయం ఏమన్నా ఉందేమో అని నా అభిప్రాయం.

ర: మన విషయం ఏముంటుంది !

వి : ఆ ముసలమ్మ చనిపోతూ, మీ కేమైనా డబ్బు యిచ్చిందేమో అని నా అనుమానం.

ర : అయితే యిప్పుడు మన మేం చెయ్యగలం. దేనికైనా ఋజువు ఉండాలిగా !

వి : నాకో ఆలోచన తట్టుతోంది. ఇది చేస్తే వెంకటేశ్వర్లు నోటి ద్వారా నే వస్తాయి అన్ని విషయాలు. పైగా మీ నాయనమ్మగారిపై మీకు అభిమానం లేదనే అపవాదు కూడా పోతుంది.

ర : ఏమిటది ?

వి : వెంకటేశ్వర్లుకు దెయ్యాలంటే భయము, నమ్మకము, ఉందని చెప్పారుగా నాతో ఒకసారి !

ర : అవును.

వి : మీరు (మెళ్ళో బంగారపు గొలుసు తీసి) యీ గొలుసు వెంకటేశ్వర్లుకు యిచ్చి ముసలమ్మ అంత్యక్రియలు చెయ్యడానికి ఏమన్నా డబ్బు అప్పు తెమ్మని చెప్పండి. అంత్యక్రియలు యిక్కడే చేద్దామనుకుంటున్నాం అని చెప్పండి. తక్కిన విషయాలు నేను చక్కపెడతాను.

ర : నాకేమీ అర్థంకావటం లేదు నీ మాటలు.

వి : నే చేస్తాగా అన్ని పనులు!...... ఊరుకోండి. సుబ్బమ్మవాళ్లు వస్తున్నారు.

(సుబ్బమ్మ, పుల్లప్ప ప్రవేశం)

సు : ఏరా, మూర్తీ! అంత్యక్రియలు యిక్కడే చేస్తారా?

వి : యిక్కడే చేయాలనుకుంటున్నాం. కాని ఆయనకు జరూరు ఆఫీసు పనులున్నాయి. పట్నం వెళ్ళిపోవాలేమో అంటున్నారు.

పు : ఆఫీసుపనులు ఎప్పుడూ ఉంటాయి నాయనా. మేమంతా పెద్దవాళ్లమయ్యాం. ఆ ముసలమ్మ ప్రసాదం కూడా మాకు పెడితే సంతోషిస్తాము.

వి : అదే నేనూ చెబుతున్నాను. యిప్పుడు మాదగ్గర డబ్బు లేదు. అప్పు అడిగితే వెంకటేశ్వర్లు తనదగ్గరకూడా ఏమీ లేదన్నాడుట. పోనీ యీ గొలుసు తాకట్టు పెట్టి ఆ వెంకటేశ్వర్లుగారు ఏమన్నా అప్పు తెస్తారేమో అని యిప్పుడే ఆయనతో అంటున్నాను.

సు : దానికేమమ్మా! యీ పూరి మనసబు నడిగితే యిట్టే యిస్తాడు 500 రూపాయలు యీ గొలుసు తాకట్టు పెడితే. తప్పకుండా చేయండి ఆ పని.

పు : ఇదుగో! వెంకటేశ్వర్లు యిలాగే వస్తున్నాడు.

(వెంకటేశ్వర్లు రాక)

ర : వెంకటేశ్వర్లుగారూ ! అంత్యక్రియలు యిక్కడ చేస్తేనే బాగుంటుందనుకున్నాం. మీరు యీ గొలుసు తాకట్టు పెట్టి కాస్త అప్పు తెచ్చిపెట్టితిరా యీ అంత్యక్రియలు పూర్తిచేయించిన వారవుతారు.

వెం : అంతకన్నా నా యనా! తప్పకుండా! ఎవరికైనా వస్తాయి కష్టాలు సహాయం చెయ్యడం మానవధర్మం.

వి : (వెక్కి వెక్కి ఏడుస్తుంది)

ర : ఎందుకీ ఏడుపు? గొలుసు మళ్ళీ విడిపిస్తాగా !

పు : పర్వాలేదమ్మా! ముసలమ్మ స్వర్గంలో ఎంతో సంతోషిస్తుంది నీ ఉదారత్వానికి. సకల శుభాలు మీకు కలగాలని దీవిస్తుంది.

వి : (గట్టిగా అరిచి బాధతో)...ఏదో బరువు మీద పడినట్లుందండి. అయ్యో. అబ్బా...

అందరు : ఏమిటి ? ఏమిటి ? (అని కంగారుగా పరిచర్య చేస్తూంటారు)

వి : (వికిలిగా, దెయ్యం పట్టినట్లు అరుస్తూ) ఏరా! వెంకటేశ్వర్లు! నేను చచ్చిపోయానుగదా అని అంత ద్రోహం చేస్తావుటరా ! మహాలక్ష్మివంటి నా మనుమరాలు మెడలోని గొలుసు తీయిస్తావుట్రా!

వెం : (ఆశ్చర్యంగా) ఏమిటి! యిలా మాట్లాడుతోంది యీావిడ.

వి : నన్ను మర్చిపోయావుట్రా! అల్లాగే వుంటుంది నీఅభిమానం నామీద! నేనురా! వెంకమ్మని!

వెం : (ఆశ్చర్యం, భయంతో) వెంకమ్మ! వెంకమ్మ...

వి : అవును రా! అప్పుడే మర్చిపోయావుట్రా! నీ అక్కనిరా!

పు : (దవడలు నొక్కుకుంటూ) ముసలమ్మలా వుంది. రెండోరోజైనా దాట లేదు, విశాలాక్షిని పట్టుకుని కనిపించిందేం చెప్మా!

సు : అయ్యో పాపం! యింకా గాలి రూపంలోనే ఉందన్నమాట!

పు : అంత్యక్రియలైనా కానిదే గాలి రూపం ఎలా పోతుంది !

సు : అయినా, యింకా ఏం కోరిక లున్నాయో!

వెం : (కంగారు, భయంతో) ఊఁ... ఊఁ... అయితే,

వి : అయితే, గియితే ఏమిటి? నా మనవణ్ణి మోసం చేస్తావుటరా! యింకా నిన్ను నమ్మవచ్చునుకుని నీకే డబ్బు యిచ్చినందుకు యింత దగా చేస్తావా?

వెం : దగా! నే నేం దగా చేశాను?

ర : ఏం! సుబ్బమ్మత్తయ్యా! (ఆశ్చర్యంతో,) ముసలమ్మ పట్టుకుందా ఏమిటి మా ఆవిడను!

సు : మరింకేమిటి నాయనా! అలాగే కనిపిస్తోంది. ఊరుకో! ఇంకా ఏమం టుందో చూదాము.

వి : నేనిచ్చిన డబ్బు వాళ్ళకివ్వలేదేం?

వెం : (కంగారు, భయంతో) డబ్బు... డబ్బు... నే తీసుకోవడ మేమిటి......... డబ్బు...!

వి : నే చచ్చిపోయానుకదా అని అబద్ధ మాడుతావటరా! నీ వంశనాశనము చేస్తారోయి! నీ కూతురు కడుపుతో ఉందిగా! దాన్ని పీల్చి పిప్పి చేశేస్తారోయి! తెలియటల్లేదూ! (ఏడ్పుతో) నా కోరికలు తీర్చకుండా నన్ను యింకా యిలా 'గాలి' రూపంలో అట్టే పెడతావుటరా!

వెం : (భయం, కంగారు, హడావిడితో కూడిన మౌనం)

వి : చెప్పు! ఆ డబ్బు ఎక్కడుంది! మన వడి కిచ్చేయి!

వెం : ఆఁ ఆ...

పు. సు : చెప్పరా వెంకటేశ్వర్లు! ఏమన్నా డబ్బిచ్చిందా నీకు ముసలమ్మ తన మనమడి కిమ్మని!

వి : మాట్లాడవేం!... లేకపోతే నీ వంశ నాశం చేస్తారోయి నిన్ను చచ్చేలోపుగా నానాయాతనలు పెట్టి పీల్చి పిప్పి చేస్తారోయి!

వెం : వద్దే అప్ప!.. వద్దు... చెప్తాగా! యీ అంత్యక్రియలు 12 రోజుల్లో పంపకాలు, డబ్బు విషయాలు గురించి మాట్లాడకూడదని మూర్తికేమీ చెప్పలేదు. యిచ్చేవుగా నువ్వు! యిచ్చేవు డబ్బు!

పు : అయితే ఎంత యిచ్చిందిరా!

వెం : ఒక...

సు : సరిగా చెప్పు వెంకటేశ్వర్లు! ముసలమ్మకు కోపం తెప్పించకు!

వెం : ఒక వెయ్యి యిచ్చింది.

వి : ఆఁ... ఇచ్చానా! ఆ డబ్బు యియ్యి మనమడికి.

సు : అయ్యో ఎంత పని జరిగింది. పాపం! వెంకమ్మా నువ్వు అట్టే దిగులు పడకు. మేం ఉన్నాంగా! అన్నీ చక్క పెడతాము. పాపం! మా విశాలాక్షిని యింక వదిలేయి.

వి : ఏంరామూర్తి! కులాసాగా ఉన్నావా నాయనా!... నా పని అయిపోయింది.. అంత్యక్రియలు జాగ్రత్తగా చెయ్యి నాయనా!... లేకపోతే నాకు 'గాలి' రూపం పోదు.

ర : అలాగే మామ్మా!

వి : (ఆయాసంతో హఠాత్తుగా పడిపోతుంది) ...ఊఁ...ఊఁ...దాహం...(నీరసంగా) నీళ్లు.. నీళ్లు...

పు : కొంచెం మంచినీళ్లు తెండ్రా పాపం!

వెం : పొరపాటయిందిరా నాయనా! 12 రోజులు దాటేక, నీకా డబ్బు యిద్దామనుకున్నాను. యీ కష్టకాలంలో పంపకాలు, డబ్బు విషయాలు మాట్లాడకూడదు కదూ! అందుచేత నీకా డబ్బు యివ్వలేదు.

ర : పోనీలెండి. దానికేం.

వెం : యింక యీ గొలుసు ఎందుకు? విశాలాక్షి కిచ్చేయి. నీ డబ్బు యిప్పుడే యిస్తాను. (నిష్క్రమణ)

పు : పాపం! మనమడంటే ముసలమ్మకు ఎంత అభిమానమో, యిట్టే కనిపించింది.

సు : కాదుటే! దానికిమాత్రం తెలియదూ! మనమడు అంత్యక్రియలు చెయ్యాలని అభిమానంగా యిక్కడకు వచ్చాడని.

పు : మూర్తికి ముసలమ్మ మరణంవల్ల ఎంత దుఃఖం, అభిమానం లేకపోతే, ముస

లమ్మ విశాలాక్షిని పట్టుకుని యిలా కనిపిస్తుంది?

సు : కాదు మరీ! మనమంతా ఏమిటో అనుకున్నాంగానీ!

పు : మూర్తి! కొంచెం దానిదగ్గరఉండి నాల్గూ కావలసినవి చూడు నాయనా!... ముసలమ్మ అంత్యక్రియలు యిక్కడే చేస్తావుగా!

ర : యిక్కడే చెయ్యాలని ఉంది.

పు. సు : మేం అలా వెళ్ళి, మళ్ళీ వస్తాము. (నిష్క్రిమణ)

ర : మహాబలేపని చేశావే!...వాడు యిట్టే భయపడి సంగతి చెప్పేశాడే!

వి : మరేమి టనుకున్నారు. లేకపోతే మనకు రావలిసిన డబ్బు, వాడు దొంగిలించడం ఏం న్యాయమండీ!

ర : ఎలాగైనా నీది చదువుకున్న తెలివితేటల బుర్ర.

4 వ రంగం

పాలయ్య : ఏం వెంకటేశ్వర్లు! ఆ డబ్బు అంతా మూర్తికి యిచ్చేశావుట!

వెంకటేశ్వర్లు : ఏం చేస్తారా! ఆ ముసలమ్మ విశాలాక్షిని పట్టుకుని కనిపించి 'నీ వంశ నాశనం చేస్తాను. వాళ్ళ డబ్బు యివ్వకపోతే' అని బెదిరించిందిరా!

పా : చచ్చిన మనిషి బెదిరిస్తేమాత్రం ఏం చెయ్యగలదు!

వెం : బాబోయి! అలామాత్రం అనకు. ఎంతమంది చచ్చిపోయి దెయ్యాలయి, వంశాలు పీకి పీకి పీల్చి పిప్పిచేశారు! నాకు ఉన్నదే ఒక్కకూతురు. దాన్ని చంపితే నేనేం చేసేది. పైగా యిప్పటిదాకా సంపాదించిన డబ్బు ఎవరికిచ్చేది! అందుచేత, ఆలోచించి, యీ గొడవ నాకెందుకని, వాడి మొహాన పారేశాను ఆ వెయ్యి రూపాయిలు. అసలే ఆ ముసలిది పీనాశి. దాని కోరికలు తీరకపోతే, బ్రహ్మరాక్షసిగా మారి, పీకుతుందేమో, అని నా భయం.

పా : అయితే నా వాటా పోయిందన్నమాటేనా!

వెం : నేనేం చెయ్యగలను? నన్ను అనవసరంగా యింతకాలం 'నీ సంగతి బయట పెడతా' అని బెదిరించినందుకు నీకిది తగిన ఫలితం...యిప్పుడు యీ డబ్బు నీకూ నాకూ కూడ దక్కలేదు.

పా : నీకేం! ముసలమ్మ చాకిరీ పేరుతో దాని డబ్బంతా నువ్వే తినేసేవాడవుగా యిన్నాళ్లు! ఎటొచ్చి నాకే నష్టం.

(పుల్లప్ప, సుబ్బమ్మ ప్రవేశం)

పు : యింక నే నెందుకు? వెంకటేశ్వర్లూ. యింటికి వెడతాను. అంత్యక్రియలు యిలా ముగుస్తాయనుకోలేదు. మన బంధువులంతా యింటికి పోతున్నారు.

పా : ఏం! అలా అంటున్నావు పుల్లప్పా!

పు : మూర్తి వెళ్ళిపోయాడుగా! పట్నం నుంచి వాళ్ళ ఆఫీసువాళ్లు టెలిగ్రాం యిచ్చేరుట జరూరుపనులున్నాయి రమ్మని. అందుచేత మూర్తి, విశాలాక్షి, పట్నం వెళ్లిపోయారు అక్కడే ముసలమ్మకు అంత్యక్రియలు చేస్తామని.

పా : టెలిగ్రాం! యిప్పుడు టెలిగ్రాం ఎక్కడినుంచి వచ్చింది. మూర్తి యీ 12 రోజులు సెలవుపెట్టే వన్నాడుగా. యిదంతా విశాలాక్షి మాయ. యిక్కడ అంత్యక్రియలుచేస్తే మనమంతా తినిపోతామని వాళ్ళ భయం. అబ్బో! ఆ అమ్మాయి చదుకున్న పిల్లరా.

సు : ఏది ఏమయితేనేం! నాకు ముసలమ్మ ప్రసాదం దొరికే యోగంలేదు. దీని కోసం, ఖర్చులు పెట్టుకుని పట్నందాకా ఎవరు వెళ్ళగలరు?

పు : వెంకటేశ్వర్లు! ఒక్క 5 రూపాయిలుంటే యివ్వరా!.....యీ వూరు వస్తోంటే, రైల్లో నా కొంగుముడి ఎవరో కత్తిరించేశారు. 30 రూపాయలు పోయాయి. తిరిగి యింటికి వెళ్ళడానికి ఒక్క పైస కూడ లేదు నాదగ్గిర.

వెం : పాపం! నేనేం చెయ్యగలను పుల్లప్పా! నా దగ్గర కూడా ఒక్క పైస లేదు.

పు : యింటికి వెళ్ళేక పంపించేస్తా.

వెం : నువ్వు పంపించవని కాదు నా దగ్గరడబ్బు లేదంటున్నానా!

పు : సరే...యింక ఎవరినైనా అడగాలి.

పు. సు. పా : వెళ్లివస్తాం. వెంకటేశ్వర్లు (పాలయ్య పుల్లప్ప, సుబ్బమ్మ నిష్క్రిమణ)

వెం : మంచిది...యీ పరామర్శకు వచ్చేవాళ్లకి పెట్టుబడి కూడా నే నెక్కడ పెట్టగలను? అసలు నా కేమైనా లాభముంటేగా! ముసలమ్మ చనిపోయేటప్పుడు పాలయ్య ఒక్కడేకదా దగ్గర ఉన్నాడు, వాడికి సగం వాటాయిస్తే, తక్కిన 500 రూపాయిలైనా నాకు దక్కుతా యనుకున్నాను. ముసలిది యింకా యిలా దెయ్యమై కనిపిస్తుందని నాకేం తెలుసు..., లేకపోతే పాలయ్యగాడు అన్నట్లు, కొంపదీసి, దెయ్యంపట్టడం కూడా విశాలాక్షి మాయ కాదుగదా!...అయినా యిప్పుడేం చేయంగలను!!! ★



లేచిపోయిన శవం

"రవి"

గోడుగుపేటలో వారంతా
గుసగుసలాడసాగారు
పాటి దిబ్బపై శవమొకటి
వాసనగొడుతూవుందంటూ

పడుతూ పడుతూ నేనపుడు
పాటిదిబ్బకడ కేగితిని
శవమూగివమూవున్నట్టే
జాడే కనబడలేదచట


ఏదో పుకారు అనుకొంటూ
యింటికిమరలివస్తూనే
ఎవ్వరుచెప్పారని నే
నిద్దరిముగ్గురి నడిగాను.

వారుచెప్పినారని వీరూ
వీరు చెప్పినారని వారూ
ఎవరిమట్టునకు వారేమీ
ఎఱుగనట్లుగా చెప్పారు.

అంచెలంచెలుగ అట్లట్లా
అల్లుకొని యీ కథఅంతా
కాంతం పినిమిటిగారంటూ
కథ కాయనపై నెట్టారు.

"పాటి దిబ్బపై శవమంటూ
పంతులుగారూ! యివ్వాళ
యింత అబద్ధంఆడారు
ఎందులకండీ" అన్నాను.

"ఎప్పుడో ప్రొద్దుట చూచాను
యిప్పుడు లేచిపోవచ్చు
అబద్ధమాడించాకానా
కవసరమేమిటి?" అన్నారు.


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహామూర్తి
ఆకలి బాధతో నకనకలాడే జిత్తులమారి నక్కొకటి
అడవి అంతటా తిండికోసమై ఆవురావురని తెగ తిరిగి
సైనికులూ, గుర్రాలేనుగులు కుప్పతిప్పలుగ పడివున్నట్టి ఒక రణభూమిని చూచింది
బ్రహ్మానందం పొందినదై
ఇంతటదృష్టం కలిగించిన ఆ పరమేశ్వరునది కీర్తించి
ఆత్రతకొద్దీ తినబోతుంటే
వినవచ్చిందొక వింతధ్వని.
భయపడి తిండిని వదలి దూరముగ దౌడు తీసినది ఆ నక్క
పోయి పోయి ఒక చోట, పాపమూ! మూర్ఛపోయినది ఆ నక్క
కొంతసేపటికి మూర్ఛతీరగా జరిగినదంతా తలపోసి
భయకారణమును కనుగొనగా తను వెనక్కు మళ్ళీ పోయింది
కదనభూమిలో కలయదిరుగగా కడకొక భేరి కనబడెను
"ఈ మృగమేదో ధ్వనిచేస్తోంది దీనిని వెంటనే కడతేర్చాలని భేరి మీదికి దూకింది.
"గాలికి వూగే కొమ్మలు తగిలీ భేరి మోగితే పిరికిపందనై భయపడ్డానే!"
అనుకొని మళ్ళీ వెళ్ళిపోయిగా విందు కుడచినది ఆ నక్క
"కనుక తమరినీ భయపెట్టిన ఆ అరుపేమిటో నే నరసి వచ్చెదను"
అని దమనకుడూ అన్నాడు
4

సాంకేతిక భాష

శ్రీ ధవళేశ్వర. నరసింహమూర్తి

పార్వతి పైకి మాత్రం చాలా సత్తెకాలపు మనిషి లాగానే కనబడుతుంది కానీ, బలేగయ్యాళి ఆమె భర్త అవధాని అమాయకుడు కాదు కానీ, పార్వతి అంత గడుసరి కాదు.

ఆమె ఏది కోరినా ఎట్టి అభ్యంతరమూ చెప్పకుండా, ఆ సంసారాన్ని ఎలాగో యీడ్చుకు వస్తున్నాడు. ఆమె చీరెలకనీ, నగలకనీ చీటికి మాటికి మూతి ముడుస్తుంటే ఎలాగో ఓలాగు చల్లగా నచ్చచెప్పేవాడు. పగలల్లా పంచాగం చేత బట్టుకొని తన తెలివి తేటలు వుపయోగించి పైసా పరకా సంపాదించుకు వచ్చేవాడు. అలా సంపాదించిన డబ్బంతా ఒక భరిణలో పెట్టి, ఆ భరిణను పూజా మందిరంలో దేవుడి విగ్రహానికి చాటుగా ఒకమూలను దాచి వుంచేవాడు. వేరే పిల్లాపాప ఎవరూ లేనందువల్ల అవధాని తాను వీధిలోకి వెళ్లవలసి వచ్చినప్పుడల్లా "ఒసే పార్వతీ! అశ్వని ప్రక్కదీ జ్యేష్ఠ ప్రక్కన వుంచేను. జాగ్రత్త సుమా" అంటూ వీధిలో నిల్చొని బిగ్గరగా అరిచేవాడు. ఆవిడగారు "అల్లాగే లెస్తురూ" అంటూ విసురుగా వచ్చి తలుపు గుభాలున వేసుకొనేది.

వీళ్లయింటి ప్రక్కనే ఓకాపు



వున్నాడు. ప్రతిరోజూ అవధాని గారు వీధిలోకి వెళ్లుతూ 'అశ్వని ప్రక్కది జ్యేష్ఠ ప్రక్క పెట్టాన'ని మరీ మరీ పెళ్లాంతో చెప్పుతుంటే వాడికిందులో ఏదో కిటుకు వున్నదని పించింది. ఎంత ఆలోచించినా ఆభాష ఏమిటో వాడికేమీ అర్థం కాలేదు. ఇలాగు కాదని పొరుగూరిలో మరొక బ్రాహ్మడు వుంటే ఆయన దగ్గరకు ఒకరోజు పనిగట్టుకు వెళ్లాడు. ఇతడు వెళ్ళేసరికి ఆ బ్రాహ్మడు యింట్లోనే వున్నాడు.

"దణ్ణాలండీ బుగత గోరూ! హి...హి...యీ యేల తమరికి తాంబూలం కరుసు యిచ్చుకోవాలని బుద్ధిపుట్టింది. అందుకని పనిగట్టుకు యిట్టా వచ్చినా. అయితే తమరు నాకో సాయంచేసి పెట్టాల." అన్నాడు కాపు.

వీ డెవడో ఆ బ్రాహ్మడికి అంతకు ముందు తెలియకపోయినా కలిసివచ్చిన బేరం కదా "ఏమిటి నాయుడూ, సంగతులు? అంతా

బాగున్నారా ? పాపం,—చచ్చి ఏలోకాన వున్నాడో కానీ, మీ అయ్య కూడా ఏ శుభకార్య మొచ్చినా నన్నే పిలుచుకుపోయే వాడు. మీ అయ్య బుద్ధి దొడ్డ బుద్ధిలే !" అని ఆ నాలుగు వాక్యాలూ ఒక్క గుక్కలో అనేశాడు. తన నీంత యిదిగా పలుకరించి నందుకు కాపుకు పట్టరానంత సంతోషం వచ్చింది. రొంటిని వున్న రూపాయి బిళ్ల ఒకటి తీసి చేతిలో పెట్టుకొని "అయితే బాబూ ! మావూళ్లో వున్న ఒకాయన పొద్దత్తమానం పెళ్లాంతో, అశ్వని ప్రక్కది జ్యేష్ట ప్రక్కను పెట్టాను; జాగ్రత సుమా అంటా వుంటారు. అట్లా గంటే అర్థం ఏంటో ఎంతకీ నాకు తెల్సిందిగాదు. తమరు యిడమర్చి చెప్పాల బాబూ నాకు." అంటూ ఆ బ్రాహ్మణ్ణి యీ కాపు అడిగాడు.

"ఆరి నీసిగ కొయ్యా ! ఇదేనట్రా నీకు కావలసింది? ఏశాంతో, ఏవ్రతమో అనుకున్నాను. అయినా నువ్వు అడిగిన దానికి సమాధానం చెప్పాలంటే యీ రూపాయితో తీరిపోతుందనుకొన్నా వేమిటి ! అబ్బో! దానికెంత తతంగం వుందీ? ఒక దొంతి రూపాయలైనా వుండాలి. హోమం, జపం, నిష్ట, నియమం, పంచాక్షరీ, రుద్రాక్షరీ, జపాక్షరీ, ఎన్నో జరిపించాలి. ఎల్లుండి అమావాస్య ఆదివారం. అన్నివిధాలా బాగుంది. ఎల్లుండిరా."

కాపు సరేనని అప్పటికి బయానాగా ఆ రూపాయితో పాటు రొంటిలో నుంచి మరో నాలుగు రూపాయిలు కూడా తీసి శాస్త్రులు గారికి సమర్పించుకొన్నాడు.

ఆదివారం కాపు మళ్లీవచ్చాడు. శాస్త్రుల్లు గారు క్రతువు అంతా పూర్తిచేశానని చెప్పి, "ఏమోయ్ నాయుడూ ! యిది గొప్పరహస్యం. మరొకంటి వాడికి ఈ రహస్యం కనుక చెప్పావో, నీకళ్లు రెండూ బొత్తలడి పోతాయి. జాగ్రత్త. నీకా రహస్యం చెప్పేస్తున్నా, శ్రద్ధగా విను. అశ్వని ప్రక్కది అంటే భరణి. జ్యేష్ఠ ప్రక్కది అంటేమూల. ఇప్పుడు తెలిసిందా?" అంటూ దబదబా ఆకాపు దగ్గర తనకు రావలసిన బకాయి కూడా ఒడుక్కొని చక్కా పోయాడు.

కాపు దారి పొడుగునా ఆలోచించాడు. 'భరణి, మూల. భరణి, మూల. భరణి, మూల.' అనుకొంటూ వుండగా భరిణె మూలగా వున్నది కాబోసునన్న అనుమానం చటుక్కున తోచింది. అవధాని గారింట్లో ఒక్కసారి తొంగిచూస్తే తేలక పోతుందా అని ఆరాత్రే బాగా పొద్దు పోయాక ఆయింట్లోకి దొంగ చాటుగా దూరాడు. అది వేసవి కాలమేమో, అవధానిగారి యింట్లోయింటిల్లపాదీ ఆరుబయటనే పడుకొని మంచి నిద్రలో మునిగి వున్నారు. అదే సందు అని కాపు నిబ్బరంగా తలుపు తాళం మారు చెవులతో తీసి లోపలికి దూరాడు. అన్ని మూలలూ గాలించాడు. చివరకు దేవుడి విగ్రహం వున్న మూలను భరిణ కనుపించింది. మూత తెరచి చూశాడు, నోట్లు, రూపాయలు, చిల్లర—దాని నిండా వున్నాయి. ఇంకేం ? అవన్నీ తన ఒళ్లో పోసుకొని మళ్లీ ఎప్పటిలాగే భరిణమూత గట్టిగా పెట్టి ఆ భరిణను యథాస్థానంలో దాచి తాను వుడాయించాడు.

తెల్లవారింది. అవధాని గారు నిద్దురలేచి కాలకృత్యాలన్నీ తీర్చుకొని దైవప్రార్థన కూడా ముగించుకొని, కళ్లకు అద్దుకొందాం కదా అని విగ్రహం చాటున వున్న భరిణను పైకి ఎత్తబోయాడు. భరిణ తేలికగా వున్నట్లు తోచింది. గబగబా మూతతీసి చూశాడు. ఇంకే ముందీ! అవధాన్లుగారి గుండె చిక్కబట్టినంత పని అయింది. పెళ్లా దానికి బంగారపునగ చేయిద్దాం క అని తానుసంపాదించేపాతికాపరకా భరిణెలో వుంచి అప్పుడు కాస్త అప్పుడు కాస్తగా కూడ బెట్టిన రెండు వందల రొఖ్ఖం కనుకట్టు చేసినట్లు అమాంతంగా మాయమై పోయేసరికి ఆయనకు నవనాడులూ క్రుంగిపోయాయి హీనస్వరంతోనే "ఒసేవ్! పార్వతీ...పార్వతీ. కొంప మునిగింది. చూశావుటే" అంటూ నెత్తినోరూ బాదుకోటం మొదలు పెట్టాడు.

"ఏమిటండీ. కొంప మునిగేదీ? ఇంతలో ఏమొచ్చిందీ" అంటూ పార్వతి వంటయిట్లోనుంచి పోపులు పెట్టె గరిటె చేత బట్టుకువచ్చింది. తీరా వచ్చిచూస్తే యిదీ భాగోతం!

"అయ్యో! ఎలా పోయిందీ ! ఏమిటీ చిత్రం? వేసిన తలుపులు వేసినట్లేవున్నాయి. ఎట్లాపోయింది? కాకపోయినా మంచి శాస్త్రే జరి

గింది లెండి. నగచేయించండి, నగ చేయించండీ అని ఎంత మొత్తు కొంటున్నా విన్నారూ? చిలక్కి చెప్పినట్లు చెప్పానే! నేచెప్పినప్పుడే నామాట విని నగచేయించి వుంటే ఆడబ్బు యిలా వూడ్చి పెట్టుకు పోయేదా! మీతాతాడు నాతాడు ఎవడో పుటిక్కిన తెంపేశాడు." అంటూ తెగ దెప్పటం మొదలు పెట్టింది.

అసలే డబ్బుపోయి తను ఏడుస్తుంటే పార్వతి పని గట్టుకు దెప్పటం లంకించుకొనే సరికి ఆయనకు కోపం వచ్చింది. ఇద్దరూ కీచులాట మొదలెట్టారు. కాసేపు ఏడ్పులు, కాసేపు తిట్లుగా వీరి యింటిలో నుంచీ వినవస్తూంటే చుట్టుపక్కల వాళ్లంతా సంగతేమిటో అని యింటి చుట్టూ మూగారు.


ఒకాయన ముందుకు వచ్చి "ఏమండీ అవధాన్లుగారు? ఏం జరిగిందేమిటీ?" అని అడిగాడు.

"ఆఁ! ఏముందీ జరగటానికి. నాబొంద. నేను అక్కడా అక్కడా ముష్టి ఎత్తి దాచిపెట్టిన డబ్బు కాస్తా నాకంటే ముష్టివెధవ ఎవడో కొట్టేశాడు. ముష్టిలో వీరముష్టి. ఇంతకంటె ఏమిటి వుంటుంది—నా బ్రతుక్కితోడు." అంటూ అవధానిగారు చిరున చీది, ఖాళీ అయిపోయిన భరిణె పది మందిలోకీ గిరాటు పెట్టారు. 'అయ్యో పాపం అని కొందరన్నారు. 'పోవడ మేమిటిస' మరి కొందరన్నారు. 'అసలు దీనికంతా వెనుక ఏదో వైరంవుండి వుండాలన్నారు' ఇంకా కొందరు. ఇలా పదిమందీ పదిరకాల వ్యాఖ్యానాలు, విమర్శలు ప్రారంభించారు.

వారిలో ఒక కుశాగ్రబుద్ధి "కాక పోయినా ఆమూలగా పెట్టిన యీ భరిణెలో డబ్బున్న విషయం దొంగకు ఎలా తెలిసింది చెప్మా! ఈ యింట్లో యిన్ని వస్తువు లుండగా ఆ భరిణెలో దాచిన డబ్బే ఎల్లా పోయిందీ?" అని తన తార్కిక జ్ఞానం ప్రదర్శించ బోయాడు.

అవధాన్లుగారు ఏడుపు మొఖం పెట్టి, "అదేనండీ, నేనంత జాగ్రతగా ఆభరిణె ఆమూల పెట్టి వీధిలోకి వెళ్లేటప్పుడల్లా మా ఏడుపు

(48–వ పేజీ చూడండి)



(గత సంచిక తరువాయి)

"ఏమోయ్ సుందరం! గడియారాలు గంటలు కొట్టుతూవుంటే సంతోషించేవాళ్లు ఎందరుంటారంటావ్?" అని గడియారం సుందరాన్ని అడిగింది.

"ఏం? గడియారం గంటలు కొట్టుతుంటే సంతోషించకుండా వుండగలవాళ్ళే అసలు వుండరు. మాటిమాటికీ తలపైకెత్తి గంట ఎంతఅయిందీ చూసుకోనక్కరలేకుండా ఎంచక్కా గడియారమే 'యిన్ని గంటలయిందర్రోయ్' అని చెప్పుతుంటే సంతోషించలేకపోవటమేమిటి?" సుందరం తన అభిప్రాయాన్ని సమర్థించుకోబోయాడు.

"అంత తేలికకాదులే. మా అమ్మా నాన్నా నెలజీతం ఏ ఏ పద్దుకింద ఎంతెంత సర్దాలో తెలియక చికాకుపడి గంటల తరబడి కీచులాడుకొంటున్నారనుకో. అలా వాళ్ళు కీచులాడుకొంటూవుండగా నేను తగుదునమ్మాఅంటూ ఒకటి తరువాత ఒకటి, 12 గంటలు కంపాదిగా కొట్టటం మొదలుపెట్టితే మా నాన్నకు చిర్రెత్తుకురాదూ? అందులోనూ ఆయన ఎంత చికాకుమనిషో నీకూ తెలుసుగా. చేతిలో ఏది వుంటే అది పుచ్చుకు నా మొఖాన గిరాటుపెట్టేతంటావా, లేదా?"

"అయ్యో! అంతపనీ చేసితీరుతాడు. మా నాన్నకు మరీ వళ్లు తెలియని కోపం అబ్బా!"

"అల్లాగే పలుగురు కూర్చొని ఏవేవో అతిముఖ్యమైన విషయాల మీద చర్చించుకొంటున్నప్పుడల్లా గడియారం కొట్టేగంటలు వాళ్లకు బలే చిరాకు పుట్టిస్తాయనటంలో సందేహంలేదు. గంటలేకాకుండా అరగంటలు, పావుగంటలూకూడా కొట్టే గడియారాలైతే పొద్దస్తమానం వీటిగంటలుతప్ప మరొకమాట వినటానికి ఎవ్వరికీ ఆస్కారంలేకుండా పోతుందన్నమాట."

"ఆఁ! అదే! మన ప్రక్కింటి ఆయన రేడియో మోస్తరు. ఆయన తనకేగదా మహా రేడియో వున్నదని పొద్దస్తమానమూ ఆ రేడియోచేత బిగ్గరగా వాగిస్తుంటాడు. అలా ఎడతెరిపిలేకుండా ఆ రేడియో మొరుగుతుంటే మా యింట్లో, ఎవరు ఎవరితో మాట్లాడాలన్నా పోట్లాడుతున్నంత బిగ్గరగా అరవటం తప్పటంలేదు. నాకు ఒక్కొక్కప్పుడు వున్నపళంగా లేచివెళ్లి పెద్ద బండరాతిని తెచ్చి ఆ రేడియోని ముక్కలు ముక్కలుగాచేసి పారేద్దామా అన్నంతకోపం వస్తుంటుంది. అంత పనీ చేస్తే మళ్లీ మా నాన్న యింకెంతపెద్దరాయి తెచ్చి నా నెత్తిమీద పెట్టుతాడో అని భయంవేసి నాకు వచ్చిన కోపాన్నంతటినీ మింగుకు కూర్చొంటాను."

"అవునోయ్ సుందరం! ఈ రేడియోలమోత ఎంతగా మితిమీరిపోయిందంటే నాకు ఎప్పుడన్నా నా గుండె ఎలా కొట్టుకొంటున్నదీ విందామని బుద్ధిపుట్టినా కూడా వినటానికి వీల్లేకుండా పోయిందనుకో. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే, ఎప్పటికప్పుడు టైం ఎంతైందీ చెప్పేందుకు, జీతం బత్తెం యీయనక్కరలేని బంట్లులాగా మనుష్యులే యీ గడియారాలచేత ప్రతిగంటకీ, అరగంటకీ, పావుగంటకీ, ఐదునిముషాలకీ, నిమిషానికీ, అరనిమిషానికీ, పావునిమిషానికీ గంటలు కొట్టేట్లుగా ఏర్పాటు చేసుకొని, కొంతకాలం ఆ సంబరం

చూశాక, వాళ్లల్లోవాళ్లు మాట్లాడుకొనే మాటలకీ, వాళ్లల్లోవాళ్లు చేసే ఆలోచనలకీ యీ గంటలు భంగంకలిగిస్తున్నాయని కోపం వచ్చి, చీటికిమాటికి గంటలు కొట్టనక్కరలేకుండా, గంటకు ఒక్కసారిమాత్రమే గంటలు కొట్టమని మళ్ళీ గడియారాలకు పురమాయించారోయ్. చూ.శా వా — యీ మనుష్యులు మమ్మల్ని ఎంత హీనంగా చూస్తున్నారో?"


"హీనంగా చూడటం ఏం ఖర్మం! కొంత కొంతమందిని చూశాను; వాళ్లు ఎప్పుడైనా తమ తల తీయించుకోవటానికైనా ఒప్పుకొంటారేమో కాని, చేతినివున్న గడియారం ఒక్కక్షణంఅయినా తీసి యివతల పెట్టటానికి చస్తే ఒప్పుకోరు. ఇందాక చెప్పానే ఆ జమీందారుగారి అబ్బాయి — వాడుట నిద్రపోతూగూడా చేతికి గడియారం అలాగే పెట్టుకు పడుకొంటాడట. మరి కలల్లోకూడా గడియారంతో అతనికి ఏంపనివుంటుందో ఏమో! స్నానంచేస్తుంటే ప్రత్యేకం ఒక జమాను యీయన గడియారం పెట్టుకొనివున్న ఆ ఎడం చేతికి నీళ్లు తగలకుండా అలా ఆ చేతిని అంతసేపూ పైకిఎత్తి పట్టుకు నిల్చుంటాడట- మా క్లాసుకు ర్రాళ్లు చెప్పారు."

"అంతే కాదోయ్! వెనుకటి రోజుల్లో ఒక్కొక్కడి దగ్గర ఎన్నెన్ని గడియారాలువుంటే అంత వాడుగొప్ప అనుకొనేవాళ్లు. సామాన్యంగా డబ్బువున్న ప్రతివాడూ రెండు జేబుగడియారాలు కొనుక్కొనేవాడు. ఒకటి బంగారపుది. రెండోది వెండిది - ఈ వెండి గడియారాన్ని వెండి గొలుసుకు తగిలించి కోటుజేబులో వేసుకొనేవాడు. బంగారపు గడియారానికి బంగారపు గొలుసు చేయించి, దానిమీద రాళ్లు అవీ పొదిగించి అందరికీ కనుపించేలా కోటు బొత్తాంలోనుంచి క్రిందకు వేలాడగట్టుకొని తిరిగేవాళ్లు. అలాటివాళ్లు తాము రోడ్డుమీద పోతూవుంటే అలగాజనం అంతా ఆ గడియారాన్ని చూసి 'అబ్బో! యీయనకు ఎంతడబ్బువున్నదిరా' అనుకోవాలని ఆశపడేవాళ్లు. ఆ అలగా జనంలో ఎవ్వళ్లైనా వీరి గడియారాలను గమనించక పోతే, యీ పెద్దమనుష్యులకు తలలు తీసినంత చిన్నతనం తోచేది. సరే— వాళ్ల రోజులు అలా వెళ్లాయనుకో. అలాటి వాళ్ళకు గడియారాలు ఆనాడూ సేవ చేశాయి. ఈరోజు జట్కాలు తోలేవాళ్లు, కాఫీ హోటల్లో కప్పులు అందించే వాళ్లు మొదలుకొని అందరూ తలా ఒక గడియారాన్ని చేతికి తగిలించుకు తిరుగుతుంటే, వీళ్లకు సేవలు చేస్తున్నాయి."

"అంటే మీ గడియారాలకు పక్షపాత బుద్ధి లేదనేగా నువ్వు చెప్పబోయేది?"

"మనుష్యులు ఆడించినట్లల్లా ఆడే మాకు పక్షపాతాలు చూపే తాహతు ఎంత తపిస్తే మాత్రం వస్తుందా!" గడియారం ముఖం కొద్దిగా ముడుచుకు పోయింది. కాసేపు ఆగి మళ్లీ అందుకొంది—

"మమ్మల్ని మనుష్యులు వాళ్ల యిష్టం వచ్చినట్లు ఆడించారనటానికి ఒక్క నిదర్శనం చెప్తాను విను. అలా గంట గంటకీ, నిమిష నిమిషానికి గంటలు కొట్టమని మొదట్లో వుత్తరువు వేశారా? మళ్లీ గంట కోసారే గంట కొట్టమన్నారు. ఆగంట అయినా ఖంగ్ మని నోరారా కొట్ట కూడదట! సరససంగీతంలా, మృదులవాద్యంలా కోకిల కంఠంలా వినిపించాలట. మరొకమహానుభావుడు ఏం చేశాడో తెలుసా? అలా గువ్వలా గొణిగేందుకైనా మాకు స్వాతంత్ర్యం యీయకుండా తాను ఫలానిమీట నొక్కినప్పుడే ఆ కూసే కూతలన్నీ కూయమని కట్టు దిట్టం చేశాడు. ఈకట్టడుల కిన్నిటికి ఒదిగి బొదిగి వుండలేక మేం యిలా కటకట పడుతుంటే, మా మ్రోతలు విన్న మహానుభావుడికి, అవి వింటుంటే ఏదో స్వర్గంనుంచి ఎవరో దేవతలు తన్ను పలకరించి కిలకిలా నవ్వినట్లు తోస్తూండేదని గొప్పగా చెప్పుకొన్నాడు. అంతేకాదు. ఇంగ్లండు రాజు రెండవ చార్లెసు ఫ్రాంసు దేశపు రాజైన పధ్నాల్గవ లూయీకి యిలామీట నొక్కగానే స్వరాలుపలికే గడియారాన్నొక్కదానిని బహుమానంగా పంపించాడు. ఆ గడియారంలో నుంచీ యీ అమర సంగీతం ఎలా పుట్టుతుందో ఎవరికీ తెలియకుండా చేయటానికి ఆ గడియారాన్ని తయారు చేసిన యింగ్లీషు నిపుణుడు గడియారం పైడొక్క వూడిరాకుండా ఒక తాళం బిగించాడు. ఆ గడియారం ఫ్రాంసు దేశం చేరాక ఎందరో దాన్ని తెరిచి లోపల వున్న రహస్యం కనిపెట్టాలని



"గద్ద తన్నుకుపోయె సోగ్గాణ్ణి"

ప్రయత్నం చేశారు. పథ్నాల్గవ లూయీగారి ఆస్థానంలో గడియారాలు తయారుచేసే వాడొకడు వుండేవాడు. వాడిపేరు మార్సినీ. వాడు యింగ్లీషు రాజు పంపించిన గడియారంలోని కిటుకు కనుక్కోవాలని చాలా తంటాలు పడ్డాడు. ఎంత తంటాలుపడ్డా అది వాడికి ఎంత మాత్రం కొరుకు బడలేదు. చివరకు యిలా కాదని ఆ రాజ్యంలోని ఒకానొక మఠంలో జా, షూ షే అనే నిపుణుడు ఒకడు వుంటే, ఆయనవద్దకు యీ గడియారాన్ని పంపించారు. ఇందులో గల పరమ రహస్యాన్ని యీ 90 ఏండ్ల పండు ముసలిని కనిపెట్ట మన్నారు. అతడెంతో అనుభవం వున్న వాడై వున్నందున ఆ గడియారాన్ని యిట్టే తెరచి, ఆమంజుల ధ్వానాలు ఎలా వుత్పత్తి అవుతున్నాయో అట్టే తెలుసుకొన్నాడు. ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే ఫ్రెంచి రాజు లూయీ గారు యితనికి ఏడాదికి 600 లనాణేల చొప్పున పెన్షన్ ఏర్పాటు చేసినట్లు వార్త వచ్చింది. అతడి ఆనందం యింత అంత అని చెప్పలేను. ఇదంతా ఎందుకు చెప్పతున్నానంటే - మీ మనుష్యులు మా చేత ఎన్ని రకాల వూడిగాలు చేయించుకొన్నారో, అలా వూడిగాలు చేయించుకోవటంలో ఒక దేశపు ప్రజలు మరొక దేశపు ప్రజలతో ఎంతటి పోటీలు పడ్డారో తెలియ చెప్పటానికే."

ఏదో కబుర్లు చెప్పతున్నది కదా అని వింటూ వుంటే గడియారం మనుష్య జాతిని యింత చిన్న బుచ్చి మాట్లాడ బోవటం చూస్తే సుందరానికి కోపం పొడుచుకు వచ్చింది. అందుకని - "మీ చేత మావాళ్లు యిన్ని రకాల వూడిగాలు చేయించుకొన్న మాట నిజమయితే కావచ్చు కానీ, మీ ముఖాలలో యింకా యింకా అందాలు తేవాలని ఎంత తంటాలు పడ్డారో?" అన్నాడు.

స్వజాతి అభిమానం పదేళ్ల కుర్రాడైన యీ సుందరంలో కూడా పైకి వచ్చినందుకు గడియారం అబ్బుర పడింది. ఇంత వరకు దాని మెదడులో కదిలిన నీరసపు టూహలు సుందరం ముఖంపై కనుపించిన కోప లక్షణాలతో పాటు మాయమయ్యాయి. ఇక ధోరణి మార్చటం మంచిదని పించి "ఏమోయ్ సుందరం! కొన్ని వందల ఏళ్ల పాటు గంటలు కొట్టిన జాక్విమర్ దంపతులు గాథ నువ్వు ఎప్పుడైనా విన్నావా ?" అని గడియారం చిరునవ్వు తెచ్చుకు అడిగింది.

"ఏ దంపతులు అయితే మాత్రం అన్ని వందల ఏళ్లు ఎలా బ్రతికి వుంటారు? బ్రతికినా బ్రతికినంత కాలమూ గంటలు ఎలా కొట్టుతునే వుంటారు ?" అంటూ సుందరం, బుడ్డపుంజు మూతి బయటకు పెట్టాడు.

(ఇంకావుంది)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



జ్యోతిశ్శాస్త్రముతో ఏమాత్రమూ సంబంధంలేని 'వారము' నకు మంచి చెడ్డలు అతికించడములో ఏ సబబూ లేదు. అది శుద్ధ వెర్రి.

13. తిథివార నక్షత్రాలెలాగా తెలుసుకోడమూ ?

పౌర్ణమిని నిండుచంద్రుణ్ణి బట్టీ, చంద్రుడు సూర్యాస్తమయంతో ఉదయించడాన్ని బట్టీ తెలుసుకోవచ్చును. తరవాత వరస లెక్కపెట్టుకోడమే తిథి తెలుసుకోడానికి వీలు. నక్షత్రము తెలుసుకోవాలంటే ఆనాడు చంద్రుడు ఏ నక్షత్రము దగ్గరున్నాడో చూచి తెలుసుకోవాలి. అంటే అశ్విని మొదలు రేవతిదాకా నక్షత్రాలు గుర్తుండాలి. ఇక వారము మరిచిపోతే ఆకాశము చూసీ, లెక్కలు కట్టీ తెలుసుకోడానికి సాధ్యము కాదు. వారాల పేర్లు పూర్వపు 'నవగ్రహాల రోజుల్లో' ఏర్పడ్డాయి. ఎలా గేర్పడ్డాయో తెలీదు. కనక నిన్నటి రోజు ఏవారమో తెలిస్తేగాని నేడు ఏవారమో చెప్ప వీలులేదు.

14. బ్రహ్మదేవుడికి చెట్లఫిర్యాదు.

ఇది నిజంగా జరిగిన సంగతి. అడయారు మర్రిచెట్టు చూడ్డానికి వెళ్లి దానికింద కూర్చుని నేల మీదికి వాలాను. "అదిగో స్వామి వస్తున్నారు" అని ఆ మర్రిచెట్టు వేళ్లు పలికేయి. భూగర్భంలో ఏదో సభ ఏర్పాటౌతున్నట్లుంది. చెట్ల వేళ్లన్నీ ముడుచుకుంటున్నాయి కాబోలు 'జుంయి' 'జుంయి' మని ఎన్నడూ కనివిని ఎరగని శబ్దాలు వినబడ్డాయి. క్రమంగా నిశ్శబ్దం అయింది. భూకంపంలో వచ్చే దుందుభినాదం వినబడింది. బోరగిల్లా పడుక్కోడము కంటె చేశేదేమిటని అలాగే పడుక్కొన్నాను - తర్వాత విన్న మాటలవల్ల తెలిశింది అది బ్రహ్మదేవుడి గొంతుక అని. "బచ్చలి మొక్కని ప్రభూ! మానవుడు సర్వభక్షకుడు అయిపోతున్నాడని మనవి చేసుకుంటున్నా." "ముల్లంగిని స్వామీ! నా వేళ్లు తినేస్తున్నాడు." "అరటిని ప్రభూ ! నా కాయల్నే కాక కాండాన్నీ పువ్వుల్నీ కూడా తినేస్తున్నాడు." "దాల్చిని స్వామీ! నా బెరడు తింటున్నాడు" "జీడిని ప్రభూ! నా విత్తనాలనే కాక తొడిమల్ని కూడా తింటున్నాడు." "లవంగ లతని స్వామీ! నా మొగ్గల్ని పెగర నివ్వకుండా చిదిమి తినేస్తున్నాడు" "తోటకూరని ప్రభూ ! నా అసలు పేరు తుడిచి పారేశాడు" గొల్లుమని నవ్వు కాబోలు వినబడింది. ఇంతవరకూ "కూరలు" అనుకోడమేగాని వేళ్లనీ, కాండాన్నీ, బెరడునీ, మొగ్గల్నీ, పువ్వుల్నీ తినేస్తున్నామని నాకు తెలీదు. మానవుడింత అపకారం చేస్తున్నాడా అనిపించింది. కాని ఈ "స్వామి" ఎవరో? మళ్లీ విన్నాను. "అయితే మానవజాతిని సృష్టించడము మానెయ్యమంటారా? ఆతర్వాత పశువులు తినేస్తున్నాయి మీ వంశాభివృద్ధి ఆగిపోతోందని మొర పెట్టరు కద ?" అని దుందుభినాదం లాగ వినిపించింది. నిశ్శబ్దం. "మానవుడు తిండికి వుపయోగించే వృక్షజాతులకి మానవుడే రక్షకుడా ?" ఇదీ గమ్మత్తుగానే వుందే అనిపించింది. తోటమాలి వచ్చి తట్టిలేపాడు. లేచి వెళ్లిపోయాను. ★

విశ్వాసం లేని జంతువు

★ శ్రీమతి వంగల రంగనాయకమ్మ ★

అక్బరుపాదుషా ఆస్థానంలో బీర్బల్ అనే విదూషకుడు ఒకడు వుండేవాడని మీరందరూ ఎరిగే వుంటారు. ఏవేవో చిక్కు ప్రశ్నలు వేసి బీర్బల్‌ను ఓడిపిద్దామని అక్బరుపాదుషా ప్రయత్నిస్తుంటటమూ, ఆ చిక్కు ప్రశ్నలకు చక్కని సమాధానాలు ఇచ్చి బీర్బల్ పాదుషాగారి మన్నన పొందుతూ వుండటమూ పరిపాటిగా జరుగుతుండేది.

ఒకనాడు అక్బరుపాదుషా కొలువుతీర్చివుండగా బీర్బల్‌ను పేరుపెట్టి పిలిచి విశ్వాసంగల జంతువు ఏదో విశ్వాసంలేని జంతువు ఏదో చటుక్కున చెప్పమన్నాడు. బీర్బల్ కొంతగడువు యిప్పించమన్నాడు. ఆతడడిగిన గడువుకు ఒప్పుకొంటూ, గడువుతీరే లోగా సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోతే తలతీయిస్తా, 'కబడ్దార్'! అంటూ అక్బర్ హెచ్చరిక చేశాడు.

బీర్బల్ ఆస్థానంనుంచి యింటికి చేరుకొన్నాడు. ఎంత ఆలోచించినా విశ్వాసంలేని జంతువు ఏదో అతనికి అంతు పట్టటంలేదు. విశ్వాసంగల జంతువులు ఎన్నిఅయినా వున్నాయి—కుక్క; గుర్రం; ఆవు. ఆ ప్రశ్నకు తేలికగా సమాధానం చెప్పవచ్చు. విశ్వాసంలేని జంతువు విషయంలోనే వచ్చింది చిక్కు—అంతా. చింతాక్రాంతుడై అలానే ఆలోచిస్తూ గదిలో కూర్చొన్నాడు.

వంట అయిందని చెప్పటానికి వచ్చిన ఆయన కుమార్తె తండ్రి

(39 వ పేజీ చూడండి)





బొమ్మరిల్లు సీరియల్

డాన్ క్విక్సోట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్సోట్ అనే వెర్రి వెంగళప్ప ఒకసారి తనుకూడా ఒకవీరుడు (నైట్) గా పేరుపొందాలని వుబలాటపడి, 'రోజినాంటే' అనే ఒక కుంటిగుర్రాన్ని ఎక్కి బయలుదేరాడు. ఒకానొక స్త్రీమూర్తిని ఎంచుకొని ఆమెకు తానే 'డల్సీనియా' అనే పేరు పెట్టుకొన్నాడు. ఆమె మన్నన సంపాదించటం కోసమే తాను ధర్మరక్షణమనే కఠోరదీక్ష స్వీకరించానని నమ్మాడు.

ఏవేవో వెర్రివెర్రి ఆశలుచూపి శాంకోపాంజా అనే ఒక అమాయకపు కూలీని తన బంటుగా చేసుకొన్నాడు. వాడు 'డాపుల్' అనే ఒక గాడిదనెక్కి యీయన వెనకాలే బయలుదేరాడు. మంచు తెరలు విప్పని వేకువసమయంలో దూరంగా కనుపిస్తున్న గాలిమరలను చూసి డాన్ క్విక్సోట్ అవి ఏవో పెద్దరాక్షసులనుకొని వాటిమీదికి యీటె పుచ్చుకు పరిగెత్తాడు. గాలిచక్రం ఆకులు గిరాగిరా తిరుగుతూ యీతడు విసిరిన యీటెను ముక్కలు ముక్కలుగా చేసి పారేశాయి. ఆ కుదుపుకు డాన్ క్విక్సోట్ గుర్రంమీదనుంచి దొర్లిపోయాడు. వళ్లంతా గాయాలు అయినా యింటికిపోకూడదనే పట్టుదలతో బయలుదేరి 'లాపిస్' ప్రాంతంవైపు యిద్దరూ తమ వాహనాలను నడిపించుకుపోయారు.

4

ఆరోజు రోజుఅంతా ఆ స్వామీ, యీ బంటూ ఎక్కడా ఆగకుండా ఒకరు గుర్రంమీదా, యింకొకరు గాడిదమీదా స్వారీచేస్తూ అలా తిరుగుతునేవున్నారు. అదేమి దురదృష్టమో వీళ్లకు ఎదురొక్కనేందుకు ఏ ఒక్క దుష్టుడూ కనుపించనేలేదు. అలా తిరిగితిరిగి చివరకి విసుగెత్తి పొద్దుగుంకాక ఒక చెట్ల గుబురుచూసి అందులో విశ్రమించారు. అప్పుడే నిద్రకుపడటం ఎందుకని డాన్ క్విక్సోట్ మాత్రం అలా కళ్లు తెరుచుకు చూస్తున్నాడు. ఇంతలో అతనికో ఆలోచనతట్టింది. మొన్న ఆ గాలిమరలో యిరుక్కొని విరిగిపోయిన యీటెను వెంటనే బాగుచేయకపోతే మళ్లీ దాంతో ఎప్పుడు ఏంపనిపడుతుందో? ఎవరు చెప్పగలరు? అందుకని—ఆ చెట్టు కొమ్మల్లో మంచి నిడుపాటి కొమ్మనొకదానినిచూసి దానిని ఫెళ్లున విరిచాడు. ఒక చట్టాతిమీద కూలబడి రెండుకాళ్లు బారజాపి, కత్తితో ఆ కొమ్మమీది ఆకులు అవీ శుభ్రంగా చెక్కేశాడు. బాగా చేత్తోపట్టకోవటానికి వీలుగా గుండ్రంగాచెక్కి దానికి యీటెమొన తగిలించాడు. ఇదంతా పూర్తికావటానికి పక్కా గంటసేపు పట్టింది. గుడుపట్టిన కాళ్లూ చేతులు ఒక్కమారు విదిలించుకొని బిగ్గరగా ఆవలించి, ముద్దులగుర్రం రోజినాంటే ప్రక్కనే తానూ నడుంవాల్చాడు. మళ్ళీ ప్రొద్దున్నే యిద్దరూ నిద్దరలేచి అధర్మాన్ని వెదుక్కొంటూ బయలుదేరారు.

సూర్యుడు బాగా నడినెత్తికివచ్చేసరికి వీళ్లిద్దరూ లాపిస్ అనే కొండకనుమదగ్గరకు చేరారు. వీళ్లు అక్కడికి చేరేసమయానికి ఒకపెద్ద పూరేగింపులా



అనువాదం: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

కొందరు మనుష్యులు, ఒక గుర్రపుబండీ ఆ రెండు కొండలమధ్యనున్న యిరుకు బాటలోంచి వస్తున్నారు.

ఆ వూరేగింపుకు ముందువైపు నల్లటి గౌనులు వంటినిండా కప్పుకొనివున్న యిద్దరు మతబోధకులు వున్నారు. వీళ్లిద్దరూ రెండు కంచరగాడిదలమీద ఎక్కి వస్తున్నారు. వీళ్ళకు కొంచెం వెనగ్గా ఒక గుర్రపు బగ్గీ నింపాదిగా వస్తున్నది. ఆ బగ్గీకి పైభాగాన నాలుగు కూసాలకు నాలుగు ఎర్రజెండాలు తగిలించి వున్నాయి. గాలికి ఆ నాలుగు జెండాలు రెపరెప కొట్టుకొంటున్నాయి. బగ్గీకి వెనుక నలుగురైదుగురు గుర్రాలు ఎక్కి వస్తున్నారు. వాళ్ల వెనక యిద్దరు ముగ్గురు మూటలు చేరవేసేవాళ్లు నడిచి వస్తున్నారు. నల్లటి ముసుగులతోవున్న యీ మతబోధకులు వారి వెనకాల యీ గుర్రపు బండీ, దానివెనుక కొంత పరివారమూ ఎప్పుడైతే డాన్ క్విక్ సెట్ కంటబడ్డారో అప్పుడే ఆయనకు తోచింది—యిందులో ఏదో గొప్ప దుర్భేద్యమైన రహస్యం వున్నదని.

శాంకో పాంజావైపుకు తిరిగి "శాంకో, అదృష్టదేవత నన్ను వలచి ఎదురు వచ్చుచున్నది; చూచితివా! మందగమనముతో యిటు కదిలివచ్చు యీ వూరేగింపులో ఏదో గొప్ప రహస్యము యిమిడి వున్నది. నల్లని దుస్తులు ధరించి అందరికంటెను ముందు, గాడిదలపై నెక్కి వూరేగింపును నడిపించుకొని వచ్చుచున్న ఆ యిద్దరును నేపాలభూపాల మాంత్రికులు. ఇందులకు ఎట్టి సందియమునూ లేదు. వారి వెనుకగా కదలలేక కదులుచున్న ఆ రథమున్నదే—అందు అపురూప సౌందర్యరాసి అయిన ఒక రాకుమార్తె వుండితీరవలె. అమాయకురాలైన ఆ అందాలరాణిని యీ మోసగాండ్రిద్దరూ మాయ జేసి బందీగా గొనిపోవుచున్నారు. ఏమి సాహసము? ఏమి సాహసము ? అన్యాయవర్తనులై అమాయక ప్రజానీకమును యీ రీతిని హింసించు ఆ మాంత్రికుల నిదే నాకరవాలమున కాహారముగా జేసితీరెదను. నీవిచ్చటనే వుండి మదీయ వీర విహారములను కన్నులార గాంచుము." అంటూ డ్వాన్ క్విక్ సెట్ గుర్రాన్ని అదిలించబోయాడు.

శాంకో పాంజా ఆయనదారికి అడ్డంవచ్చి "స్వామీ ! తొందరపడవద్దు; తొందర పడవద్దు. తొందరవల్ల తొంభైవిధాల నష్టమన్నారు పెద్దలు. తొందరపడి సాహసకార్యాలు చేయబోతే మొన్నటి ఆ గాలి మరల గొడవకు మించిన గొడవ కాగలదు. నల్లని దుస్తులు ధరించివున్న వారిద్దరూ నాకంటికి సన్యాసుల్లా కనుపిస్తున్నారు. వారివెనుక వస్తున్న బగ్గీలో మర్యాదస్తులైన వారెవ్వరో ఒకవూరినుంచి మరొక వూరికి ఏదో పనిమీద ప్రయాణమై పోతున్నట్లున్నారు. ఏమైనా ముందుగా తొందరపడక అడిగి తెలుసుకొని మరీ మన చేతులకు పని చెప్పటం మంచిది" అన్నాడు.

శాంకోపాంజాకు తోచిందే నిజం. ఏమంటే — ఆబండీలో గొప్పయింటి ఆడపడుచు ఒకామె తన భర్తదగ్గరకు "సెవిల్లీ" పట్టణానికి తరలి పోతున్నది. నల్లటి దుస్తులు ధరించివున్న ఆ మతబోధకులతో యీమెకు ఎలాటి సంబంధమూ లేదు. మార్గమధ్యంలో ఆ గుర్రపుబండి యీ సన్యాసులూ తారసిల్లారు.

ఏమైతే నేం? డాన్ క్విక్ సెట్ కు యిదంతా ఏమీ అక్కరలేదు. శాంకో పాంజా చెప్పేమాటల్లో ఒక్కటైనా ఆతని చెవుల్లో దూరనే లేదు. చెవుల్లో ఏదైన ఒక మాట పొరపాటున దూరినా అది బుర్రకు ఎక్కనేలేదు. ఏదో ఘనకార్యం చేసెయ్యాలన్న దురద అంతకంతకూ ఎక్కువైపోయింది. వెర్రి ఆవేశం వచ్చేసింది. ఇంకే ముందీ? గుర్రం డొక్కలో ఒక్క తాపు తన్నాడు. అది కుంటికాలు ఎగుర వేసుకొంటూ ఆ వూరేగింపువైపుకు పరుగు లంకించుకొంది. అలా పోయిపోయి ఆ గుంపు నట్టనడాన గుర్రాన్ని రక్కున ఆపి, డాన్ క్విక్ సెట్ ఆ సన్యాసుల నిద్దరినీ బండ బూతులు తిట్టటం మొదలుపెట్టాడు. వీరగ్రాంథికభాషలో యింత పెద్ద పెద్ద తిట్లు తిట్టవలసిన అవసరం యీ వీరుడికి ఎందుకు వచ్చిందో అర్థంకాక, ఏం చెయ్యటానికి తోచక ఆ సన్యాసు లిద్దరూ అలా దిగ్భ్రాంతులై ఎక్కడ వున్న వాళ్లు అక్కడే నిలుచుండిపోయి గుడ్లు అప్పగించి చూస్తున్నారు.

"ఓరీ రాక్షసులారా ! రాజవంశమున పుట్టిన ఆ అబల నిట్లు బలాత్కారముగా ఎత్తుకుని పోవుదురే? ఎంతటి కండకావరము ? ప్రాణములపై నాశయున్నచో

మీ దుస్తంత్రమును వీడి, ఆమెను నాకు అప్పగించి మీదారిని మీరు బొండు. లేక యమపురికేగ నుత్స హించుచున్నవారైనవో, రండు, యిదే నాభుజ బలమును చవిజూపెద" అంటూ బిగ్గరగా అరుచు కొంటూ, తొడలు చరుచుకొంటూ, రంకెలు వేసు కొంటూ చేతులు తిప్పుకొంటూ మీసాలు మెలివేస్తూ, నానా ఖంగారు చేయటం మొదలుపెట్టాడు.

ఈలోగా ఆ యిద్దరు సన్యాసులూ కొంచెం తేరుకొని తాము ఏ పాపమూ ఎరుగమనీ, ఆ బండీలో వస్తున్నవారికీ తమకూ ఎట్టి సంబంధమూ లేదనీ చెప్పుకొన్నారు. ఎలాగైనా యీ పిచ్చివాడి కోపం తగ్గుతుందేమో అని వాళ్లు ఎంతో ఆశపడ్డారు. పిచ్చి ఆవేశంలో వున్న డాన్ క్విక్‌సెట్‌బుర్రకి వీళ్లు చెప్పేది ఏమీ ఎక్కటంలేదు. నయాన వీళ్లు యింత యిదిగా చెప్పుకుంటే అదేమీ వినిపించుకోకుండా ఆయీటె పుచ్చుకొని ఆ యిద్దరు సన్యాసుల్లో ఒకడి మీదకు విరుచుకు పడ్డాడు. ఇతను వెళ్లిన విసురుకు, పాపం, ఆ సన్యాసి ప్రాణం కాస్తా అక్కడే గుట్టుక్కు మనవలసిందే. కానీ అతడు, యితడి దూకుడూ అదీ చూసి భయపడిపోయి, తక్షణమే గాడిదమీద నుంచీ కిందికి దూకేశాడు. పెద్దగండం కొద్దిలో తప్పిపోయింది. ఇదంతా చూస్తున్న రెండో సన్యాసికి తారు ఎత్తు కొంది. తన గాడిదను చింతబరికె పుచ్చుకు తెగ బాదాడు. ఆ గాడిద కుప్పిగంతులు వేస్తూ దౌడు తీసింది. అప్పటి కప్పుడే ఆ రెండో సన్యాసి రెండు మూడు ఫర్లాంగుల దూరం వెళ్లిపోయాడు కూడాను.

ఇంత సేపూ అల్లంత దూరాన నిలుచుని వేడుక చూస్తున్న శాంకో పాంజాకు యింతలో ఏం బుద్ధి పుట్టిందో ఏమో—క్రిందపడివున్న ఆ సన్యాసి పని పట్టించటానికి తానూ పూనుకొన్నాడు. వాడి జేబులూ అవి తడివి, డబ్బూ దస్కం ఏమైనా వుంటే అవన్నీ తన జేబులోకి ఎక్కిస్తున్నాడు.

కుర్రపు బగ్గీ వెనుక వస్తున్న కూలీలలో యిద్దరు యిక్కడ జరిగే భాగోతాన్ని యింతలో చూసి, చప్పున పరుగెత్తుకొంటూ వచ్చారు. వాళ్లు వచ్చిచూసేసరికి సన్యాసిని క్రిందపడవేసి వాడిపీకమీద ఎక్కి కూర్చొని శాంకో పాంజా వాడి జేబులన్నీ తడుముతూ వుండటం వాళ్ల కళ్ల బడింది. వీళ్లు అదిలించే సరికి శాంకో పాంజాకు నిజంగా భయంవేసింది. అందు కని తాను చేస్తున్నది వీరోచిత సాహస కార్యముని

వాళ్లతో ఎంతగానో చెప్పుకొన్నాడు. వీరోచిత సాహసకార్యాలంటే వాళ్లకు సరిగా అర్థమౌతుందో లేదో అని వీరులు అంటే ఎవరో, వాళ్లు యుద్ధాలు ఎందుకు చేస్తారో, అలా యుద్ధాలు చేసి శత్రువుల తాలూకు వస్తువులను ఎందుకు జాగ్రత పెట్టుకొంటారో అదంతా పెద్ద వుపన్యాసకుడిలా వివరించటం మొదలుపెట్టాడు. ఆ కూలీలిద్దరికీ వీడు చెప్పే గొప్పలు ఏమీ కాబట్ట లేదు. ఇద్దరూ కలిసి వీణ్ణి రెక్కలు పెడవిరిచి పట్టుకొని, ఒకడితరువాత మరొకడుగా వీపుమీద, లెంపల మీద, పొట్టమీద గుద్దులు గుద్ది క్రింద పడవేశారు. అంతకీ కసితీరక వాడి వీపుమీదికి యిద్దరూ ఒక్కమారుగా ఎక్కి కాసేపు నటరాజనృత్యం చేశారు. వాళ్ల కాళ్లక్రింద పడి నలిగిపోయిన శాంకోపాంజాకు యిక నోటమాట పెగలటం లేదు. అమ్మో బాబో అనటంకూడా మానివేశాడు. అప్పటికి వాళ్లిద్దరికీ కూడా కాస్త అలుపు వచ్చింది. కదలకుండా కట్టెలా పడివున్న శాంకో పాంజాను వాడి మానానికి వాణ్ణి వదిలేసి, వాళ్ల దారిని వాళ్లు చక్కాపోయారు.

ఇక్కడ యింత కాండ జరుగుతూవుంటే అక్కడ డాన్‌క్విక్‌సెట్ ఏంచేస్తున్నాడనుకొన్నారు? ఆ యిద్దరు మంత్రగాళ్లలో ఒకడిని నేలమట్టం చేశాను కదా అనీ, మరొకడికి బుద్ధివచ్చి పారిపోయాడు కదా అనీ సంబరాలు పడుతూ, పెద్దగా సకిలింపులు సకిలిస్తూ, గుర్రాన్ని ఆ బండి దగ్గిరకు పోనిచ్చాడు. మీసాలు మెలివేసుకొంటూ అక్కడ నిల్చొని బండీలో వున్న 'రాజకుమారి'ని పిలిచాడు. ఆవిడకు యింతసేపూ ఏదో పోట్లాటలు జరుగుతున్నట్లూ, ఎవరో తిట్టుకొంటున్నట్లు కొట్టుకొంటున్నట్లు రకరకాలుగా శబ్దాలు వినిపిస్తూనే వున్నాయి. ఇదంతా ఏమిటో ఆమెకు ఏమీ బోధపడటంలేదు. అసలే ఏమీ అర్థంకాక ఆవిడ తికమక పడుతుంటే వీడెవడో, యీ యాచుకుపోయిన మనిషి, యిప్పుడు యిలా వెధవ నవ్వులు నవ్వుకొంటూ మీసాలు మెలవేసుకొంటూ నిల్చొనివుంటే ఆమెకు చిరాకు వేసింది; భయంకూడా పుట్టుకొచ్చింది.

అమాయకురాలైన తనను బందీగా చేసి పట్టుకుపోతున్న ఆ ముష్కరులను తాను హతమార్చేశానని డాన్ క్విక్‌సెట్ పెద్దగర్వంగా చెప్పుకోసాగాడు. ఆమెకు తను అసలు ఎన్నడూ బందీ అయిందీ తెలియకనేపోతే, 'నీబందీ విడిపించానని' వీడు అంటూవుంటే ఆమెకు అదంతా అయోమయంగా తయారైంది.

డాన్ క్విక్‌సెట్ అంతటితో ఆగిపోయినా బాగుండేది. ఆమెను ఆ దుష్టుల బారినుండి రక్షించినందుకు తనకు కృతజ్ఞతాసూచకంగా ఆమె ఒక పని చేయవలసి వుంటుందని నిర్దేశించాడు. ఉన్నపళంగా బండిని వెనక్కు మళ్లించి 'టొబోసా' గ్రామానికి పోయి, అందుగల అనన్యరూపసి డల్సినీయా రాకుమారి ఎందున్నదో అరసిచూచి, ఆమెకు, తానీనాడు ప్రదర్శించిన వీరోచిత ధైర్యసాహసాలను ఓపినంతమటుకు వర్ణించి చెప్పవలసిందిగా కోరాడు. దీంతో ఆమెకు చిర్రెత్తుకొచ్చింది.

డాన్ క్విక్‌సెట్ యిలా బండిదగ్గర చేరి ఆమెను అలా చికాకు పెట్టుతూ వుండటమూ, తూర్పు దిశగా ప్రయాణమై పోతున్న బగ్గీ గుర్రాలను పడమరకు తిప్పాలని పెనుగులాడుతుండటమూ, యిదంతా చూస్తున్న ఆమె హంగుదారుడికి ఒకడికి బలే కోపం వచ్చింది. వాడు గబగబా ముందుకు వచ్చి బండిని 'సెవిల్లీ' వైపుకు పోనిస్తావా లేదా ఒక్క ముక్కలో తేల్చి చెప్పమని డాన్ క్విక్‌సెట్‌ను గదమాయించాడు. డాన్ క్విక్‌సెట్ మాత్రం యిలాంటి బెదిరింపులకు అంత తేలికగా లొంగిపోయే ఘటమా! ససేమిరా వీల్లేదు పొమ్మన్నాడు.

డాన్ క్విక్‌సెట్ ఒరలో నుంచి కత్తి సర్రున లాగి, ఆ కాపలా మనిషిమీద పడ్డాడు. గాడిద నెక్కివున్న ఆ కాపలావాడు డాన్ క్విక్‌సెట్ కత్తి తగులకుండా తప్పించుకోవటానికి వీల్లేక, గాడిదమీదనుంచి క్రిందకు దిగటానికైనా సందు దొరకక, ప్రక్కనే నిలుచునివున్న బగ్గీలోంచి పట్టుదిండు ఒకటి చప్పున చేతికి చిక్కించుకొని దాన్నే డాలుగా వుపయోగించి, డాన్ క్విక్‌సెట్ కత్తిదెబ్బలు కాచుకొన్నాడు. సందు చూసుకొని తన కత్తికూడా ఒరలోంచి లాగి కత్తికి కత్తి తాకించాడు. కత్తీకత్తీ ఎప్పుడైతే కలిశాయో, యిద్దరికీ ఒళ్లూపై తెలియని పట్టుదలలు వచ్చేశాయి. కత్తియుద్ధం జోరుగా సాగిపోతోంది. ఠంగ్ ఠంగ్ మంటూ కత్తిదెబ్బలు అల్లంత దూరానికి

కూడా వినిపిస్తున్నాయి. ఆ యిద్దరిలో ఎవరో ఒకరు చస్తేనే కాని యీ యుద్ధం అంతం కాదేమో నని పించింది. యుద్ధం అలా భయంకరంగా సాగిపోతూ వుండగా వున్నట్లుండి ఆహాంగుదారుడు కత్తి పుచ్చుకొని డాన్ క్విక్ సెట్ కుడిబుజంమీద చాపుదెబ్బ ఒకటి కొట్టాడు. నిజంగా డాన్ క్విక్ సెట్ కు, అతని కుడి భుజానికీ అంతటితో ఋణం తీరిపోవలసిందే! కానీ తుప్పుపట్టినదే అయినా ఆ వుక్కుకవచం ఒకటి వుండబట్టి ఎంతో మేలు అయింది. అంత పెద్ద ప్రమాదం కొద్దిలో తప్పిపోయింది. అంతలావు దెబ్బ తిన్నమీదట డాన్ క్విక్ సెట్ కు కోపం మరీ రెచ్చిపోయింది. డల్ సీనియా రాకుమారి పేరు భూనభోంతరాళాలు దద్దరిల్లిపోయేలా ఒక్కమారు పెద్దగా వుచ్చరించి తన కత్తిమొన వాడి గుండెల మీదికి గురిచూచి వాడిమీదికి పోబోయాడు.

ఈ దెబ్బతో ఒకళ్ల నొకళ్లు కడతేర్చాలని కృతనిశ్చయులై యిద్దరూ చురకత్తులు విసురుగా త్రిప్పుతూ ఆ చుట్టుపట్ల వుండే వాతావరణాన్ని అంతటినీ ఖణేల్ ఖణేల్ మనే కత్తిదెబ్బల మ్రోతలతో నింపివేశారు. ఈ దృశ్యం చూస్తున్న వారందరు వూపిరి బిగబట్టి అలా చూస్తునేన్నారు. ఆ యిద్దరిలో ఎవరో ఒకరు యీ క్షణమో, మరుక్షణమో నేల కొరగక తప్పదని వారిలో ప్రతి ఒక్కరూ భయపడసాగారు.

ఆ హాంగుదారుడు విసిరిన కత్తిదెబ్బ వచ్చి డాన్ క్విక్ సెట్ గారి తలపైగల వుక్కుటోపీకి బలంగా తగిలింది ఇంత లావు వుక్కుటోపీ కూడా దెబ్బకు ముక్కలు ముక్కలు అయింది. ఆ టోపీతోపాటు డాన్ క్విక్ సెట్ గారి కుడిచెవిలో కొంతభాగం కత్తిరించుకు పోయింది. చెవికూడా కత్తిరించుకు పోయేసరికి డాన్ క్విక్ సెట్ కు కోపం మరీ మితిమీరి పోయింది. వళ్లూపై తెలియని ఆవేశంతో యీయన వాడిని పట్టాలని మహోద్ధృతంగా విజృంభించి, వాడి మీద బలమైన దెబ్బఒకటి తీశాడు.

ఈదెబ్బతో ఆ హాంగుదారుడు ఎక్కివున్న గాడిదకు తాకు ఎత్తుకొంది. అది యిక అక్కడ నిలబడకుండా పరుగు లంకించుకొంది. పెద్దగా ఓండ్రపెట్టుతూ ముందు కాళ్ళతో కాసేపు, వెనుక కాళ్లతో కాసేపు గంతులు వేసింది. ఇలా రెండు మూడు నిముషాల పాటు యిది నాట్యమాడి, నాట్యమాడి, తన వీపుమీద కూర్చొనివున్న ఆ హాంగుదారుణ్ణి అమాంతం విసిరి క్రింద పారేసింది. వాడి వళ్లంతా అంగుళంమేర ఖాళీలేకుండా, ఎక్కడ పడితే అక్కడ గాయాలు తగిలాయి. నెత్తురు వరదలుకట్టి ప్రవహించుతోంది. కాలు చెయ్యి కూడదీసుకొనే ఓపిక లేక నేలమీద ఎట్లా పడ్డాడు అట్లాగే వుండిపోయాడు.

డాన్ క్విక్ సెట్ గారి కోపం అంతటితోనైనా ఆగలేదు. ఎకాఎకిని పోయి వాడి గొంతు మీద ఎక్కి కూర్చొని, శరణు వేడమన్నాడు. లేక పోతే వున్నపళంగా వాడి కంఠం కత్తిరించెయ్యగల నని హెచ్చరించాడు. ఈయన యింత బిగ్గరగా సవాలు చేస్తున్నా మట్టి నాకుతున్న ఆ హాంగు దారుడు వులకలేదు; పలకలేదు. గొంతెత్తి ఏమాట చెప్పటానికైనా వాడివంట్లో పీసమెత్తు ఓపిక వుంటేగా! వాడు బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడకపోవటం చూసి డాన్ క్విక్ సెట్ నిజంగానే వాడి కంఠం కోసెయ్యటానికి కత్తి ఎత్తాడు. అదృశ్యం బండి కిటికీ

లోంచి చూస్తున్న ఆమెకు విపరీతమైన భయంవేసి వణుకు పుట్టుకువచ్చింది. ఏమి చెయ్యటానికీ దిక్కుతోచక, దబదబా బండి దిగివచ్చి తనకు కాపలాకోసం వస్తున్నవాడి ప్రాణాలు కాపాడమని డాన్ క్విక్‌సెట్ గారిని బ్రతిమాలింది.

ఆ ఆడకూతురు అంత బ్రతిమాలుతున్నా, చేతికి చిక్కినవాణ్ణి ప్రాణాలతో వదిలెయ్యటం డాన్ క్విక్‌సెట్‌కు మొదట్లో ఎంత మాత్రం రుచించ లేదు. చివరకు ఒక షరతుపెట్టి, అందుకు ఒప్పుకొనేట్లయితే వాడిని ప్రాణాలతో వుండనిస్తానని మాత్రం మాట యిచ్చాడు. ఆ షరతు ఏమిటంటే — అన్ని గాయాలతో వున్న వీడు తక్షణమే 'టొబోసా'కు పోయి 'డల్ సీనియా' రాకుమారిశరణు వేడాలని. ఆ రాకుమారి వీణ్ణి జాలిదలచి వదిలివేసేట్లయితే తన కే మాత్రపు అభ్యంతరమూ వుండబోదని చెప్పాడు.

ఆమె, పాపం, అంత భయపడివున్నదేమో, యీ 'టొబోసా' గ్రామం ఏదిక్కున వున్నదని కానీ, ఆ 'డల్ సీనియా' రాకుమారిని వెదికి తెలుసుకోవటం ఎలాగు అని కానీ ఏమీ అడుగకుండానే డాన్ క్విక్‌సెట్ పెట్టిన ఆ షరతుకు ఒప్పేసుకొంది. ఆ విధంగా తన ప్రత్యర్థిసమూహం తనకు లొంగిపోయి తనుపెట్టిన షరతులన్నీ పాటిస్తున్నందుకు డాన్ క్విక్‌సెట్‌కు బలే సంతోషం వేసింది. గర్వం కూడా పుట్టుకొచ్చింది. అప్పటికి వాళ్ల దారిని వాళ్లను పోనిచ్చాడు. వాళ్లు మాత్రం బగ్గీని వెనక్కు తిప్ప



కుండా ముందుకే ప్రయాణం సాగించారు.

ఈలోగా శాంకో పాంజా కొంచెం తేరుకొని, అంతసేపూ కదలకుండా పడివున్న వాడల్లా లేచి నిల్చొని, వంటిమీద దుమ్ము దులుపుకొంటున్నాడు. ఎక్కడెక్కడ ఎంతెంత పెద్దగాయాలు తగిలాయో చూసుకొని లోలోపలే కుళ్లుతున్నాడు. వీరుడైన డాన్ క్విక్‌సెట్ గారు వాణ్ణి పెద్ద గావుకేకతో పిలిచి, వాడు వచ్చేదాకా అయినా ఆగకుండా పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ పోయి, ముద్దులగుర్రం 'రోజినాన్‌టీ' పైకి ఎక్కి కూర్చొన్నాడు. ఆ ముసలి గుర్రం చెక్కిలి నొక్కసారి ముద్దు కూడా పెట్టుకొన్నాడు. ముందుకు పొమ్మని దాన్ని హెచ్చరించాడు. శాంకోపాంజా కూడా తన గాడిద 'డాపుల్'ను వెదికి పట్టుకు వచ్చుకొని దానిమీద ఎక్కి కూర్చొన్నాడు. అది నెంపాదిగా అడుగుతీసి అడుగు వేస్తూ రోజినాన్‌టీ పోయిన మార్గాన్నే అనుసరించి పోతున్నది. శాంకోపాంజా కళ్ల వెంట నీళ్లు గిర్రున తిరిగాయి. మట్టి కొట్టుకుపోయిన చొక్కాతో కళ్ల నీళ్లు తుడుకొన్నాడు.

(ఇంకావుంది.)

విశ్వాసంలేని జంతువు

(32–వ పేజీ తరువాయి)

దిగులుగావుండటం గమనించింది. "ఏమిటి; నాన్నా! అలా దిగులుగావున్నారు?" అని అడిగింది.

"ఏమీలేదమ్మా! ఊరికే-ఏదో ఆలోచిస్తున్నాను."

"నాతో చెప్పవా?"

"ఎబ్బే! ఏమీలేదు. పాదుషా నన్ను ఒకప్రశ్న అడిగారు. ఆ ప్రశ్నకు ఎల్లుండిలోగా సరిఅయిన సమాధానం చెప్పకపోతే తల తీయించేస్తానన్నారు."

"అమ్మో! తలతీయించెయ్యటమే!"

"ఊఁ! తల తీయిస్తారట."

"ఏమిటి నాన్నా? మీరే సమాధానం చెప్పలేని ఆ చిక్కు ప్రశ్న?"

"అదికాదమ్మా; విశ్వాసంగల జంతువేదో విశ్వాసంలేని జంతువు ఏదో చెప్పమన్నారు పాదుషా."

"దానికేమున్నది నాన్నా! సమాధానం చెప్పెయ్యలేక పోయావా."

"విశ్వాసంగల జంతువులంటే కుక్క అనో ఆవు అనో ఏదో ఒకటి చెప్పవచ్చు. విశ్వాసంలేని జంతువు ఏదో ఎంత ఆలోచించినా తెలియటంలేదు."

"అదేమిటి నాన్నా! అల్లుడి కంటే విశ్వాసంలేని జంతువు వేరే ఏదీ లేదే! తేలికగా చెప్పెయ్యలేక పోయారా! దీనికోసం యింత చికాకు పడుతున్నారా? లేవండి అన్నానికి, అంటూ నవ్వులు ఒలకపోసింది. బీర్బల్ గుండె తేలిక పడింది. ముసిముసి నవ్వులు నవ్వకొంటూ భోజనం చేశాడు.

గడువు రోజున ఆస్థానానికి వెళ్లాడు. ప్రభువులు సామంతులు అందరూ కొలువుతీరి వున్నారు. అక్బర్ పాదుషా హాలులోకి వచ్చి రావటంతోటే "బీర్బల్! ఈవేళ వరకే కదూ నీవడిగిన గడువు? సమాధానం చెప్తావా? లేక..."

బీర్బల్ లేచి నిల్చొని "పాదుషాహీ వారికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా వున్నాను." అన్నాడు.

చెప్పమన్నట్లు పాదుషా ఆయన వంక ఒక చూపు చూశాడు.

"ప్రభూ! తమరు విశ్వాసంగల జంతువు ఏదో విశ్వాసం లేని జంతువు ఏదో చెప్పమన్నారు. విశ్వాసంగల జంతువు అందరకూ తెలిసిందే. కుక్క. దీనికి పట్టెడు ఎంగిలి మెతుకులు పడవేస్తే బ్రతికి వున్నంత కాలం యజమానికి సేవచేస్తుంది. ఇక విశ్వాసం లేని జంతువు. అదికూడా అందరికీ తెలిసిందే. అల్లుడు. బంగారం లాంటి కూతురునిస్తూ జోలెడంత డబ్బు కట్నంగా యిచ్చినా, చీటికి మాటికిఅలకలంటూ మూతి బిగించుకుకూర్చొంటాడు. ఈ అలకలకు అంతు అంటూ ఎన్నడూ వుండదు. కుక్కకు వుండే మాత్రమైనా విశ్వాసంలేని జంతువు అల్లుడని అంటున్నాను." అన్నాడు ఎంతో నమ్రత కనబరుస్తూ. హాల్లో వున్న వాళ్లంతా గొల్లుమన్నారు. అక్బర్‌కు కూడా నవ్వు వచ్చింది. ఇంకా చమత్కారం చూద్దామని బుద్ధిపుట్టి "అల్లుళ్లు అంత విశ్వాసంలేనివారు అవుతే వారందరి తలలూ తీయించేద్దాం" అన్నాడు.

బీర్బల్ యింకా విధేయత కనుపించేలా మరి కొంత ముందుకు వంగి "హుజూర్! తామెందరికో అల్లుడి సన్నవిషయం మరచిపోతే మొగలాయీ సామ్రాజ్యానికే ప్రమాదం" అని విన్నవించాడు. సభ్యులు యీసారి యింకా గొల్లుమన్నారు.

బీర్బల్ బుద్ధి కుశలతకు అక్బర్ ఎంతో సంతోషించాడు. పెద్దపారితోషికం కూడా యిచ్చాడు. ★



కృష్ణాపిక్చర్సు వారి "అమ్మలక్కలు"లో పద్మిని.



కాలేజీలోనే గాఢంగా ప్రేమించుకున్నారు కృష్ణాపిక్చర్సువారి "అమ్మలక్కలు"లో
ఎన్. టి. రామారావు, పద్మిని.

భిన్నభాషల్లో చిత్రనిర్మాణం

ఒకే చిత్రాన్ని వివిధభాషల్లో నిర్మించటం ఇటీవల దక్షిణభారతదేశంలో పరిపాటిఅయింది. యుద్ధానికి పూర్వమూ, యుద్ధంరోజుల్లోనూ బెంగాలీలు, మహారాష్ట్రీలు, పంజాబీలు మాత్రమే తమ తమ చిత్రాలను హిందీలో కూడా నిర్మాణం చేసి భారతదేశమంతటా ప్రదర్శించేవారు. ఇందుమూలంగా ముఖ్యంగా బెంగాలీ, మహారాష్ట్రచిత్రాలు తమ ప్రాంతీయ సంస్కృతిని, కళాప్రాశస్త్యాన్ని దేశమంతటికీ చవిచూపి సాటిలేని గౌరవం సంపాదించుకున్నాయి. దక్షిణదేశంలో ఈ పద్ధతి అవలంబించి ఆర్థికంగా అఖండ విజయం పొందిన నిర్మాత జెమినీ వాసన్. ఏ హిందీచిత్రానికీ రాని లాభాలు చంద్రలేఖ, నిషాన్ చిత్రాలు ఆర్జించటంచూసి ఇతర తమిళనిర్మాతలు కూడా తమ చిత్రాలను హిందీ, తెలుగుభాషల్లోకి తర్జుమాచేసి విజయం పొందారు. ఈ పద్ధతి ఇప్పుడు సర్వసామాన్యమైపోయింది. ప్రస్తుతం తయారవుతున్న తెలుగు, తమిళచిత్రాలలో సగానికి సగమైనా రెండుభాషల్లో తయారయ్యేవి ఉన్నాయి. కొన్ని మూడు భాషల్లోకి తయారవుతున్నాయి. అలాగే బొంబాయి, కలకత్తాలలో తయారయ్యే చిత్రాలలో కూడా అరవం, తెలుగులలో నిర్మింపబడుతున్నవి అనేకం ఉన్నాయి.

చిత్రనిర్మాణ వ్యయం అమితంగా పెరిగిపోయిన ఈ రోజుల్లో భిన్నభాషల్లో చిత్రం నిర్మించటంవలన చాలా లాభాలున్నాయి. రెండు భాషల్లో ఒకే చిత్రం నిర్మిస్తున్నప్పుడు నటీనటులను, టెక్నీషియన్లను, సెట్టులను, ఇతర పరికరాలను మార్చవలసిన అవసరంరాదు. ఒకరిద్దరు నటీనటులను, తర్జుమా రచయితలను కొత్తగా ఏర్పాటు చేసుకోవలసివచ్చినా ఒక ప్రత్యేకచిత్రం తీసినంత ఖర్చు ఎన్నటికీ కాదు. కనుక దాదాపు ఒక భాషలో చిత్రం తీయటానికయ్యే ధనంతో రెండు భాషల్లో చిత్రం నిర్మించవచ్చునన్నమాట. అలా తీసిన తెలుగుభాషా చిత్రాన్ని తెలుగు కేంద్రాల్లోనూ, తమిళభాషా చిత్రాన్ని తమిళ కేంద్రాల్లోను విడుదల చెయ్యటంవలన నిర్మాత సునాయాసంగా తన ధనం తాను రాబట్టుకోవటమేగాక లాభం సంపాదించే అవకాశంకూడా కలుగుతున్నది.

రెండేసి భాషల్లో విడుదల అయ్యే చిత్రాలను రెండు విధాలుగా తయారు చేయవచ్చును. నిర్మాత తెలుగువాడయితే తెలుగుభాషలో చిత్రం నిర్మించి విడుదల చేస్తాడు. తెలుగులో ఆ చిత్రం విజయం పొందినదనగానే తమిళంలోకో, హిందీలోకో మాటలను, పాటలను తర్జుమా చేయించి నటీనటులచేత పలికిస్తాడు.


తెలుగు ఉచ్చారణకు, తమిళ ఉచ్చారణకు తేడా ఉండడంవల కొన్ని క్లోజ్ షాట్ దృశ్యాలను "రీటేక్" చేసినంత మాత్రాన సరిపోతుంది. మిగతా చిత్రం యథాతథంగానే ఉంటుంది. ఇది "డబ్బింగ్ పద్ధతి". ఈ పద్ధతి క్రమంగా

వాడుకలోంచి పోయేటట్లు కనిపిస్తున్నది. ఇప్పుడిప్పుడు నిర్మాతలు చాలమంది మరొకపద్ధతి అవలంబిస్తున్నారు. ఏదో ఒక కథ తీసుకుని దానికి తెలుగులోను, అరవంలోనూ ఒకేమాదిరి స్క్రిప్టులు, సంభాషణలు రాయించి, రెంటినీ ఒకేసెట్టుమీద ఒకేసారి షూట్ చేస్తున్నారు. "డబ్బింగ్" లో వచ్చే దోషాలను నివారించడానికి ఈ పద్ధతివల్ల వీలవుతుంది.


భిన్నభాషల్లో చిత్రం నిర్మించటంవలన సాంస్కృతికంగా కొన్ని లాభాలున్నాయి. లాభాలంటే మరేం కాదు. ఒక భాషలోని పుస్తకాలను మరొక భాషలోకి అనువాదం చేసినందువల్ల కలిగే లాభాలే, పెద్ద ఎత్తున, కలుగుతాయి. ఏ టాల్‌స్టాయి పుస్తకాన్నో తెలుగులోకి తర్జుమా చేశామనుకోండి. టాల్‌స్టాయియొక్క రష్యన్ శైలి ఒక్కటి మినహాగా మిగతాదంతా— అంటే పాత్ర చిత్రణంలో ఆయన ప్రతిభ, వాస్తవిక దృక్పథం మొదలైనవన్నీ మనకు అవగాహన అవుతాయి. అంతేగాక ఆ పుస్తకంలో ప్రతిబింబించే రష్యన్ ప్రజల జీవితం, మనస్తత్వం, ఆచార వ్యవహారాలు అన్నీ మనకు పరిచయమవుతాయి. ఏ రష్యన్ చరిత్ర పుస్తకంకంటె కూడా ఎక్కువగా టాల్‌స్టాయినవలలు రష్యన్ ప్రజలను మనకి గాఢంగా పరిచయం చేస్తాయి.

అదేవిధంగా ఒక భాషాచిత్రాన్ని మరొక భాషలోకూడా తయారుచెయ్యటంవల్ల కూడా ఒక భాషాప్రజల జీవితం, సంస్కృతి మరొక భాషాప్రజలకు పరిచయం చెయ్యటానికి వీలవుతుంది. అంటే సినిమాచిత్రాలను సాంస్కృతిక రాయబారులుగా ఉపయోగించుకునే వీలుందన్నమాట. అయితే ఒక షరతున్నది. టాల్‌స్టాయి నవలలు రష్యన్ జీవితాన్ని ప్రతిబింబించినట్టుగా మన సినిమా చిత్రాలు మన జీవితాన్ని, మన సంస్కృతిని యథాతథంగా చిత్రించాలి. ఈ రోజుల్లో మనవారు తీసే జానపదచిత్రాలు త్రికాలాలకూ, త్రిలోకాలకూ చెందినవిగా కనిపిస్తాయి. అలాగే సాంఘిక చిత్రాలు కూడాను. ఈ విషయంలో న్యూథియేటర్సువారికీ మిగతావారికీ పెద్ద తేడా కనిపిస్తుంది. న్యూథియేటర్సువారు తీసిన సాంఘిక చిత్రాలూ, జానపద చిత్రాలుకూడా బెంగాలీ గ్రామీణ జీవితాన్ని ఆధారంగా తీసుకుని నిర్మించినవే. వారు తమ కథలనే కాదు, కథాస్థలాలను, పాత్రలపేర్లను కూడా యథాతథంగా ఉంచి హిందీలో తీసేవారు. తెలుగువారు కూడా తెలుగు చిత్రాలను హిందీలోకి మార్చేటప్పుడు కథాస్థలాలను, తెలుగు పేర్లను యథాతథంగానే ఉంచి హిందీ ప్రాంతాలకు పంపటం మంచిపద్ధతి

కాని పాటల విషయంలో ఒక చిన్న చిక్కు వస్తుంది. తెలుగుచిత్రాన్ని, హిందీలోకో అరవంలోకో మార్చినప్పుడు తెలుగు పాటల స్వరాలను యథాతథంగా ఉంచినందువల్ల లాభం లేదు. ఇటీవలి "కాంచన" చిత్రంలో ఈ పొరపాటే జరిగింది. అరవపాటల మట్టులకే తెలుగుమాటలు కూర్చి వదిలిపెట్టారు. ఇందువల్ల తెలుగు భాష కాస్తా ధ్వంసమై ఊరుకుంది. న్యూథియేటర్సువారు బెంగాలీ చిత్రాన్ని హిందీలోకి మార్చేటప్పుడు హిందీపాటలకు వేరే మట్లు పెట్టించుకుంటారు. సంగీతం బాణీ బెంగాలీదైనా హిందీ పాటల్లోని మాటల కనుగుణంగా మట్లు పెట్టించటం వలన పాటల అందం చెడకుండా ఉంటుంది. ఇదేపద్ధతి మనవారు కూడా అవలంబించటం మంచిది. ★



ఈనెల 15న చలనచిత్ర నిర్మాతల, డిస్ట్రిబ్యూటర్ల ప్రథమ సమావేశం జరిగింది. నాగిరెడ్డి, ఎ. రామయ్యా, కె. వి. రెడ్డి, కె. సుబ్రహ్మణ్యం, రామనాన్, ప్రకాశరావు మొదలైనవారిని పై బొమ్మలో చూడవచ్చును.



జంపనవారి "మేనరికం"లో పేకేటి శివరాం, కొమ్మూరి పద్మావతీదేవి, చంద్రశేఖరం

తారలపై మోజు

బ్రిటిష్ స్టూడియోలలోని ప్రతి 'క్లాప్' కుర్రాడూ ఒకనాటి కెప్పటికో డైరెక్టరు అవుదామని కలలు కంటాడట. హాలీవుడ్ స్టూడియోలలోని ప్రతి 'క్లాప్' కుర్రాడూ ఎప్పటికైనా ప్రొడ్యూసరు కావాలని కలలు కంటాడట. అంటే బ్రిటన్‌లో డైరెక్టరుకున్న గౌరవం, ఘనత, కీర్తి ఇంకెవరికీ ఉండవనీ, హాలీవుడ్‌లో ప్రతి విషయంలోనూ ప్రొడ్యూసరుదే పైచెయ్యి అనీ అర్థం. బ్రిటన్‌లో గాని, తదితర యూరపియన్ దేశాల్లో గాని ఒక గొప్పచిత్రం విడుదలఅయిందంటే కీర్తియావత్తూ డైరెక్టరుకే దక్కుతుంది. హాలీవుడ్‌లో ప్రొడ్యూసరే కీర్తియావత్తూ పుంజుకుంటాడు.

ఇండియాలో మాత్రం ప్రతివాడికీ ఒకటే కల: ఎప్పటికైనా తెరమీద తన ముఖం అర సెకనుకాలం కనిపిస్తే జన్మ తరించిపోతుందని. త్యాగరాయనగర్ రోడ్ల మీద, ప్రొడ్యూసర్ల కార్యాలయాల్లోను, స్టూడియోల పరిసరాల్లోను పని పెట్టుకుని వెదికితే, 'సినిమా ఛాన్సు' కోసం ఎక్కడెక్కడినుంచో వచ్చి, ఎన్నాళ్ళనుంచో వాళ్ళనీ వీళ్ళనీ ఆశ్రయించుకునివుండి, నానాఅవస్థలు పడేవారు పలువురు కనిపిస్తారు. వీరిలో చాలమంది మిగతా ఉద్యోగాలకోసం తిరిగేవారిలాగ ఉదరపోషణార్థం వచ్చినవారు కాదు. శుభ్రమైన ఉద్యోగాలలో, ఆస్తులలో ఉండి కూడా 'సినిమా ఛాన్సు' కోసం వచ్చినవారే. వీరికి పెద్దపెద్ద స్టార్సు అయిపోదామనే ఆశలుకూడా ఉండవు. ఏదో ఒక సినిమాలో ఎంత చిన్న వేషమైనా సరే దొరికితే 'ధన్యోస్మి' అనుకునే రకం.

దీనికి కారణమేమిటంటే మనదేశంలో సినిమా నటీనటులకున్న పలుకుబడి, గౌరవం ఇంకెవరికీ ఉండవు—కనీసం సినిమా ప్రేక్షక లోకంలో, ఒక చిత్రం అద్భుతంగా ఉన్నదంటే ఆ గొప్పదనంలో ఎక్కువ వాటా న్యాయప్రకారం దర్శకుడికీ, నిర్మాతకీ, ఫొటోగ్రఫీ డైరెక్టరుకూ, ఇతర టెక్నీషియన్లకూ చెందాలనీ, మిగిలిన వాటా మాత్రమే నటీనటులకు చెందుతుందనీ, చలనచిత్ర కళలో నటీనటులకు ముడిపదార్థాలకిచ్చే విలువమాత్రమే ఇవ్వాలనీ మనలో చాలమందికి తెలియదు. ఒక చిత్రంయొక్క గొప్పదనానికి తోడ్పడే అనేక కారణాల్లో నటనటులు కూడా ఒక కారణంకాని అంతకంటే ఎక్కువ కాదు.

చాలమందికి స్టార్లను తెరమీదనేగాని విడిగా ఎక్కడపడితే అక్కడ చూసే అవకాశం లభించదు. స్టార్ల భవనాలకు ఘూర్ఖా కాపలాదార్లు ఉంటారు. ఏ స్టూడియోలకో వెళ్ళేటప్పుడైనా వాయువేగంతోపోయే కార్లలో స్టార్లు విద్యుల్లత

ల్లాగ క్షణమాత్రం మెరసి మాయమౌతారు. వారు సినిమా ప్రపంచంలోకి అడుగు పెట్టిన కొంతకాలానికల్లా ప్రజాజీవితం అంటే ఏమిటో కూడా మరిచిపోతారు. స్టారు ఇంత అపురూపంగా తయారవటంతో ప్రజలకు సహజంగా వారంటే ఆకర్షణ కలుగుతుంది. ఏ జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడో కనిపిస్తే ఓశ్ అనుకుని వెళ్ళిపోయే వాళ్ళు 'ఫలానా సినిమాలో ఫలానా దాసీ వేషం వేసినావిడ' కనిపించగానే తన్మయీ భావంతో చూస్తారు.

మొన్న నొకరోజున మౌంట్ రోడ్డులో ఇలాంటిదే ఒక చిన్న సంఘటన జరిగింది. ఒక పెద్దబట్టలషాపు ఎదుట వందలసంఖ్యలో జనం గుమిగూడి ఉన్నారు. "ఏమిటి సంగతి" అని అడిగితే ప్రతివాడూ "ఎవరో యాక్టరు లోపల ఉన్నాడండీ. ఆయన్ని చూట్టానికి ఈ జనమంతా చేరారు" అన్నాడు, తను ఆ జనంలో భాగం కానట్టు. ఆ యాక్టరెవరో, అతని పేరేమిటో ఒక్కళ్ళకీ తెలియదు. ఎవరైతేనేం యాక్టరు; అదే కావలసింది. అంతకంతకూ జనం ఎక్కువ అవుతున్నారు కాని తగ్గటంలేదు. ఒకర్ని చూసి ఒకరు పనులు మానుకుని దోవనపోయేవారంతా అక్కడ ఆగడం ప్రారంభించారు. తీరా షాపులోంచి బయటికివచ్చిన ఆ పెద్దమనిషిని చూస్తే అరవనటుడు టి. ఎస్. బాలయ్య. ఆ చుట్టుపక్కల పోలీసులు కూడా ఉన్నారు గనుక బాలయ్య తన దోవన తాను క్షేమంగా వెళ్ళిపోగలిగాడు. ★

సినిమా వార్తలు

ఈస్టిండియా ఫిలిమ్స్‌వారి "సంక్రాంతి" చిత్రం ఈ నెల 11 న విడుదల కానున్నదని తెలుస్తున్నది. దర్శకుడు సి. పుల్లయ్య. శాంతకుమారి, శ్రీరంజని, సావిత్రి, ఆశాలత, చంద్రశేఖరం శివరావు మున్నగువారు నటిస్తున్నారు.

* * *

ఎమ్. కె. ఎమ్. వారి "మరదలు పెళ్ళి" ప్రతిభా వారి "చిన్నకోడలు" కూడా జులై ఒకటి రెండువారాల్లో విడుదల కావచ్చునని అనుకొంటున్నారు.

* * *

అజంతా వారి "వయ్యారిభామ"ను కూడా జులైలోనే విడుదలచేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మూడువంతులకు పైగా పూర్తయింది నాగేశ్వరరావు, సి. ఎస్. ఆర్., ఎస్. వరలక్ష్మి, సులోచనాదేవి మొదలైన నటీనటులు, రాజేశ్వరరావు అమృత సంగీతం, రసవంతమైన కథ, ఈ చిత్రంలోని ఆకర్షణలు.

* * *

అంజలీవారి "పరదేశి" మూడువంతులు తయారయినది. పల్లెగూడెం సెట్టుమీద షూటింగ్ జరుగుతున్నది. త్వరలో మరొక కొత్తసెట్ నిర్మించనున్నారు. ప్రసాద్ దర్శకత్వం క్రింద అంజలి, నాగేశ్వరరావు రేలంగి, గణేశన్, వసంత మున్నగువారు నటిస్తున్నారు. కెమేరా కమాల్ ఘోష్;



అంజలీ పిక్చర్సు వారి "పరదేశి"లో అంజలి



ఈస్టిండియా ఫిలిమ్స్ వారి "సంక్రాంతి"లో సంక్రాంతికన్య సావిత్రి

సంగీతం ఆదినారాయణ; పాటలు; మాటలు కృష్ణశర్మ; ఆర్టు టి. వి. ఎస్. శర్మ.

* * *

నారాయణన్ & కో వారు తెలుగు అరవములలో ఒక కొత్తచిత్రం తీయ నిశ్చయించారనీ, పి. పుల్లయ్యగారు దర్శకత్వం తీసుకోవచ్చుననీ తెలుస్తున్నది.

* * *

బెంగాల్‌లో సహకార విధానంమీద చిత్రాలు విమర్శించాలనే ధోరణి ఎక్కువౌతున్నదట. సహకార విధానమంటే కొంత పెట్టుబడి పెట్టగలిగిన డైరెక్టర్లు, టెక్నీషియనులు, నటీనటులు ఒక కంపెనీగా ఏర్పడి చిత్రంతీసి, లాభాలలో సమానవాటాలు పంచుకుంటూ రన్నమాట. ఇంతవరకూ ఈ మాదిరిగా తీసిన చిత్రాలన్నీ ఆర్థిక విజయం పొందాయట. ప్రస్తుతం గిఝవాలా, ఘూర్ణి, జలియత్ అనే మూడుచిత్రాలు తయారవుతున్నాయట. ఇవన్నీ వాస్తవిక దృక్పథంతో తీయబడుతున్న సాంఘిక చిత్రాలే.

* * *

న్యూథియేటర్సువారు ఇటీవల మరొక గొప్పచిత్రం విడుదలచేశారు. ప్రబోధ్ సన్యాల్ అనే రచయిత సుమారు ఇరవై ఏళ్ళ కిందట తన హిమాలయయాత్రను గురించి రాసిన గ్రంథాన్ని ఆధారంగా తీసుకుని బెంగాలీలో "మహా ప్రస్థానేర్ పథే" అనే చిత్రాన్ని, హిందీలో "యాత్రిక్" అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి స్క్రిప్టు రాసినది అసలు రచయితే. దర్శకుడు కార్తీకచటర్జీ. ఈ చిత్రం బాక్సాఫీస్ విజయమే కాకుండా విమర్శకుల ప్రశంసలను కూడా అమితంగా చూరగొన్నది.

బెంగాలీతార కన్ననదేవి "లబ్ధచూర్ణ" అనే చిత్రం తీస్తున్నది...

* * *

ఈమధ్య బొంబాయి రంజిత్ స్టూడియో అగ్నిప్రమాదానికి లోనైనందున స్టూడియోలో ఉన్న మూడుచిత్రాల తాలూకు నెగటివ్‌లు దహనమయ్యాయి. వాటిపేర్లు బహూదూర్, ఫుట్‌పాత్, పాపి. వీటినిచందూలాల్‌షా తిరిగి మొదటినుండీ నిర్మిస్తున్నాడు.

* * *

ఈనెల 15వ తేదీన దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలి ఆధ్వర్యాన చిత్రనిర్మాతల డిస్ట్రిబ్యూటర్ల ప్రథమసమావేశం జరిగింది. ఫిలిములపై ప్రభుత్వం అన్నిరకాల అధికారాలను ఉపసంహరించుకోవాలని, ఫిలిం విచారణ సంఘంవారి నివేదికను ప్రభుత్వం ఆమోదించి అమలుజరపాలని సమావేశం వారు తీర్మానాలు చేశారు. సినిమాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరటానికి సమావేశంవారు నిశ్చయించారు. తమ పరిశ్రమపైన ప్రభుత్వం విధిస్తున్న వివిధములైన పన్నులను తగ్గించాలని, సెన్సారింగ్ రుసుమును తగ్గించాలని కూడా వారు కొన్ని తీర్మానాలలో కోరారు.

ప్రభుత్వ ఫిలింశాఖ ప్రాంతీయ అధికారి కె. శ్రీనివాసన్‌గారు ఈ సంవత్సరారంభంలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శింపబడిన "పాతాళభైరవి" చిత్రనిర్మాత బి. నాగిరెడ్డిగారికి ప్రశంసాపత్రం బహూకరించారు. ★

హాస్యాహాసాలు

(4-వ పేజీ తరువాయి)

వాళ్ళిద్దరూ కలిసి కూర్చుంటే, కలసి తిరుగుతుంటే చూస్తూ ఎంతో ముచ్చటపడుతూ యింత అన్యోన్యతకల దాంపత్యం కళ్ళతో చూడ్డాని కెంత నోచుకున్నానో అనుకుంటూ సంతసిల్లేదామె. ఈ స్వాప్నిక క్షణాల్లో అబ్బాయి కంచం ముందునుంచి లేచివెళ్ళడమే తెలియ దామెకు.

శ్రమించిన శరీరం — వ్యధించిన హృదయం ఆహారస్పర్శ తగలడంతో పట్లు తప్పాయి. కూర్చుండగానే కునుకు పట్టిపోతోంది.

"అయిన బోలెడు డబ్బూ ఈ వాజమ్మ చదువుకోసం తగలెట్టాను. అప్రాచ్యుడు వచ్చాడా!" అంటూ పెద్దగా పెట్టిన కేకల్తో మగతపోయింది. "ఏమీ అనకండి. అసలే వాడు దిగాలుపడి ఉన్నాడు. మరీ బెదరగొడితే ఏమైనా అయిపోతాడు" అని అమ్మ పెట్టిన అదురుతో అణిగిపోయాడు. ఇంట్లో అందర్నీ అదుపులోకి తెచ్చిన అమ్మ అధికారాన్నీ, చమత్కారాన్నీ అభినందించాడు. సాయంకాలం అయిపోయిందే కాని సీత కంటికెక్కనుపించలేదు. ఎంత అన్యాయం జరిగిపోయింది. ఒక్క డబ్బేతిండేనా కావలసింది? తను పరీక్ష తప్పడంతో డబ్బు సంపాదించలేని అసమర్థుణ్ణి — డబ్బు లేనివాడికి, సంపాదించుకోలేనివాడికి తిండి దొరకదనే నమ్మకం సీతను మరగుపరచింది. దీనికి పగ తీర్చుకోడానికి దారి వెదుకుతున్నాడు. ఏ దారీ దొరకక బాధపడుతున్న వాళ్ళల్లో ఈతడు కూడ ఒకడై పోతున్నాడు డబ్బున్న వాళ్ళ మీద డబ్బు లేనివాళ్లు పగ సాధించగలగడం అసామాన్యం. ఇంతవరకూ దీన్ని సాధించి సంతోషంగా కాలం గడుపుతున్న వాళ్లెవరైనా ఎక్కడైనా ఉన్నట్టు గూడ ఇతడు వినలేదు. అసాధ్యమైన అన్వేషణ మాత్రం చేస్తున్నాడు. ఇవన్నీ ఎండమావులతో యేమో ననుకుంటున్నాడు. ఇవన్నీ పేదవానిపగ లనుకున్నాడు. ప్రయత్నిస్తున్నాడు. దారి దొరకడంలేదు. ప్రయత్నానికి ఫలితం దూరమౌతోంది. మానవునికి పట్టుదల ఎక్కువౌతోంది. తనకు పగ తీర్చుకోవడం చేతకాదేమో నని అనుమానిస్తున్నాడు. అదే నిజమైతే తను బంధులోకంలో స్నేహితుల మధ్య బ్రతకడం శుద్ధ దండుగ అనుకున్నాడు.

మానవుడు ఏ క్షణంలో ఆనందించగలడో ఏ క్షణంలో దుఃఖించగలడో ఊహించనైనా ఊహించలేడు. తను సీతపై కన్న మధురస్వప్నాలు, నిర్మించుకున్న ఊహాసౌధాలు, మునిగి తేలిన మధురస్వపంతులు, చిత్రించుకున్న ఆశాచిత్రాలు, ఊయల లూగిన మలయమారుతాలు, విహరించిన వెన్నెలలు ఒక్కసారిగా భగ్నవీణలై, విషాదగీతికలై, శిథిలాలయాలై, విచ్ఛిన్న అమృతభాండాలై, గాఢతిమిర నిశీథులైపోయాయి. సీత లేని తన తనువే వృథాగా తోచింది. సీత లేని జీవితమే వ్యర్థ మనుకున్నాడు. సీత లేని సంసారాన్ని తను అవిష్కరించ ననుకున్నాడు. అతనికి సంఘటన విషాదాంతమే అయింది పాపం. ★

రెండు మహానగరాలు

(7-వ పేజీ తరువాయి)

పీడన, ఋణాలు, తణఖాలూ, దౌర్జన్యం, ఆకలి, క్షోభ ఈ కిరాతాలన్నిటితో కుళ్ళికుసమారి కూలబడిపోవటానికి సిద్ధంగా వుంది ఈ గోపురం.'

'ఓహో! అలాగా'—అన్నాడు పెద్దదొర.

'ఇది దైవ(ప్ర)పవల్ల యేనాటికైనా నా చేతుల్లోకి వచ్చే సావకాశం వుంటే దీన్ని సమర్థులైన మరొకళ్ళ చేతుల్లో బెడతాను. ఈ భూమిని విడవ లేక దాన్ని అంటిపెట్టుకుని బ్రతుకటానికి ప్రయత్నించుతూన్న ఈ అభాగ్యప్రజల కష్టాలను తొలగించగల మహాపురుషు లెవరికైనా వప్పగింత చేస్తాను. అయినా అలాంటి మహదవకాశం రాదనుకుంటాను ఈ దేశం అలా బాగుపడటానికి యిక వీలేదు. సర్వం నాశనమైపోవటం విధి నిర్ణయమైనట్లు కనుపించుతోంది.'

'ఈ నూతన సిద్ధాంతాన్ని కిరీటంలా ధరించి నీ వొక్కడివీ మాత్రం పూజనీయుడవై బ్రతుకదలచావన్నమాట!'

'నా బ్రతుకు తెరువుకు యేవిటి?—ఈనాడు గాకపోతే మరోనాడు మానమర్యాదలుగల నా దేశీయు లందరూ ఎలా బ్రతుకవలసివుందో అలా బ్రతుకుతాను—ఎదో కష్టం చేసుకుని'

'ఇంగ్లండులో నేనా?'

'అవును—నేను ఈదేశంలో లేకుండావుంటే— నావల్ల మీ వంశగౌరవం చెడుతుందేమోనని భయమేమీ వుండదు. ఇతర దేశాల్లో బ్రతుకుతున్నప్పుడు కూడా నేను మీ వంశంవాణ్ణని చెప్పుకోను.

పెద్దదొర గంటకొట్టగానే ప్రక్కనున్న పడకగదిలో దీపాలు వెలిగినై. ఆ వెలుగు యివతలి గదిలోకి కూడా పడ్డది. ఆ గదిలోనుంచి నౌకరు బయటికి వెళ్ళేదాకా తమాయించి పెద్దదొర ఇలా అన్నాడు.

'అక్కడ హాయిగా కాలక్షేపం చెయ్యటానికి సావకాశంగా వుండటంచేత ఇంగ్లండుమీద నీకు చాలా మోజుగా వున్నదన్నమాట'—చిన్న చిరునవ్వు నవ్వాడు.

'అక్కడైనా నేను కులాసాగా కాలక్షేపం చేయగలిగావంటే, ఇంకా పూర్తిగా మీదయ తప్పకపోవటంచేతనే అనే విషయం నాకు తెలుసు—ఏదోవిధంగా ఆదేశంలో కాందిశీకుడుగా తలదాచుకుంటున్నాను'—

'కాందిశీకుడు—ఈ కాందిశీక సన్యాసులకందరికీ ఆశ్రయమిస్తున్నామని—ఆ యింగ్లీషువస్మరంతులు డబ్బీలు చరుస్తున్నారు—వాడెవడో డాక్టరు నీకు మల్లేనే అక్కడ కాందిశీకుడై యేడుస్తున్నాట్ట వాణ్ణి యెరుగుదువా?'—

'ఎరుగుదును'—

'వాడికో కూతురుందా?'

'అవును'—

సరే—డాక్టరూ డాక్టరు కూతురూ—ఈ కొత్తవేదాంతం యెలా బయలుదేరిందో అర్థమౌతోంది—వెళ్ళి పడుకో! చాలా అలసిపోయావ్!'—

లోపలికి వెడుతూ జమిందారు రీవిలో తలపంకించి ఒక చిరునవ్వు నవ్వాడు:

నౌకరును కేకబెట్టి, చిన్నదొర పడుకోటానికి యేర్పాటు చెయ్యమని చెప్పి, మరో నౌకరును వెంటబెట్టుకుని తన పడక గదిలోకి తను వెళ్ళిపోయాడు.

పడకగదిలోకి వెళ్ళి దుస్తులు మార్చుకున్నాడు. వదులాటి అంగరకా తొడుక్కుని గదిలో అటూయిటూ పచారుచేస్తున్నాడు. మెత్తని స్లిప్పర్లు తొడుక్కునివుండటంచేత పాదాలు నేలమీద చప్పుడు కావటంలేదు. నాగరికతను అలవరుచుకున్న పెద్దపులిలా పంజాలు ముడుచుకుని గదిలో గోరాడుతున్నాడు.

గదిలో ఈ వేపునుంచి ఆ వేపువరకూ పచారు చేస్తున్నాడు. మార్గమధ్యంలో జరిగిన సంఘటనలన్నీ—ఒకటొకటే తిరిగి మెదడులో కదులుతున్నయ్—పసిబిడ్డ బండిచక్రాలక్రిందపడి నెత్తురుముద్ద క్రింద పిడచగట్టిపోవటం—ఆజానుబాహు డొకడు ఆ నెత్తురుముద్దను బుజాన వేసుకుని: "చంపేశారు!" అంటూ అరవటం—ఇదంతా మళ్ళీ ఒకసారి స్ఫురణకువచ్చి అణగిపోయింది.

బుర్రలోవున్న భావాలన్నీ సమసిపోయిన తరవాత హాయిగా వెళ్లి పందిరమంచంమీద పవ్వళించి చుట్టూ దోమతెరలు దించేసుకున్నారు.

తెల్లవారింది గ్రామంలోవున్న జనమంతా ఎవళ్ళపనుల మీద వాళ్లు వెళ్ళిపోతున్నారు. కొంతమంది కుళాయిదగ్గర చేరి గుడ్డ లుతుక్కుంటున్నారు. కొంతమంది పొలాలమీదికి వెడుతున్నారు; కొంతమంది గొడ్డూ గోదా పనులు చూసుకుంటున్నారు. చర్చిలోనూ, శ్మశానంలోవున్న యేసుక్రీస్తు కొయ్యబొమ్మముందూ మోకరిలి ఒకరిద్దరు అనాథలు ప్రార్థనలు చేస్తున్నారు. బక్కచిక్కిపోయిన ఒక ఆవు గోరీ దిబ్బలమీద పట్టిన పసిరికను ఆప్యాయంగా మేస్తోంది.

నీలిటోపీతోసహా మన రోడ్డుకూలీ ప్రొద్దుపొడుపుతోనే పనిలోకి వెళ్ళాడు. కొండగుట్టమీద కంకర గొడుతున్నాడు. అతను తెచ్చుకున్న చద్దిమూట ఒకరాళ్లగుట్టమీద పెట్టి వుంది. ఆ చద్దిమూట అంతా కలిసి కాకులకు విదిలించటానికి ఉంచిన కబళమంతకూడా లేదు.

కంకర కొడుతూకొడుతూ చివాల్న తల పైకెత్తి గ్రామం వంక చూచాడు. చూచీ చూడటమే ఏదో శివంపూనినవాడులాగు, నెత్తిమీది నీలిటోపీ చేత్తో బుచ్చుకుని, కొండమీదినుంచి క్రిందికి పరుగెత్తు కొచ్చేస్తున్నాడు—కాలుజారితే తల వక్కలౌతుందనే స్పృహకూడా లేకుండా.

ఊళ్ళోవున్న జనమంతా నడివీధిలో కుళాయిదగ్గిర మూగివున్నారు. ఏదో ఆందోళనగా గుసగుస లాడుకుంటున్నారు. సంభ్రమ భయాశ్చర్యాలతో వాతావరణమంతా గందరగోళంగా వుంది. దేవిడీకి సంబంధించిన నౌకర్లూ గుర్రాలశాల దగ్గిరున్న సిపాయిలూ, ఇతర గ్రామాధికారులూ యావన్మందీ ఆయుధాలు ధరించివున్నారు.

నీలిటోపీ రోడ్డుకూలీ జనాన్ని తొలగదోసుకుంటూ మందిలోకి వచ్చాడు. ఆ గందరగోళమంతా యేవిటో అతనికి అర్థంకాలేదు. మాన్సియర్ గాబెల్లీ చివాల్న గుర్రంమీదికి ఎగిరి కూర్చున్నాడు. గుర్రాలు దివాణంవేపు గాలప్ తీస్తున్నాయ్.

దివాణంలోని తన పడకగదిలో, జమీందారు, పందిర మంచంమీద చచ్చిపడున్నాడు. ముఖం రాతిబొమ్మలా బిగుసుకుపోయింది. డొక్కలో దిగబడివున్న బాకుపిడికి ఒకచిన్న చీటీ కట్టివుంది. ఆ చీటిమీద ఇలా వ్రాసివుంది.

'వాణ్ణి వెంటనే ఖూనీ చెయ్యాలి—ఇది జాక్వస్ ఉత్తరువు'—

★


అల్లరిలో ఆనందం

(18-వ పేజీ తరువాయి)

ఓ పాఠకమహాశయా! మీరే గనక అప్పుడక్కడ ఉంటే ఏం చూచేవారో తెలుసా? మొదట ఇద్దరు కుర్రాళ్లు కొంచెము నాగరికమైన భాషలో గౌరవించుకోడం; ఇంతలో పెద్ద గుంపు చేరటం; ఆ గుంపులో ఒక స్థూలకాయుడు తనకేదో ఆ దెబ్బలాట కారణం తెలిసినట్లు చిలవలు పలవలుగా కథ అల్లి, మా పౌరశాలని తిడుతూ రెక్కరివ్వడం, గుంపులో కొందరాయనకు తాళం వేయడం, ఆయోధులిద్దరూ తమని విడిపించడానికి వచ్చిన ఘరీ యిద్దరు కుర్రాళ్ళను విదిలించి పారవేయడం, ఇంతలోకే మా మెయిన్ రోడ్ అతి విశాలం కావడంవల్ల ట్రాఫిక్ బంద్ అయి, పోగా రెండు ఎర్రబుట్టలు రంగంల్లోనికి రావడం చూస్తారు. మీరు చూచిన ఆయిద్దరు యోధులెవరో తెలుసా? నేనూ? మావాడూ. ఇక మమ్మల్ని విడిపించడానికి వచ్చిన వాళ్లు మా వాళ్లే ఇక పోతే మామీద లేనిపోని నిందలు వేసి, పబ్లిసిటీ డిపార్టుమెంటును గుత్తకు పుచ్చుకున్నది ఆ రాత్రి నాకు కనపడిన 'గురువు' గారే! ఆ తరువాతేం జరిగిందంటే, మా నాటకం అంత్యదశలోనికి రావడం చూసి నేను కన్ను గీటాను. దానితో మావాడు అమాంతం నామీదపడి కౌగలించుకున్నాడు. అప్పుడు మేం నలుగురం కలిసి జట్టా పట్టాలు వేసుకుని సగర్వంగా ఆ మాష్టరు గారి కేసి తిరిగి, దరహాసవదనారవిందులమై, నమస్కార పూర్వకంగా కొంచెం వంగి, నవ్వుతూ (గట్టిగా తిన్న దెబ్బలకు నవ్వు తెచ్చుకోవడం కష్టమైంది సుమండీ!) బైటకు నడిచాం. పాపం తెల్లబోయి నవ్వబోతున్న ఆ జనసమూహం తమకు తెలియకుండానే మాకు దారి ఇచ్చేశారు.

ఇంకా కొంతసేపటిదాకా మీ రక్కడనే ఉండినట్టయితే, సంభ్రమాశ్చర్యాల లోనుండి తెప్పరిల్లుకొని కాగితాలు పెన్సిల్ను జేబులో కుక్కుకుంటున్న పోలీసునీ, కత్తివాటుకుకూడ నెత్తురుచుక్క లేక యావత్తు జీవకళనూ కోల్పోయి బరువుగా నిట్టూర్పులు విడుస్తున్న ఒక అమాయకుడినీ చూడగలరు.

పాపం! మావాడు బయటికి వచ్చేస్తూ వాయించిన 'షాత్ ఆర్గన్' గీతికలు ఆయన గుండెల్లో కుంపట్లు పెట్టాయికామోసు! ★







సాంకేతిక భాష

(27-వ పేజీ తరువాయి)

గొట్టు మొఖంతో జాగ్రత అని చెప్పి మరీపోయే వాణ్ణి. పరాయి వాడెవరన్నా వింటే ప్రమాదమేమోనని, అక్కడికీ, యితరులకు బోధపడకుండా 'అశ్వని ప్రక్కది జ్యేష్ఠ ప్రక్కన పెట్టానే, జాగ్రతగా తగలబడవే' అని కేకవేసిచచ్చాను కదండీ-యిన్ని ఏళ్లూ!" కొంటూ తన బాధనంతా వెళ్లపోసుఅన్నాడు.

పరామర్శకు వచ్చిన వారిలో ఒకడుగానే వచ్చిన ప్రక్కయింటి కాపు అందుకొని "అవధాన్లుగారూ, పోయిన వస్తువు ఎంత ఏడిస్తే మాత్రం తిరిగి వచ్చుద్దా! కాక పోయినా యింటో పెట్టింది యాడ బోద్ది? పొద్దత్తమానం యాధిలో నుల్చొని 'అచ్చని ప్రక్కది జ్యేష్ట ప్రక్క పెట్టానేవ్' అంటూ అరవటం ఎందుకంట? మీరట్టా నలుగురూ యినేలాగు వోరికి అర్థం కాని బాస మాట్లాడితే అందులో ఏదో కిటుకు వుండుద్దని ఎవుడికో తోసి వుంటుద్ది. ఆ అయ్య యింత పనీ సల్లగా సేసేడు. మీ బాసే మీకొంప దీసింది." అని పైగుడ్డ దులుపుకొంటూ వెనక్కు మళ్ళి యింటికి పోయాడు. ★

Edited Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras



మహాబలిపురంలో సముద్రతీరాన దేవాలయం

—ఛాయాచిత్రకారుడు : శ్రీ పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి.

Regd. No. M. 4479.

